www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 46 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు భాద్రపద బహుళ పాడ్యమి
08-14 సెప్టెంబర్ 2025
వెల : ₹20/-




## భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపితేనే సార్థకత!

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



భారతీయ సాహితీ ద్రష్ట

భండారు సదాశివరావు స్మారక

# కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు స్మారక 'కథల పోటీ - 2025' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..



ప్రథమ బహుమతి : రూ. 12000/-

ద్వితీయ బహుమతి : రూ. 7000/-

తృతీయ బహుమతి : రూ. 5000/-

## నిబంధనలు :

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.
8. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.

**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 10 సెప్టెంబర్, 2025**

# జాగృత 'సంఘ శతాబ్ది'

- ప్రతి ఏటా మీ ఇంట దీపావళిని మరింత శోభాయమానం చేసే అక్షరజ్యోతుల సమూహం– జాగృతి ప్రత్యేక సంచిక.
- ఆత్మవిస్మృతి అనే చీకటిని చీలుస్తూ నిత్యం వెలిగే అక్షరావళి జాగృతి వారపత్రిక.
- కానీ ఈ దీపావళి సంచిక మరీ మరీ ప్రత్యేకం.
- ఇది సంఘ శతాబ్ది సందర్భంగా వెలువడుతున్న సంచిక.
- అంటే, భారతదేశాన్ని విశ్వగురువుగా ప్రతిష్ఠించాలన్న మహోన్నత ధ్యేయంతో వందేళ్లుగా పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ అంతరంగాన్నీ, ప్రస్థానాన్నీ మీ ముందుకు తెచ్చే సంచిక.
- ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావమే హిందూ సమాజంలో ఒక మలుపు. ప్రయాణమే ఒక పోరాటం. ఈ నూరేళ్ల చరిత్ర అసమానం. సేవ, దేశభక్తి ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా సాగుతున్న సంఘ ప్రస్థానం నిరుపమానం. ధర్మరక్షణ కోసం జరిపిన సమరం మహోన్నతం. ఈ అంశాలను గుర్తు చేస్తూ సంఘ పెద్దలు, ప్రముఖులు రాసిన వ్యాసాలతో ఈ దీపావళి ప్రత్యేక సంచిక ముస్తాబవుతున్నది..
- ఇంకా కథలు, కార్టూన్లు అదనపు ఆకర్షణ.

**సంచిక తేదీ : అక్టోబర్ 20, 2025**

**త్వరపడండి!**



అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 06లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

**పేజీలు: 300**
**వెల:150/-**

- ➡ 25 నుంచి 50 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
- ➡ 51 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
- ➡ 100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.
- పార్శిల్ ఖర్చులు అదనం

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - **9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

అది కాంగ్రెస్ పార్టీ. ఘనతల కంటే, చీకటికోణాలే కోకొల్లలుగా ఉన్న చరిత్ర దాని సొంతం. స్వాతంత్ర్యోద్యమంలో బాలగంగాధర తిలక్, సుభాశ్‌చంద్ర బోస్, వినాయక్ దామోదర్ సావర్కర్ వంటి జాతీయవాదుల కంటే ఆంగ్లేయులనీ, ముస్లిం మతోన్మాదులనీ భుజాలకెత్తుకుని పూజించి, పునీతమైన పార్టీ కూడా. స్వతంత్ర భారతదేశంలో సర్దార్ పటేల్, పురషోత్తమదాస్ టండన్ వంటి వారి చరిత్రలు, నిజానికి అసలు సిసలు త్యాగధనులందరి చరిత్రలను కనిపించకుండా చేయడానికి శతథా ప్రయత్నించిన పార్టీ. ఇక రాహుల్ కాంగ్రెస్. అది భారతదేశాన్ని విదేశీ గడ్డల మీద అవమానిస్తుంది. ఇక్కడి కోర్టులను గౌరవించదు. రాజ్యాంగ వ్యవస్థలను మన్నించదు. భారతీయ సంస్కృతిని అణుమాత్రమూ సహించదు. భారతమాత అనే మాట వింటేనే తేళ్లూ, జెర్రిలూ పాకినట్టు ఉంటుంది దానికి. కాబట్టే ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తి స్వర్గీయ హీరాబెన్ విషయంలో ఇంత నీచాతినీచంగా వ్యవహరించింది. ఏనాడూ రాజకీయాలతో ఎలాంటి సంబంధం పెట్టుకోని, ఇప్పుడు మన మధ్య కూడా లేని వృద్ధురాలిని అంత కుసంస్కారంగా దూషించే నీచత్వం ఆ పార్టీకి మాత్రమే చెల్లుతుంది. ఇంత జరిగినా క్షమాపణ చెప్పే కనీస సంస్కారం చూపకపోవడం ఆ పార్టీని నడుపుతున్న రాహుల్ గాంధీకే సాధ్యమవుతుంది. అతడి కంటె ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్టు, కుసంస్కారంలో, దిగజారి మాట్లాడడంలో తాము కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం తీసిపోమని జాతికి వెల్లడించిన మరొక పార్టీ తృణమూల్ కాంగ్రెస్. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా ఏమన్నారు? తల నరికి బల్ల మీద పెట్టాలట. ఇదీ ఈ దేశంలో విపక్షాల రోత వైఖరి. ఈ దేశ ప్రధాని పదవి నెహ్రూ-గాంధీ కుటుంబంలోని వ్యక్తి తప్ప అన్యులు తాకరాదన్నది కాంగ్రెస్ నమ్మే శాశ్వత సూత్రం. హిందూత్వాన్ని పెకలించి, ముస్లిం మతోన్మాదుల సాయంతో తామే బెంగాల్‌ను శాశ్వతంగా ఏలాలన్న వికృత సిద్ధాంతం ఆ కాంగ్రెస్ తానులో ముక్క తృణమూల్ కాంగ్రెస్‌ది.

ఇందిర, రాజీవ్ ఏలుబడి కాలాల నుంచి పరిశీలించండి! కాంగ్రెస్ పార్టీ దేశంలో ఎక్కడ ఏ పేరుతో ప్రదర్శన నిర్వహించినా, ఊరేగింపు తీసినా గాయాల జాడలు మిగిలేవి. ఇప్పుడు బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' పేరుతో రాహుల్ విన్యాసం

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు భాద్రపద బహుళ పాడ్యమి**

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం

**భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలిపితేనే సార్థకత!**

6లో

ప్రత్యేక వ్యాసం

**సంపూర్ణ అక్షరాస్యత ఇంకెంత దూరం?**

12లో

కొత్త ధారావాహిక నవల

**గణపతిదేవుడు**

- మత్తి భానుమూర్తి

20లో






# జాగృతి

## సంపాదకీయం

చేస్తున్నారు. పక్కన తేజస్వీ యాదవ్ అనే ఒక గంథోళీగాడు కూడా ఉన్నాడు. ఇద్దరిదీ ఒకటే చింత. రాహుల్ వ్యాకులత–గాంధీ–నెహ్రూ కుటుంబానికి అవతలకి పోయిన ప్రధాని పదవి ఇంకా తమ వశం కావడం లేదని. తేజస్విది బిహార్ ముఖ్యమంత్రి పీఠం ఎక్కడానికి తాను ఇంకా ఎంతకాలం ఆగాలన్న ప్రశ్న. ఈ ఇద్దరూ కలసి చేస్తున్న యాత్రలోనే దర్భంగా పట్టణంలో ప్రధాని మోదీనీ, ఆయన తల్లినీ వేదిక మీద నుంచే ఒకడు అక్షరాలా బూతులు తిట్టాడు. ఆ తిట్లు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. ఆ ద్విపాద జంతువు పేరు మహమ్మద్ రిజ్వీ/రజా. దర్భంగాలోనే సింఘ్వారా అనే ప్రాంతం వాడు. ఇతడిని

# తల్లులను తిట్టే, తలలు నరికే..!

ఆగస్ట్ 29న అరెస్టు చేశారు. ఆగస్ట్ 27న రిజ్వి ఈ కూతలు కూశాడు. దీనితోనే పట్నాలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బాహాబాహీ తలపడవలసి వచ్చింది. పట్నా ఘర్షణ మీద రాహుల్ స్పందిస్తూ, మా పార్టీ ఎంతటి హింసనైనా అహింసాయుతంగానే ఎదుర్కొంటుందని తింగరి మాటలు చెప్పారే తప్ప, ఒక వృద్ధురాలిని నీచంగా దూషించడం తప్పని మాత్రం అనలేకపోయారు. ఇంతకంటే నీచం, కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖెరా జుగుప్సను దంచిన మాటలే దేశం మీద ఉమిశారు. బీజేపీయే తమ ఏజెంట్ చేత అలా తిట్టించిందట. దర్భంగా యాత్ర నిర్వాహకుడు యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ నౌషాద్ క్షమాపణ చెప్పినా, ఆ సమయంలో తాను అక్కడ లేనని తప్పించుకున్నాడు. అలాగే కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఉదంతంతో తమకు సంబంధం లేనట్టే మాట్లాడింది. రాజకీయాలు ఇంత జారిపోయాయా అంటూ బీఎస్‌పీ అధినేత్రి ప్రశ్నించడం ఇందుకే మరి! చాలా పార్టీలు నోరే ఎత్తలేదు. మహిళా సంఘాలు నోళ్లు కుట్టేసుకున్నాయి.

తమ పార్టీ మూల సంస్థ కాంగ్రెస్ ప్రధాని పట్ల అంత అవమానకరంగా వ్యవహరిస్తే, తాము కొంతయినా అవమానించాలి కదా అన్నట్టు వ్యవహరించింది టీఎంసీ. ఇది కేంద్ర హోం మంత్రిని లక్ష్యంగా చేసుకుంది. అమిత్ షా తల నరకేయాలని ఆగస్ట్ 26న నాడియాలో విలేకరుల ఎదుట ఆ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా విషం కక్కారు. పశ్చిమ బెంగాల్‌లోకి చొరబాటుదారులు రాకుండా ఆయన విఫలమయినందుకు ఆ మాత్రం శిక్ష విధించాలని మహువా మహిళామణి చిరుకోరిక. చొరబాట్ల కారణంగా పశ్చిమ బెంగాల్‌లో జన సమీకరణలు మారిపోయాయన్న వాస్తవాన్ని ఆగస్ట్ 15న ఎర్రకోట నుంచి ప్రధాని వెల్లడించడం ఆమెకు పరమ దుర్భరంగా ఉంది. అక్కడ సరిహద్దు భద్రతాదళాలు కాపలా కాస్తున్నా చొరబాట్లు ఎందుకు జరిగాయంటూ మహువా చొప్పదండి ప్రశ్న కూడా సంధించారు.

ప్రధాని కన్నతల్లిని దూషించినా కాంగ్రెస్ వాస్తవ అధినేత రాహుల్ ఖండించరు. కేంద్ర హోం మంత్రి తల నరకేయాలని తమ పార్టీ ఎంపీ వాగినా తృణమూల్ నేత మమతా బెనర్జీ పెదవి విప్పలేదు. ఈ ఉదంతాల మీద కేసులు నమోదు కావచ్చు. కేసులు విచారణకు రావచ్చు. కోర్టు వారు వీళ్లని శిక్షించవచ్చు. లేదా అలా మాట్లాడడం భావ ప్రకటనా స్వేచ్ఛగా పరిగణించి, మర్యాదగా సభ్య సమాజంలోకి తిరిగి పంపవచ్చు. కానీ సభ్య సమాజం మీద, నాగరికత మీద, రాజకీయాల మీద, ప్రజాస్వామ్యం మీద ఈ ధోరణి తన విషపు గోళ్లను ఎంత లోతుకు దింపుతున్నదో మర్యాద తెలిసిన వారంతా ఆలోచించాలి. వీళ్లు రాజకీయాలను బూతుమయమో, హింసాత్మకమో చేస్తున్నారనడం చిన్న మాట. ఒకరు సామాజిక, సాంస్కృతిక నేపథ్యాన్ని కలుషితం చేస్తున్నారు. మరికొందరి తలలు తాలిబన్ తరహా ఆటవిక ప్రవృత్తితో నిండి పోయాయి. ఐదేళ్లు.. పదేళ్లు.. లేదా పాతికేళ్లు.. పదవులలో ఉండగలిగే ఇలాంటి పశు ప్రవృత్తి కాలపరీక్షకు నిలిచిన విలువలపై కాలు దువ్వుతుంటే, ధ్వంసం చేస్తుంటే పౌరులు ఇంకా మౌన ప్రేక్షక పాత్రకు పరిమితం కావడం ఏమిటి? ★

08 సెప్టెంబర్ 2025, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**వెన్నెలకి ఆవల..**

– భమిడిపాటి గౌరీశంకర్





| | | |
|---|---|---|
| సీబీఐ 'గోదా'లో కాళేశ్వరం (తెలంగాణ) | - | 14 |
| సంచార జాతుల జీవితంలో వెలుగెన్నడు? (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| ....సీఎంపై శునకప్రేమికుడి దాడి..! (చర్చ) | - | 23 |
| సత్పురుషులకు విన్నపం (మార్క్సిజం-శ్రీరామరాజ్యం-2) | - | 25 |
| ఆర్థిక వ్యవస్థ మీద రాహుల్ అసత్యాలు (రచ్చ) | - | 26 |
| విశ్వనాథ చూసిన వేంగీక్షేత్రం (గళమెత్తిన గతం) | - | 30 |
| ఆబాలగోపాల 'బాల సరస్వతి' (మహిళ) | - | 32 |
| లద్దాఖ్‌కు నీటి కష్టాలు (పర్యావరణం) | - | 34 |
| దేశవాళీ క్రీడకు కొత్తహంగులు! (క్రీడ) | - | 43 |
| సినిమా విజయం... ఎండమావి చందం! (సినిమా) | - | 50 |




# భారత



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్-ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ ఆర్ఎస్ఎస్ చరిత్రలో తొలిసారిగా భాష, హిందూయిజమ్, గోప్యత, జనాభా, సాంకేతికత, కుల రిజర్వేషన్లు, తదితర అంశాలపై 200కుపైగా సభికులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

కొందరి మాటలు ఈటెల్లా గుచ్చుకుంటాయి. కనిపించని గాయాలను చేస్తాయి. మరికొందరి మాటలు నవనీతంలాగా మృదువుగా ఉంటాయి. గాయాలను మాన్పుతాయి. కొందరు కేవలం దూషించడానికే అన్నట్టుగా మాట్లాడుతుంటారు. మరికొందరు జాతి ఆత్మతో మాట్లాడటానికి ప్రయత్నిస్తుంటారు. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ రెండవ వర్గానికి చెందుతారు. ఆయన ఏ మాత్రం అహంకారం లేని ఒక వినమ్రపూర్వకమైన ఇంటి పెద్దలా కనిపించారు. ఆయనలోని హాస్య చతురత, నిష్కపటత్వం ఆర్ఎస్ఎస్ సుదీర్ఘకాలంగా పెంచి పోషించిన సంయమనం, మూలాలకు అంటుకుపోవడాన్ని ప్రతిబింబిస్తాయి. భారతదేశ చారిత్రక, సాంస్కృతిక అఖండత పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రదర్శిస్తాయి. ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలను పురస్కరించుకొని ఆగస్టు 26 నుంచి 28వ తేదీ వరకు మోహన్ భాగవత్ ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో వేలాది మందిని ఉద్దేశించి వరుసగా ప్రసంగాలు చేశారు. ఆర్ఎస్ఎస్‌కు ఆ ప్రసంగాలతో అదనపు బలం చేకూరింది. 1925లో కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ స్థాపించిన ఆర్ఎస్ఎస్ ఇంక ఎంత మాత్రమూ ఒక సామాజిక ప్రయోగం కాదని యావత్ ప్రపంచానికి గుర్తు చేసింది. సంఘ్ రెండవ శతాబ్దంలో ఒక సాంస్కృతిక శక్తిగా అవతరించడానికి సన్నాహాలు చేసుకుంటుందనే సంగతిని అంతర్జాతీయ సమాజానికి తెలియపరిచింది. ఆర్ఎస్ఎస్‌లో గోప్యంగా ఏదేదో జరుగుతుందనే

# దేశాన్ని
# ్వగురు స్థానంలో
# పితేనే సార్థకత!



కువిమర్శలకు గట్టిగా బదులిచ్చింది. ఒక స్పష్టమైన సందేశాన్ని సూటిగా ఇచ్చింది. అదేమిటంటే.. విమర్శకులకు ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయాలు, శాఖలు తెరిచి ఉంటాయి. వారు స్వయంగా రావాలి. అక్కడ జరుగుతున్నది చూడాలి. వాస్తవం తెలుసుకోవాలి లేదా ఆర్‌ఎస్‌ఎస్‌పై విషాన్ని కక్కడం మానుకోవాలి అని. ఒక విధంగా చెప్పాలంటే ఈ సందేశం సూటిగా కాకపోయినా, ఇచ్చింది మాత్రం రాహుల్ గాంధీకే. ఈ మహాశయుడికి ఎన్నికలు ముంచు కొస్తున్నాయనగా విపక్షాలు గుర్తుకొస్తాయి. వాటిని కూడగట్టుకొని కొద్దో గొప్పో ఓట్లు సొమ్ము చేసుకోవా లంటే ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శించడమే ఆయన ముందున్న ఏకైకదారి. ఆయన ముత్తాత నెహ్రూ, నాయనమ్మ ఇందిరా గాంధీ చేసిన విమర్శలకు కాలం చెల్లిపోవడంతో ఇప్పుడు నోటికి ఏది వస్తే అది వాగుతున్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో దేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి ముప్పు వాటిల్లుతోందని, హిందుత్వాన్ని యావత్ దేశంపై రుద్దుతోందని, బీజేపీపై అలవిమాలిన పెత్తనం చేస్తోందని.. ఇలా సాగుతోంది అతడి వాచాలత్వం. అలాగని ఆర్‌ఎస్‌ఎస్ చూస్తూ ఊరుకోవడంలేదు. తగిన విధంగానే సమాధానం చెబుతోంది. మాటలతో కాదు చేతలతో. విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన కార్యక్రమా నికి విపక్ష నేతలను, అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులను ఆహ్వా నించింది. తద్వారా తాను కేవలం ఒక వర్గానికి పరిమితం కాదని రాహుల్ గాంధీ లాంటి కుసంస్కారులకు స్పష్టం చేసింది. 100 సంవత్స రాల సంఘ్ యాత్ర: సరికొత్త క్షితిజాలు – 100 ఇయర్స్ ఆఫ్ సంఘ్ యాత్ర: న్యూ ఆరిజన్స్ పేరిట జరిగిన ఈ కార్యక్రమా నికి దాదాపు 2,000 మంది హాజరయ్యారు. వారిలో అమెరికా, యూకే, జర్మనీ, జపాన్, సౌదీ అరేబియా, యూఏయీ లాంటి 50కి పైగా దేశాలకు చెందిన దౌత్యవేత్తలు కూడా ఉన్నారు. కార్యక్రమానికి వారి ప్రాతినిధ్యం సైద్ధాంతిక ప్రవాహాల సంగమంగా ఉన్న భారత్‌ను ఒక భౌగోళిక శక్తిగా అవతరింపజేయడంలో ఆర్‌ఎస్‌ఎస్ పోషించే పాత్ర పట్ల అంతర్జాతీయ సమాజానికి ఉన్న ఆసక్తిని వెల్లడిస్తుంది.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మూడు రోజుల ఉపన్యాస శ్రేణిలో మొదటి రోజున, ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ మాట్లాడుతూ, భారతదేశాన్ని కేంద్రంగా ఉంచుకుని ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడిందని, భారత్‌ను విశ్వగురువు చేయడంతోనే దానికి సార్థకత ఏర్పడుతుందని అన్నారు. సంఘ ప్రార్థన ముగింపులో చెప్పే “భారత్ మాతా కీ జై” నుంచి సంఘ్ పనికి ప్రేరణ లభిస్తుంది. సంఘ్ ఉత్థాన ప్రక్రియ నెమ్మదిగా, దీర్ఘంగా ఉంటుంది.. అది నేటికీ కొనసాగుతోంది అని తెలిపారు. సంఘ్ హిందూ అనే పదాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, దాని సారాంశం ‘వసుధైవ కుటుంబకం’ అని ఆయన అన్నారు. ఈ క్రమమైన అభివృద్ధిలో సంఘ్ గ్రామం, సమాజం, దేశాన్ని తనదిగా భావిస్తుందని చెప్పారు. సంఘ్ పని పూర్తిగా స్వయంసేవకులే నిర్వహిస్తారు. కార్యకర్తలే కొత్త కార్యకర్తలను సిద్ధం చేస్తారు అని తెలిపారు.

ఈ ఉపన్యాస కార్యక్రమం లక్ష్యం ఏమిటో మోహన్ భాగవత్ మాటలలోనే: సంఘ్ గురించి నిజమైన, సరైన సమాచారం సమాజానికి చేరాలని సంఘ్ భావించింది. 2018 సంవత్సరంలో కూడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించింది. ఈసారి నాలుగు చోట్ల సంఘం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. తద్వారా సంఘ్ వాస్తవిక సమాచారం వీలైనంత ఎక్కువమందికి చేరుతుంది. దేశం అంటే నిర్వచనం అధికారం ఆధారంగా ఉండదు. గతంలో మనం పరాధీనులమైనప్పటికీ మనకు ఒక దేశం ఉంది. ‘నేషన్’ అనే ఆంగ్ల పదం ‘దేశం’తో ముడిపడి ఉంది, అయితే భారత దేశం అనే భావన అధికారంతో ముడిపడి లేదు.

దేశంలో స్వాతంత్ర్య పోరాటం, తదనంతరం జరిగిన భావజాల అభివృద్ధి గురించి మాట్లాడుతూ, 1857లో స్వాతంత్ర్యం కోసం జరిగిన మొదటి ప్రయత్నం విఫలమైందని,




అయితే అది కొత్త చైతన్యాన్ని మేల్కొలిపిందని అన్నారు. ఇంకా–

ఆ తర్వాత ఒక ఉద్యమం మొదలైంది, కొంతమంది వ్యక్తులు మనల్ని ఎలా ఓడించగలరు? భారతీయులకు రాజకీయ అవగాహన లేదని మరో ఆలోచన వచ్చింది. ఈ అవసరం నుంచే కాంగ్రెస్ ఉద్భవించింది, కానీ స్వాతంత్ర్యం తర్వాత అది సైద్ధాంతిక జ్ఞానోదయం కలిగించే పనిని సరిగ్గా చేయలేక పోయింది. ఇది ఆరోపణ కాదు, వాస్తవం. స్వాతంత్ర్యం తర్వాత, ఒక ఆలోచనా స్రవంతి సామాజిక దురాచారాలను నిర్మూలించడంపై దృష్టి సారించగా, మరొక ఆలోచనా స్రవంతి మన మూలాలకు తిరిగి రావడం గురించి మాట్లాడింది. స్వామి దయానంద సరస్వతి, స్వామి వివేకానంద ఈ ఆలోచనా స్రవంతిని ముందుకు తీసుకెళ్లారు అని చెప్పారు భాగవత్.

సమాజంలోని చెడులను తొలగించకుండా చేసే అన్ని ప్రయత్నాలు అసంపూర్ణంగా ఉంటాయని పరమపూజనీయ డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, ఇతర మహానుభావులు విశ్వసించారని భాగవత్ అన్నారు.

“మళ్లీ మళ్లీ బానిసత్వంలోకి పడిపోవడం సమాజంలో లోతైన లోపాలు ఉన్నాయని సూచిస్తుంది. ఇతరులకు సమయం లేనప్పుడు, తాను స్వయంగా ఈ దిశలో పని చేయాలని హెడ్గేవార్‌జీ నిర్ణయించుకున్నారు. 1925లో సంఘాన్ని స్థాపించడం ద్వారా, మొత్తం హిందూ

సమాజాన్ని వ్యవస్థీకరించే లక్ష్యాన్ని ఆయన తన ముందు ఉంచుకున్నారు" అని తెలిపారు.

సర్ సంఘ్‌చాలక్ హిందూ అనే పదం సారాంశాన్ని వివరిస్తూ, 'హిందూ' అనే పదానికి అర్థం కేవలం మతపరమైనది కాదని, అది దేశం పట్ల బాధ్యత సూచించే ఒక భావం అని స్పష్టం చేశారు.

"ఈ పేరును(హిందూ) ఇతరులు పెట్టారు, కానీ మేము ఎల్లప్పుడూ మమ్మల్ని మానవ శాస్త్ర దృక్పథం నుండి చూసుకున్నాము. మనిషి, మానవత్వం, సృష్టి ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయని, అవి ఒకదానినొకటి ప్రభావితం చేస్తాయని మేము నమ్ముతాము. హిందూ అంటే చేరిక. చేరికకు పరిమితులు లేవు" అని అన్నారు. ఇంకా, "ఎవరైతే నమ్ముతున్న దాని మీద విశ్వాసం ఉంచి, స్వంత మార్గాన్ని అనుసరిస్తూ ఇతరులను మార్చకుండా ఉంటారో అతడే హిందువు అని తెలిపారు.

"ఇతరుల విశ్వాసాలను గౌరవించండి, వారిని అవమానించకండి. ఈ సంప్రదాయం, సంస్కృతిని కలిగి ఉన్నవారు హిందువులు. మనం మొత్తం




హిందూ సమాజాన్ని ఏకం చేయాలి. హిందూ అంటే అందరూ అని కాదు, అది అస్సలు కాదు. 'హిందూ' అంటే అందరినీ కలుపుకుని వెళ్లడం." అని చెప్పారు.

భారతదేశం స్వభావం సంఘర్షణ కాదు, సమన్వయం అని ఆయన అన్నారు. భారత్ ఐక్యతా రహస్యం దాని భౌగోళికం, వనరులు, ఆత్మపరిశీలన సంప్రదాయంలో ఉందని చెప్పారు.

"మేం సత్యాన్వేషణను బాహ్యంగా కాకుండా అంతర్గతంగా చేశాము, సత్యాన్ని కనుగొనడానికి మేము లోపలికి చూశాము. ఆ అన్వేషణ అందరిలోనూ ఒకటే తత్త్వం ఉంటుందనే విషయాన్ని మాకు నేర్పింది. అది వివిధ రూపాల్లో ఉంటుందని తెలిసి వచ్చింది. అందుకే భారతమాత, మన పూర్వికులు మనకు పూజనీయులు" అని చెప్పారు.

భారతమాతను, తన పూర్వికులను నమ్మేవాడే నిజమైన హిందువు అని మోహన్ భాగవత్ అన్నారు. కొంతమంది తమను తాము హిందువులుగా భావిస్తారు, మరికొందరు తమను తాము భారతీయులు లేదా సనాతనీయులు అని పిలుస్తారు. పదాలు మారవచ్చు, కానీ వాటి వెనుక భక్తి, శ్రద్ధల భావన ఉంది. భారత్ సంప్రదాయం, జన్యువులు ప్రతి ఒక్కరినీ కలుపుతాయి అన్నారాయన.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గుర్తింపు అని చెబుతూ, డాక్టర్ భాగవత్; గతంలో దీనికి దూరంగా ఉన్న ప్రజలు కూడా క్రమంగా తమను తాము హిందువులుగా పిలుచుకోవడం ప్రారంభించారు. ఎందుకంటే జీవన నాణ్యత మెరుగుపడినప్పుడు, ప్రజలు తమ మూలాలకు తిరిగి వస్తారు. మీరు హిందువుగా ఉండాలని మేము చెప్పడం లేదు. మీరు హిందువు అని మేము మీకు చెప్తాము అని అన్నారు. ఈ పదాల వెనుక ఎటువంటి అర్థం లేదు.. విషయం ఉంది. ఆ విషయంలో భారతమాత పట్ల భక్తి ఉంది, పూర్వికుల సంప్రదాయం ఉంది. భారతదేశ ప్రజల జన్యువులు 40 వేల సంవత్సరాల క్రితం నుండి ఒకేలా ఉన్నాయి. హిందువులు అని తమను తాము పిలుచుకునే వారు వారి జీవితాన్ని మెరుగుపరుచుకోవాలి. అలా పిలుచుకోని వారు కూడా పిలుచుకోవడం ప్రారంభిస్తారు. ఏదో ఒక కారణం చేత మర్చిపోయిన వారు కూడా మళ్లీ గుర్తు చేసుకుంటారు అని చెప్పారు.

ఇంకా ఇలా అన్నారు: మనం చేయాల్సింది ఏమిటంటే మొత్తం హిందూ సమాజాన్ని ఏకం చేయడం. మనం హిందూ దేశం అని చెప్పేటప్పుడు, మనం ఎవరినీ వదిలిపెట్టడం లేదు. సంఘ్ ఒకరికి వ్యతిరేకంగా, వారికి స్పందనగా ఉద్భవించలేదు. హిందూదేశానికి అధికారంతో ఎలాంటి లావాదేవీలు లేవు.

సంఘ పని విధానాల గురించి ఆయన మాట్లాడుతూ సమాజ అభ్యున్నతి కోసం, సంఘ్ రెండు మార్గాలను అనుసరిస్తుందని అన్నారు. మొదటిది, మానవులను అభివృద్ధి చేయడం, రెండవది, వారితో సమాజం కోసం పనిచేయించడం అని చెప్పారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఒక సంస్థ. ఈ సంస్థ పని మానవాభివృద్ధికి కృషి చేయడం. సంఘ్ స్వయంసేవకులు వివిధ రంగాలలో పనిచేస్తారు, కానీ సంస్థ వారిని నియంత్రించదు. సమాజంలో సంఘ్ పట్ల వ్యతిరేకత, నిర్లక్ష్యం ఉన్నా కానీ సంఘ్ సమాజాన్ని తనదిగా భావించింది అని తెలిపారు.

### వ్యక్తిగత అంకితభావంతో సంఘ్ నిర్వహణ

"సంఘ్ ప్రత్యేకత ఏమిటంటే అది బాహ్య వనరులపై ఆధారపడదు, కానీ స్వయంసేవకుల వ్యక్తిగత అంకితభావంతో నడుస్తుంది. 'గురు దక్షిణ' అనేది సంఘ్ పని వ్యవస్థలో అంతర్భాగం. దీని ద్వారా ప్రతి స్వయంసేవకుడు సంఘ్ పట్ల తన విశ్వాసాన్ని, నిబద్ధతను వ్యక్తం చేస్తారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. మన ఆలోచనలు, విలువలు, ప్రవర్తనను సరిగ్గా ఉంచుకోవడానికి మనం ప్రయత్నిస్తాం. స్వయంసేవకుల గురించి మనం ఆలోచించాలి. వారు సంఘ్ గురించి ఆలోచిస్తుంటారు. భారతదేశంలో సమూహాలను సృష్టించడం కాదు, మనమందరం కలిసి రావాలి. మనం అందరినీ సంఘటితం చేయాలి.." అని తెలిపారు.

వేదికపైన ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవహ దత్తాత్రేయ హోసబలే, ఉత్తర క్షేత్ర సంఘ్‌చాలక్ పవన్ జిందాల్, ఢిల్లీ ప్రాంత్ సంఘ్‌చాలక్ డాక్టర్ అనిల్ అగర్వాల్ ఉన్నారు.

**రెండవ రోజు**

## అంతర్జాతీయ వాణిజ్యం స్వచ్ఛందంగా మాత్రమే జరగాలి, ఒత్తిడితో కాదు..!

ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మూడు రోజుల ఉపన్యాస శ్రేణిలో రెండవ రోజున, ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ మాట్లాడుతూ సమాజం, జీవితం మధ్య సమతుల్యత ధర్మం అవుతుంది అన్నారు. దీని గురించి వారి మాటల్లో.. ఇది ఏదైనా అతివాదం నుంచి మనల్ని కాపాడుతుంది. భారతీయ సంప్రదాయం దీనిని మధ్యే మార్గం అని పిలుస్తుంది. ఇది నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైనది. ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలిచేందుకు, సామాజిక మార్పు ఇంటి నుండే ప్రారంభం కావాలి. దీనికోసం సంఘ పంచ పరివర్తన్ సూచించింది. అవి కుటుంబ జ్ఞానోదయం, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, స్వీయ-సాక్షాత్కారం (స్వదేశీ), పౌర విధుల నిర్వహణ. స్వావలంబన భారతదేశం కోసం స్వదేశీకి ప్రాధాన్యత ఇవ్వండి. భారత్ అంతర్జాతీయ వాణిజ్యం స్వచ్ఛందంగా మాత్రమే జరగాలి. ఎటువంటి ఒత్తిడితో కాదు.



### సంఘ పనితీరు

స్వచ్ఛమైన సాత్విక ప్రేమ, సమాజం పట్ల భక్తిపై ఆధారపడి సంఘం పని చేస్తుందని మోహన్ భాగవత్ జీ అన్నారు. దీని గురించి వారి మాటల్లో.. సంఘ స్వయంసేవకులు ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనాన్ని ఆశించరు. ఇక్కడ ఎటువంటి ప్రోత్సాహకాలు ఉండవు. బదులుగా ప్రోత్సాహకాలను నిరుత్సాహ పరిచేవి ఎక్కువగా ఉంటాయి. స్వయంసేవకులు సామాజిక సేవలో ఆనందాన్ని అనుభవిస్తూనే పని చేస్తారు. ఈ సేవ ద్వారా జీవితం సార్థకమవుతుంది. సజ్జనులతో స్నేహం చేయడం, దుర్మార్గులను విస్మరించడం, ఎవరైనా మంచి చేసినప్పుడు ఆనందాన్ని వ్యక్తపరచడం, దుష్టుల పట్ల కూడా కరుణ చూపడం – ఇది జీవితానికి సంఘ్ ఇచ్చే విలువ.

### హిందూత్వ అంటే..

హిందూత్వ ప్రాథమిక భావన గురించి ఆయన మాట్లాడుతూ, హిందూత్వం అంటే సత్యం, ప్రేమ, స్వంతం అని అన్నారు. దీని గురించి వారి మాటల్లో.. మన ఋషులు, సాధువులు జీవితం మనకోసం కాదని మనకు బోధించారు. అందుకే భారతదేశం ఒక పెద్ద అన్నయ్యలా ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే పాత్రను పోషించాల్సి వచ్చింది. ఇక్కడే ప్రపంచ సంక్షేమం అనే ఆలోచన పుడుతుంది.

### ప్రపంచం ఎటు వైపు వెళుతుందంటే..

ప్రపంచం మతోన్మాదం, అసమ్మతి, అశాంతి వైపు పయనిస్తోందని సర్‌సంఘ్‌చాలక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది వారి మాటల్లో.. గత 350 సంవత్సరాలలో, వినిమయతత్త్వం, భౌతికవాద దృక్పథం కారణంగా మానవ జీవితానికి భద్రత కొరవడింది. శ్రమ తెలియని పని, వివేకరహిత ఆనందం, చరిత్రస్పృహ లేని జ్ఞానం, నైతికత లేని వాణిజ్యం, మానవత్వం లేని సైన్స్, త్యాగం లేని ధర్మం, సిద్ధాంతాలు లేని రాజకీయాలు సమాజంలో అసమతుల్యతను మరింతగా పెంచాయి.

### ధర్మపథాన్ని అనుసరించాలి

నేడు ప్రపంచంలో సమన్వయం లోపించిందని, ప్రపంచం తన దృక్పథాన్ని మార్చుకోవాల్సి వస్తుందని సర్‌సంఘ్‌చాలక్ అన్నారు. వారి మాటల్లో.. ప్రపంచం ధర్మపథాన్ని అనుసరించాల్సి ఉంటుంది. ధర్మం పూజలు, ఆచారాలకు అతీతమైనది. ధర్మం అన్ని రకాల మతాల కంటే ఉన్నతమైనది. ధర్మం మనకు సమతుల్యతను బోధిస్తుంది. మనతో పాటుగా సమాజం, ప్రకృతి సైతం మనుగడ సాగించాలి. తీవ్రవాదం నుండి మనల్ని రక్షించే మధ్యేమార్గం ధర్మం. ధర్మం అంటే గౌరవంగా, సమతుల్యతతో జీవించడం. దీనితోనే ప్రపంచ శాంతి స్థాపన జరుగుతుంది. ధర్మం అనేది మనల్ని సమతుల్య జీవితం వైపునకు నడిపిస్తుంది. అలా చేరుకున్న స్థితిలో వైవిధ్యాన్ని అంగీకరిస్తారు, ప్రతి ఒక్కరి ఉనికిని గౌరవిస్తారు. ఇదే ప్రపంచ ధర్మం. హిందూ సమాజం సంఘటితమై దీనిని ప్రపంచానికి అందించాలి.

### ప్రస్తుత ప్రపంచ పరిస్థితికి తరుణోపాయం

ప్రస్తుతం ప్రపంచం ఉన్న పరిస్థితిలో శాంతి, పర్యావరణం, ఆర్థిక అసమానతలపై చర్చలు జరుగుతున్నాయి. పరిష్కారాలను కూడా సూచిస్తున్నారు. కానీ పరిష్కారం చాలా దూరంలో ఉందని అన్నారు. వారి మాటల్లో.. దీనికోసం ప్రతి ఒక్కరు నిజాయితీగా ఆలోచించాలి. జీవితంలో త్యాగం, బలిదానం రెండూ ఉండాలి. సమతుల్యమైన తెలివితేటలు, ధర్మ దృష్టిని పెంపొందించుకోవాలి.

### కష్టాల్లోనూ భారత్ సంయమనం

కష్టాలు ఎదురైనప్పుడూ కూడా భారత్ సంయమనం పాటిస్తుందని అన్నారు. దీని గురించి.. మన కష్ట,నష్టాలను పట్టించుకోకుండా మనం ఎల్లప్పుడూ సంయమనం పాటించాం. మనకు హాని చేసినవారు సంక్షోభ సమయాల్లో ఉన్నప్పుడు వారికి మనం సహాయం చేసాం. వ్యక్తులు, దేశాల అహం నుంచి శత్రుత్వం పుడుతుంది, కానీ హిందూస్తాన్ అహంకారానికి అతీతమైనది. భారతీయ సమాజం తన ప్రవర్తన ద్వారా ప్రపంచానికి ఒక ఆదర్శంగా నిలవాలి. నేడు సమాజంలో సంఘ శాఖ పట్ల నమ్మకం ఉంది. సంఘ్ ఏమి చెప్పినా సమాజం వింటుంది. ఈ నమ్మకం సేవ, సామాజిక అంకిత భావం ద్వారా సంపాదించుకున్నది.

### భవిష్యత్తుకు దిశానిర్దేశం

భవిష్యత్తు దిశ గురించి సర్‌సంఘ్‌చాలక్ మాట్లాడుతూ, సంఘ పని అన్ని ప్రదేశాలు, వర్గాలు, స్థాయిలకు చేరుకోవడమే సంఘ లక్ష్యం అని అన్నారు. వారి మాటల్లో.. సమాజంలో మంచి పనులు చేసే పెద్దమనుషులు కలిసి రావాలి. దీనితో సంఘ్ లాగా సమాజం కూడా వ్యక్తిత్వ నిర్మాణాన్ని , దేశభక్తిని పెంచుతుంది. దీనికోసం మనం సమాజంలోని ప్రతి మూలకు చేరుకోవాలి. భౌగోళిక దృష్టితో సంఘ శాఖ ప్రతి ప్రదేశానికి, ప్రతి వర్గానికి, సమాజంలోని ప్రతి స్థాయిని చేరుకోవాలి. సమాజంలోని పెద్దమనుషులను సంప్రదిస్తాం. వారిని ఒకరితో ఒకర్ని అనుసంధానిస్తాం. సమాజంలో సద్భావనను తీసుకురావడానికి, సమాజంలో అభిప్రాయాలను వ్యక్తీకరించేవారిని నిరంతరం కలవాలని సంఘం

శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్
కలుపు పరికరాలు, కూరగాయల పంటలు, టెర్రస్ గార్డెన్‌లో వాడే పరికరాలు
1) అయ్యన్న వీడర్ రూ.1200/- 2) అన్నమయ్య వీడర్ రూ. 2000/-
3) ఒంగోలు గిత్త ప్లోయింగ్ వీడర్ రూ. 3000/- 4) రామయ్య వీడర్ రూ. 1500/-




Visit Youtube Link:
- Agriculture Implements at low cost - Rythu Nestham
- Low Cost agriculture machines to farmers - HMTV

Contact Number : 9849140465

భావిస్తోంది. వీటి ద్వారా ఒక భావనను అభివృద్ధి చేసుకోవాలి. వారు తమ సమాజం కోసం పని చేయాలి. తాము హిందూ సమాజంలో భాగమనే భావనను పెంపొందించుకోవాలి. భౌగోళిక పరిస్థితులకు సంబంధించిన సవాళ్లకు స్వంత పరిష్కారాలను కనుగొనాలి. బలహీన వర్గాల కోసం పనిచేయాలి. ఇలా చేయడం ద్వారా సంఘ్ సమాజ స్వభావంలో మార్పు తీసుకురావాలని కోరుకుంటుంది. దండయాత్రల కారణంగా భారత్‌లోకి కొన్ని మతాలు చొరబడ్డాయి. ఏదో కారణం చేత ఆ మతాల విశ్వాసాలను భారతీయుల్లో కొందరు స్వీకరించారు. వారు ఇక్కడి వారే, కానీ విదేశీ భావజాలం కారణంగా ఏర్పడిన దూరాలను తగ్గించాల్సిన అవసరం ఉంది. మనం ఇతరుల బాధలను అర్థం చేసుకోవాలి. ఒకే దేశం, ఒకే సమాజం, ఒకే జాతిలో భాగమైన మనం, వైవిధ్యాలు ఉన్నప్పటికీ, సమానమైన పూర్వీకులతో, ఉమ్మడి సాంస్కృతిక వారసత్వంతో ముందుకు సాగాలి. ఇది సానుకూలత, సామరస్యానికి చాలా అవసరం. దీనిలో కూడా మనం అవగాహనతో ఒక్కొక్క అడుగు ముందుకు వేయడం గురించి మాట్లాడుతున్నాము.

### ఇంటి నుంచి పంచ్ పరివర్తన్

ప్రపంచంలో మార్పు తీసుకురావడానికి ముందు, మనం మన ఇంటి నుండే సామాజిక మార్పును ప్రారంభించాలి అని మోహన్ భాగవత్ అన్నారు. ఇంకా.. దీనికోసం సంఘ పంచ పరివర్తన్ సూచించింది. అవి కుటుంబ జ్ఞానోదయం, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, స్వీయ గుర్తింపు, పౌర విధుల నిర్వహణ. పండుగల సమయంలో సంప్రదాయ దుస్తులు ధరించండి. మీ మాతృభాషలో సంతకం చేయండి. స్థానిక ఉత్పత్తులను గౌరవంతో కొనండి. మన పూర్వీకులు నవ్వుతూ ఉరికంబాలు ఎక్కారు, కానీ నేడు మనం దేశం కోసం అహర్నిశలు పాటుపడాల్సిన అవసరం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యాంగం, నియమాలను పాటించాలి. ఏదైనా కవ్వింపు చర్యలు చోటు చేసుకుంటే టైర్లను కాల్చవద్దు.. రాళ్లు విసరవద్దు. ఇలాంటి కార్యకలాపాలను ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు మనల్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తాయి. మనం ఎప్పుడూ రెచ్చిపోకూడదు. చట్టవిరుద్ధమైన పనులు చేయకూడదు. భారతదేశం స్వావలంబన దిశగా దృఢమైన చర్యలు తీసుకోవలసి ఉంటుంది. దీని కోసం స్వదేశీకి ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రసంగం చివర్లో "చేసిన పనితో సాధించిన ఘనతను తన ఖాతాలో వేసుకోవాలని సంఘం కోరుకోదు. భారతదేశం పరివర్తన చెందడమే కాకుండా, యావత్ ప్రపంచంలో ఆనందం, శాంతిని నెలకొల్పే విధంగా ముందుకు సాగాలని సంఘ్ కోరుకుంటుంది అని సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ తెలిపారు.



మూడవ రోజు

## భారత్ అఖండమైన ఒక హిందూ దేశం

మూడు రోజుల ఉపన్యాస శ్రేణిలో చివరి రోజున, ఆర్‌ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ సభాసదులు అడిగిన 200కు పైగా ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. యువత–ఉపాధి, విదేశీ నిధులతో మతాంతీకరణ, పదవీ విరమణకు వయోపరిమితి, మాంసాహారంపై నిషేధం, దేశ విభజన–అఖండ భారత్, తదితర అంశాలపై మాట్లాడారు.

### యువత-ఉపాధి

యువతకు ఉపాధి అవకాశాల గురించి ఆయన కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడారు. దీని గురించి వారి మాటల్లో.. మనం ఉద్యోగార్థులుగా కాకుండా, ఉద్యోగ ప్రదాతలుగా మారాలి. జీవనోపాధి అంటే ఉద్యోగం అనే ఈ అపోహకు ముగింపు పలకాలి. ఇది సమాజానికి ప్రయోజనం చేకూరుస్తుంది. ఉద్యోగాలపై ఒత్తిడిని తగ్గిస్తుంది. ప్రభుత్వం గరిష్టంగా 30 శాతం వరకు ఉపాధి అవకాశాలను కల్పించగలదు. మిగిలినది మన శ్రమ ద్వారా సంపాదించాలి. కొన్ని ఉద్యోగాలను 'పెద్దవి లేదా చిన్నవి' అని పరిగణించడం వల్ల సమాజం నష్టపోయింది. పని పట్ల గౌరవాన్ని నెలకొల్పాలి. భారతదేశం యువశక్తితో ప్రపంచానికి శ్రామిక శక్తిని అందించగలదు.

### దేశవిభజన-అఖండ భారత్

సంఘ్ భారతదేశ విభజనను వ్యతిరేకించిందని మోహన్ భాగవత్ అన్నారు. దీని గురించి వారి మాటల్లో.. ఈ విభజన దుష్ప్రభావాలన్నీ నేడు విడిపోయిన పొరుగు దేశాలలో కనిపిస్తున్నాయి. భారత్ అఖండమైనది. ఇది జీవిత సత్యం. పూర్వీకులు, సంస్కృతి, మాతృభూమి మనల్ని ఏకం చేస్తాయి. అఖండ భారత్ అంటే కేవలం రాజకీయాలు కాదు, ప్రజా చైతన్య ఐక్యత. ఈ భావన మేల్కొన్నప్పుడు, ప్రతి ఒక్కరూ సంతోషంగా, ప్రశాంతంగా ఉంటారు. సంఘ్ కొంతమందికి వ్యతిరేకంగా ఉందనే తప్పుడు భావన వ్యాప్తి చెందింది. ఈ ముసుగును తొలగించాలి. సంఘ్‌ను ఉన్నది ఉన్నట్లుగా చూపించాలి. వేం 'హిందువు' అంటాం. మీరు 'భారతీయుడు' అని అనవచ్చు. కానీ రెండింటి అర్థం ఒకటే. మన పూర్వీకులు, సంస్కృతి ఒకటే.

### పదవీ విరమణకు వయోపరిమితి

సంఘ్‌లో పదవీ విరమణకు వయోపరిమితి ఉండదని మోహన్ భాగవత్ అన్నారు. దీని గురించి వారి మాటల్లో.. నేను ఒక నిర్దిష్ట వయస్సులో పదవీ విరమణ చేస్తానని లేదా ఎవరైనా అలా చేయాలని నేను ఎప్పుడూ చెప్పలేదు. సంఘ్‌లో మనమందరం స్వయంసేవకులం. నాకు 80 ఏళ్లు వచ్చినప్పుడు, ఒక శాఖను నిర్వహించే బాధ్యతను నాకు అప్పగించినప్పుడు, నేను ఆ బాధ్యతను నెరవేర్చి తీరాలి. సంఘ్ మాకు ఏ పని అప్పగించినా, మేము దానిని చేస్తాం. పదవీ విరమణ ప్రశ్న ఇక్కడ ఉత్పన్నం కాదు. సంఘ్ ఏ ఒక్క వ్యక్తిపైనా ఆధారపడి ఉండదు. నేను ఒక్కడినే సర్‌సంఘచాలక్ బాధ్యతలను నిర్వర్తించడానికి ఉన్నానని అనుకోవద్దు. ఆ బాధ్యత బరువును మోయగలిగే మరో 10 మంది ఇక్కడ ఉన్నారు. మేము జీవితంలో ఏ సమయంలోనైనా పదవీ విరమణ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. సంఘ్ కోరుకున్నంత కాలం పనిచేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాం.

### విదేశీ నిధులతో మతాంతరీకరణ

సర్‌సంఘ్‌చాలక్ మతాంతీకరణకు ఉపయోగిస్తున్న విదేశీ నిధులపై సమగ్ర దర్యాప్తు అవసరాన్ని నొక్కి చెప్పారు. దీని గురించి వారి మాటల్లో.. సేవ కోసం విదేశాల నుండి డబ్బు వస్తే పర్వాలేదు, కానీ దానిని ఆ ప్రయోజనం కోసమే ఉపయోగించాలి. అలా వచ్చిన డబ్బును మతాంతరీకరణకు ఉపయోగించినప్పుడు సమస్య తలెత్తుతుంది. అటువంటి నిధులపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది.

### భారత్ ఒక హిందూదేశం

భారత్ ఒక హిందూ దేశమని మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. దీని గురించి వారి మాటల్లో.. భారతదేశం హిందూ దేశం. దీనికి అధికారిక ప్రకటన అవసరం లేదు. మన రుషులు, సాధువులు ఇప్పటికే భారతదేశాన్ని హిందూ దేశంగా ప్రకటించారు. ఇది ఏ అధికారిక ప్రకటనపై ఆధారపడి లేదు, ఇది నిజం. మీరు దానిని అంగీకరిస్తే, అది మీకు ప్రయోజనకరం. మీరు దానిని అంగీకరించకపోతే, అది మీకు ప్రతికూలం.

### మాంసాహారంపై నిషేధం

కొన్ని సందర్భాలు వచ్చినప్పుడు మాంసాహారంపై నిషేధం విధించడంలో ఎలాంటి తప్పు లేదని సర్‌సంఘ్‌చాలక్ అన్నారు. దీని గురించి వారి మాటల్లో... పండుగలు, వ్రతాల సమయంలో కొన్ని రోజుల పాటు మనోభావాలను దెబ్బతీసే దేనిని అయినా నిషేధించడం ఒక తెలివైన పని అవుతుంది. ఎవరైనా తినేది ఏదైనా అది ఇతరులకు బాధ కలిగించడానికి ఒక కారణం కాకూడదు.

– జాగృతి డెస్క్



**విద్యలేని వాడు వింత పశువు అన్నారు పెద్దలు. వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అక్షరాస్యత ముఖ్యం. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం, స్వతంత్రంగా ఆలోచించడం అక్షరాస్యతతోనే సాధ్యం. కానీ భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా సంపూర్ణ అక్షరాస్యత సాధించలేదు. కానీ ఈ విషయంలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, జర్మనీలాంటి దేశాలు కొన్ని చిన్న దేశాల కన్నా వెనుకబడే ఉన్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2047 నాటికి 100% అక్షరాస్యతను సాధించేందుకు 'ఉల్లాస్' కార్యక్రమాన్ని చేపట్టింది.**

# సంపూర్ణ అక్షరాస్యత

అక్షరాస్యత అంటే ఏమిటి? చదవడం, రాయడం, మాట్లాడటం, వినడం అనే ప్రాథమిక లక్షణాలు. రాయడం, చదవటం మాత్రమే అక్షరాస్యత కాదనీ.. గౌరవం, అవకాశాలు, అభివృద్ధి గురించి చెప్పడమే నిజమైన అక్షరాస్యత అని కొంతమంది చెబుతుంటారు. నైపుణ్యాలను ఉపయోగించడం వంటి ప్రాథమిక సామర్థ్యాలను కలిగి ఉండటం అని కూడా చెప్పవచ్చు. ఇది చదువుకోవడం మాత్రమే కాకుండా, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, ఇతరులతో సమర్థవంతంగా సంభాషించడానికి, సమాజంలో క్రియాశీలకంగా పాల్గొనడానికి అవసరమైన విస్తృతమైన నైపుణ్యాలను సూచిస్తుంది.

**పెద్ద దేశాలు వెనుక బెంచీలో..**

నవంబర్ 17,1965న యునెస్కో సభ్యదేశాల విద్యాశాఖా మంత్రుల మహాసభ అనంతరం ఏటా సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించారు. యునెస్కో 1990 సంవత్సరాన్ని అక్షరాస్యతా సంవత్సరంగా ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి 2003–2012ను అక్షరాస్యతా దశాబ్దంగా ప్రకటించింది. వెనుకబాటుతనానికి కారణాలలో పేదరికంతో పాటు నిరక్షరాస్యత కూడా కారణం అని చెబుతారు. అయితే ఇది వాస్తవం కాదు.

ప్రపంచంలో ధనికదేశాలు లేదా అధిక జనాభా కలిగిన దేశాలేవీ అక్షరాస్యతలో ముందు స్థానంలో లేవు. అతి చిన్నదేశాలు అత్యధిక అక్షరాస్యతను సాధించి మొదటి స్థానంలో నిలిచాయి. ఇందులో అండోరా, ఫిన్లాండ్, గ్రీన్లాండ్, లీచ్టెన్‌స్టెయిన్, లక్సెంబర్గ్, నార్వే, ఉక్రెయిన్, ఉజ్బెకిస్తాన్, ఉత్తర కొరియా ఉండటం విశేషం. ఇవి 100% అక్షరాస్యత సాధించాయి. అగ్రరాజ్యం అమెరికా అక్షరాస్యతలో 38వ స్థానం ఉంది. దీని కన్నా రష్యా, ఇటలీ, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్ మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. చాలామంది అమెరికన్లకు ఉద్యోగ దరఖాస్తును పూరించడానికి అక్షరాస్యత నైపుణ్యాలు లేవు. బార్బరా బుష్ ఫౌండేషన్ ప్రకారం ప్రతి 5 మంది పెద్దలలో ఒకరు ప్రాథమిక వాక్యాలను చదవడానికి, దరఖాస్తులను పూరించడానికి ఇబ్బంది పడుతున్నారు.

**మన దేశం స్థానమేంటి?**

భారతదేశంలో అక్షరాస్యత రేటు 2023–24లో దాదాపు 80.9%. అయితే ఇది ప్రపంచ సగటు 84%తో పోలిస్తే తక్కువ. మన దేశంలో 7 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న, ఏ భాషలోనైనా చదవడం, రాయడం చేయగల వ్యక్తిని అక్షరాస్యుడిగా పరిగణిస్తారు. లింగం, మతం, ప్రాంతాల వారీగా అక్షరాస్యతలో అంతరాలున్నాయి.

1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అక్షరాస్యత శాతం కేవలం 12.2% శాతం. 1944లో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం (అప్పటికి దేశాన్ని వీడే ఆలోచన లేదు) మన దేశంలో రాబోయే 40 ఏళ్లలో అంటే 1984 నాటికి 100% అక్షరాస్యత లక్ష్యంగా పెట్టుకుంది. కానీ కాంగ్రెస్ నాయకులు సంపూర్ణ అక్షరాస్యతను సాధించడానికి ఈ వ్యవధి ఎక్కువ అని అపహాస్యం చేశారు. అయితే స్వాతంత్రం తర్వాత అధికారం చేపట్టిన ఆ పార్టీ ఈ లక్ష్యాన్ని పూర్తి చేయలేకపోయింది. 1991 నాటికి దేశ అక్షరాస్యత శాతం 52.21% దగ్గర ఉంది..

దేశంలో కొన్నేళ్ల క్రితం వరకూ అక్షరాస్యతలో కేరళదే మొదటి స్థానం. 2025 వచ్చే సరికి మిజోరం 98.2%తో అగ్రస్థానంలో నిలిచింది. రెండోస్థానంలో లక్షద్వీప్ (97.3%), మూడో స్థానంలో నాగాలాండ్ (95.7%), నాలుగో స్థానంలో కేరళ (95.3%), ఐదో స్థానంలో మేఘాలయ (94.2%) నిలిచాయి. ఏ రాష్ట్రమైనా 95% అక్షరాస్యతను దాటితే సంపూర్ణ అక్షరాస్యత సాధించినట్లు గుర్తిస్తారు.

**సాక్షరతా కార్యక్రమాలు**

మన దేశంలో సంపూర్ణ అక్షరాస్యతను సాకారం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టాయి. ఇందుతో ప్రధానమైనది 1988లో ప్రారంభమైన నేషనల్ లిటరసీ మిషన్ (జాతీయ అక్షరాస్యత కార్యక్రమం). 2007నాటికి దేశంలో 75% అక్షరాస్యత రేటును సాధించాలనే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. 15–35 సంవత్సరాల మధ్య వయసున్న నిరక్షరాస్యులను లక్ష్యంగా పెట్టుకున్నారు. 2011 నాటికి అక్షరాస్యత 74.01%కి పెరిగింది.

మరోవైపు 2001లో కేంద్ర ప్రభుత్వం సర్వ శిక్షా అభియాన్ ప్రారంభించింది. 6–14 సంవత్సరాల మధ్య ఉన్న బాలలందరూ పాఠశాలకు వెళ్లేలా చేయడం, 2010 నాటికి ఎనిమిదేళ్ల పాఠశాల విద్యను పూర్తి చేసేలా చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం లక్ష్యాలు. ఈ పథకంలో విద్యా హామీ పథకం కీలకం. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేలా ప్రోత్సహించడానికి చేపట్టిన అత్యంత ప్రసిద్ధ పథకం మధ్యాహ్న భోజన పథకం. దీనిని 1995లో ప్రారంభించారు. ఈ పథకం చాలావరకు సత్ఫలితాలు ఇచ్చింది.

**వికసికత భారత్‌లో 'ఉల్లాస్'**

వికసిత భారత్ ప్రణాళికకు అనుగుణంగా స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జురుపుకునే 2047 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందు కోసం 'ఉల్లాస్' పేరుతో సరికొత్త సాక్షరతా కార్యక్రమం ప్రాంభమైంది. ఉల్లాస్ అంటే.. అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ. 2020లో అమలులోకి వచ్చిన జాతీయ విద్యా విధానంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం సంపూర్ణ అక్షరాస్యత దిశగా ఒక ప్రధాన మైలురాయి. 2022–2027 మధ్య అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్ని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నది. ఏడాదికి కోటి మంది అభ్యాసకులతో ఐదు కోట్ల మంది అక్షరాస్యులను నమోదు చేయాలని భావిస్తున్నది. ప్రాథమిక విద్య, జీవన నైపుణ్యాలు,

వృత్తి నైపుణ్యాలను అందించేలా ప్రణాళికలు రూపొందించింది. దీంతోపాటు అవగాహనతో చదవడం, రాయడం, అంకెలను గుర్తించడానికి ప్రత్యేక పుస్తకాలను రూపొందించారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఖర్చు చేయనున్నాయి.

కాగా ఉల్లాస్ కార్యక్రమం అప్పుడే సత్ఫలితాలు ఇస్తోంది. ఇందులో భాగంగానే మిజోరం 98.2% అక్షరాస్యత రేటును సాధించి, దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

తెలుగు రాష్ట్రాలు కూడా ఉల్లాస్ అమలుకు సిద్ధమయ్యాయి.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం'ఉల్లాస్'తో కలిసి 'అక్షరాంధ్ర' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా 2025–26లో 25లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. స్వయం సహాయక బృందాలు, విద్యార్థులు, ఇతర వలంటీర్ల సహకారంతో వయోజనులకు 100 గంటల పాటు శిక్షణ ఇస్తారు.

తెలంగాణ ప్రభుత్వం ఉల్లాస్‌లో భాగంగా 'అక్షర వికాసం' పేరిట 100 రోజుల ఉద్యమానికి వయోజన విద్యాశాఖని సన్నద్ధం చేసింది. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేళ దీనికి శ్రీకారం చుట్టనుంది. దీనిలో భాగంగా 12.45 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు 6 లక్షల మంది నిరక్షరాస్యులను గుర్తించింది. వారిలో 4 లక్షల మంది మహిళలే. ఈ ఉద్యమంలో మహిళా అక్షరాస్యతపై దృష్టి సారించనున్నారు.

**సాంకేతిక అక్షరాస్యత**

దేశం శరవేగంగా అభివృద్ధి చెందడంలో సాంకేతిక పరిజ్ఞానానిదే కీలక పాత్ర. దీన్నే డిజిటల్ అక్షరాస్యతగా పిలుస్తున్నారు. కంప్యూటర్లు మాత్రమే ఉన్నప్పుడు దీని అవసరం సామాన్య ప్రజలకు అంతగా ఉండేది కాదు. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. దేశంలో 77 శాతం

# ఇంకెంత దూరం?

ప్రతి సంవత్సరం సెప్టెంబరు, మార్చిలో పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.



మంది చేతుల్లో సెల్‌ఫోన్లు ఉంటే, 56 శాతం మంది నిత్యం ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఉంటున్నారు. వారిలో వీడియోలూ పోస్టులూ చూసేవారే ఎక్కువ. మొబైల్ ఫోన్ ద్వారా ఎన్నో రకాల ప్రభుత్వ, పౌర సేవలతో పాటు ఆన్‌లైన్ షాపింగ్ చేయవచ్చు. అయితే చాలా మంది పౌరులకు దీనిపై సరిగ్గా అవగాహన లేదు. ఈ–సేవా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నిరక్షరాస్యతకు తోడు స్థానిక భాషల్లో టెక్నాలజీ లేకపోవడమూ కారణమవుతోంది.

దేశంలో 2021–24 మధ్య సైబర్ నేరాలు ఏకంగా 400 శాతం పెరిగాయి. ఇందుకు ప్రధాన కారణం డిజిటల్ ఉపకరణాల వినియోగం పట్ల ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే. సొంతంగా కంటెంట్ సృష్టించేవారూ సందేశాలు రాసేవారూ చాలా తక్కువ. డిజిటల్ అక్షరాస్యతపై 120 దేశాల్లో చేపట్టిన సర్వేలో భారత్ 73వ స్థానంలో నిలిచింది. 'నాస్కామ్' నివేదిక ప్రకారం, 2023లో భారత స్థూల డిజిటల్ అక్షరాస్యత రేటు 37 శాతం. ఈ ఏడాది చివరికి అది 43శాతానికి చేరు కుంటుందని అంచనా.

ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరైనా సెల్‌ఫోన్, కంప్యూటర్‌ను ఉపయోగించగలిగేలా అవగాహన కల్పించడమే లక్ష్యంగా కేంద్రం 2014లో నేషనల్ డిజిటల్ లిటరసీ మిషన్(ఎన్‌డీఎల్‌ఎం)ను చేపట్టింది. విద్యార్థులు, యువత తమ కుటుంబ సభ్యులందరికీ డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన పెంచాలి.

ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో ఈ యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్తేనే 'డిజిటల్ ఇండియా' సాకారం సుసాధ్యమవుతుంది.

**ఆర్థిక అక్షరాస్యత**

కేవలం చదవడం వస్తే చాలదు. ఆర్థిక విషయాలపై అవగాహన కూడా ముఖ్యం. దీన్నే ఆర్థిక అక్షరాస్యత అంటారు. గ్లోబల్ ఫైనాన్షియల్ లిటరసీ స ర్వే ప్రకారం మన దేశ జనాభాలో 77% అక్షరాస్యులు ఉన్నప్పటికీ, అందులో 24% కంటే తక్కువ మంది ఆర్థిక అక్షరాస్యులు ఉన్నారు. ఇందులో యుక్త వయస్కులైన ఆర్థిక అక్షరాస్యులు 17% మాత్రమే. మొత్తం 144 దేశాలను పరిశీలిస్తే ఆర్థిక అక్షరాస్యత రేటులో భారత్ 73వ స్థానంలో ఉంది. ఆర్థిక పరిజ్ఞానం, అవగాహన లేకపోవటం వల్ల మెజార్టీ భారతీయులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తేలింది.

చదువుకు, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధం ఉందా అంటే లేదనే చెప్పాలి. ఎందుకంటే మన దేశంలోనే అధిక అక్షరాస్యత శాతం కలిగిన రాష్ట్రంగా కేరళకు గుర్తింపు ఉంది. కానీ అక్కడ లాటరీ టికెట్లు కొని నష్టపోతున్నవారు ఎక్కువ. అంటే చదువు ఆర్థిక పరిజ్ఞానాన్ని పూర్తిగా నేర్పించడం లేదు. పిల్లలకు చదువుల్లో ఆర్థిక సంబంధ అంశాలపై పరిజ్ఞానం పెంచాలని నిపుణులు చెబుతున్నారు.

ముందు తల్లిదండ్రులకు ఆర్థిక క్రమశిక్షణ ఉండాలి. అప్పుడే పిల్లలకు నేర్పించగలుగుతారు. చిన్నప్పటి నుంచే వారికి ఆర్థిక విషయాలు పరిచయం చేయాలి. ఇవన్నీ తరగతి గదుల బయటే నేర్చుకోవాలి. ఉదాహరణకు.. సరకులు కొనడానికి మార్కెట్‌కు వెళ్లడానికి ముందే కావాల్సిన వస్తువుల జాబితా రాసుకోవాలి. మన దగ్గర ఎంత డబ్బు ఉంది, అవసరాలు ఏమిటి, అందులో ప్రాధాన్యత ఉన్నవి ఏమిటి, వస్తువుల ధరలు, నాణ్యత ఎలా ఉన్నాయి చూసుకోవాలి. వీటిని దగ్గర ఉండి చూపించడంతో పాటు వారిని ఒంటరిగా వెళ్లే కొనుగోలు చేసేందుకు ప్రోత్సహించాలి. మనకు వచ్చే జీతం లేదా ఆదాయం ఎంత? అందులో ఖర్చులు, పొదుపు తదితర విషయాలను బోధించాలి. చిన్నప్పటి నుంచి నేర్పిస్తే పిల్లలు ఆర్థిక క్రమశిక్షణ అలవరచుకుంటారు.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్



# సీబీఐ 'గోదా'లో

**కాళేశ్వరం ప్రాజెక్టు గుట్టు ఎట్టకేలకు బట్టబయలయ్యింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోని నిధుల ఆటను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెట్టింది. మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించింది. ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కాకుండా.. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు కూడా పాలుపంచుకున్నాయి. వాప్కోస్ వంటి కేంద్ర ఏజెన్సీలు డిజైన్, నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యాయి. పీఎఫ్‌సీ, ఆర్ఈసీ వంటి ఆర్థిక సంస్థలు నిధులు సమకూర్చాయి. ఇందులో అంతర్రాష్ట్ర అంశాలు కూడా ఉండటంతో ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు అప్పగించడం అవసరమని కమిషన్ సూచించింది. ఆ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై శాసనసభలో చర్చకు పెట్టి తన నిర్ణయాన్ని ప్రకటించింది.**

దేశంలోనే అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టుగా కాళేశ్వరాన్ని ప్రచారం చేసుకున్న అప్పటి కె.చంద్రశేఖరరావు ప్రభుత్వం.. శాస్త్రీయతను, వాస్తవ పరిస్థితులను, నిపుణుల సలహాలను పక్కనబెట్టి గూగుల్ మ్యాప్‌లు చూసి ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక పేర్కొంది. లొకేషన్, డిజైన్ మాత్రమే కాదు.. అలైన్‌మెంట్, నిర్మాణంలో అనుసరించాల్సిన పద్ధతులకు కూడా గూగుల్ మ్యాప్‌నే నమ్ముకొన్నట్లు తేలింది. సాక్షాత్తూ ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషి ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేశారని నివేదిక చెబుతోంది. ఈ కారణంగానే మేడిగడ్డలో రెండు బ్లాకులు కుంగిపోయాయని అంటున్నారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలంటూ రాజకీయంగా ఒత్తిళ్లు, ఆర్థిక అజాగ్రత్తలు, భద్రత, ఇంజనీరింగ్ లోపాలు తదితర అంశాలు కలగలిపి ఈ ఘోర వైఫల్యానికి దారి తీసినట్లు జస్టిస్ ఘోష్ కమిషన్ స్పష్టం చేసిందని విపక్షాలు అంటున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుని నిర్మించే విషయంలో నిపుణులు, కమిటీల సిఫారసులను పక్కన పెట్టి గూగుల్ మ్యాపుల్లో చూసి నిర్ధారించారని ప్రభుత్వం అంచనాకు వచ్చింది. గత పాలకులు దీనిని సాంకేతిక ప్రాజెక్టుగా కాకుండా.. రాజకీయ ప్రాజెక్టుగానే చూశారని జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా అనుమానాలు, సందేహాలు బలపడుతున్నాయి. అప్పటి ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషి, జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ఇచ్చిన అఫిడవిట్‌లో ఈ వివరాలన్నీ ఉన్నాయంటున్నారు.



కేసీఆర్

**బట్టబయలైన బండారం**

అప్పటి నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, ఆ తర్వాత ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఎస్కే జోషి ఇచ్చిన అఫిడవిట్‌లో.. అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో నిపుణులతో కలిసి గూగుల్ మ్యాప్‌ను విస్తృతంగా పరిశీలించి ప్రణాళికలను సిద్ధం చేశారని పేర్కొన్నారని కమిషన్ నివేదిక తెలిపింది. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని, దాని బదులు ప్రాణహిత నదిపై.. వేమనపల్లి వద్ద బ్యారేజీ నిర్మించాలని 2015 జనవరి 15న ఏర్పాటైన నిపుణుల కమిటీ సూచించిందట. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణంతో ఆర్థిక నష్టాలు తప్పవని తెలిసి కూడా అక్కడే నిర్మాణం చేపట్టాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని అప్పటి అధికారులు కుండబద్దలు కొట్టారు.

**సర్వం కేసీఆర్?**

వాప్కోస్ డీపీఆర్ అంచనా వ్యయం చెప్పక ముందే..బ్యారేజీ నిర్మాణ వ్యయం రూ. 71వేల 436 కోట్లు అవుతుందని నాటి ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ప్రకటించారు. వాస్తవానికి వాళ్లు రూపొందించిన ప్రతిపాదన ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ. 13 వేల 594 కోట్లు మాత్రమే అని తెలుస్తోంది. నిపుణుల కమిటీ నివేదికకు 46 రోజుల ముందే భారీ అంచనాలతో కేసీఆర్ ఈ ప్రకటన చేయడానికి ఆధారం, ప్రాతిపదిక ఏమిటో తెలియడం లేదని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని అంశాల్లో పేరు కమిటీదే అయినా.. నిర్ణయం మాత్రం పూర్తిగా కేసీఆర్‌దే అని అప్పుడు ముఖ్యపాత్ర పోషించిన అధికారుల అఫిడవిట్లు స్పష్టం చేస్తున్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లకు సంబంధించి ఇంజనీర్లు ఇచ్చిన అఫిడవిట్లలో డిజైన్ల గురించి భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారని కమిషన్ స్పష్టం చేసింది. మూడు బ్యారేజీల డిజైన్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ పరిధిలోని కేంద్ర డిజైన్ విభాగం ఇచ్చిన ప్రకారమే ఉన్నాయని చెప్పారు. చీఫ్ ఇంజనీరు ఎన్వీ వెంకటేశ్వరరావు వాగ్మూలంలో మాత్రం, కాంట్రాక్టు సంస్థల అఫిడవిట్లలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుంచి డిజైన్లు, డ్రాయింగ్‌లు ఇవ్వడంలో జాప్యం జరిగినట్లు ఉందట. నిర్మాణ ఏజెన్సీలు ఇచ్చిన లెటర్లకు శాఖాపరమైన సమాధానాలు వెంటనే అందివ్వలేదని, మేనేజ్‌మెంట్ సమావేశానికి సంబంధించిన రికార్డులు కూడా లేవని తేలింది.

ఇక, టర్న్‌కీ విధానంలో కాకుండా గుంపగుత్తగా పనులను కేటాయించడం వల్ల.. డిజైన్, డ్రాయింగ్, నాణ్యత విషయంలో కాంట్రాక్ట్ సంస్థ బాధ్యత



# కాళేశ్వరం



ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

తీసుకోలేదని కమిషన్ అభిప్రాయ పడింది. డిజైన్లు పూర్తికాకుండా, పరిశోధనల ఫలితాలు రాకముందే పనులు ప్రారంభించడంతో ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యతపై ఇప్పటికీ అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. అధికారులే డ్రాయింగ్‌లు, డిజైన్లు ఇచ్చారని, సమయానికి భూములు ఇవ్వలేక పోయామని, ఫలితంగా ఏజెన్సీలు కోరినట్లు పొడిగింపు అవకాశం వ్యవధి(ఈవోటీ) ఇచ్చామని ఇంజనీర్లు కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారట. తప్పు ప్రభుత్వం వైపు ఉన్నందున.. ఈవోటీకి ఎలాంటి జరిమానా విధించలేదని వాళ్లు చెప్పారు. 2016లోనే కాంట్రాక్టు ఇచ్చినా.. మొదటి డ్రాయింగ్‌ను పూర్తి స్థాయిలో కాకుండా.. కేవలం నమూనా అధ్యయనం కోసం మాత్రమే అనే నోట్‌తో 2017లో అందజేశారట. 2017, 2018లో విడతల వారీగా డ్రాయింగ్‌లు ఇచ్చారని తేలింది. ఎన్ఐటీ-వరంగల్, ఐఐటీ- మద్రాస్ వంటి సంస్థల నుంచి అధ్యయనాల నివేదికలు రాక ముందే.. నిర్మాణ పనులను ప్రారంభించారని, ఫలితంగా బ్లాకులు కుంగిపోవడం, పిల్లర్లకు పగుళ్లు రావడం లాంటివి చోటు చేసుకున్నాయని విశ్లేషించారు. ఫ్లడ్ బ్యాంకులు, మళ్లింపు ఛానల్ వంటి కొత్త పనులు చేయడం కూడా నిధుల దుర్వినియోగానికి కారణమన్న వాదనలకు బలం చేకూరుతోంది.

**రాజకీయ ఒత్తిళ్లతో నాణ్యతాలోపం**

ఎన్నికలలోపు పనులను పూర్తిచేయాలన్న మితిమీరిన రాజకీయ ఒత్తిళ్లు ప్రాజెక్టు నాణ్యతను దెబ్బతీశాయని తెలుస్తోంది. ఆరు నుంచి ఏడేళ్లు పట్టే ప్రాజెక్టు నిర్మాణాన్ని కేవలం రెండు మూడేళ్లలోనే పూర్తి చేశారు. నాటి ముఖ్యమంత్రే స్వయంగా డిజైన్లలో మార్పులు చేశారని, డీపీఆర్ తయారీలో, తుది నిర్ణయాల్లో జోక్యం చేసుకున్నారని, గూగుల్ మ్యాప్స్ ఆధారంగా లొకేషన్‌లు ఎంపిక చేశారని, ప్రభుత్వ ఒత్తిడి వల్ల నిర్మాణ సంస్థలు కూడా నాణ్యతను గాలికొదిలేశాయని, కనీసం క్యూరింగ్‌కు సమయం ఇవ్వలేదని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో తేటతెల్లమైంది. పరీక్షల్లేకుండా కాంక్రీట్ పనులు పూర్తి చేయడంతో.. భవిష్యత్తులో వరదలొస్తే.. బ్యారేజీ తీవ్ర ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. ఫలితంగా ఏటేటా మరమ్మతుల, నిర్వహణ ఖర్చులు పెరుగుతూ పోతాయి. రూ. 80 వేల కోట్ల ప్రాజెక్టు నిర్మాణ అంచనా రూ. లక్షా 20 వేల కోట్లకు చేరింది. ఫలితంగా ప్రజలపై అప్పుల భారం పడింది. ప్రాజెక్టు నిర్వహణకు విద్యుత్తు బిల్లులు భారంగా మారాయి. చాలాచోట్ల కాలువలు పూర్తికాలేదు. నది సహజ ప్రవాహాన్ని మార్చడం వల్ల వరద ప్రభావిత ప్రాంతాలు పెరిగాయని, కొన్ని గ్రామాలు తరచూ నీటమునిగే పరిస్థితి దాపురించిందని, పర్యావరణ అనుమతులున్నప్పటికీ.. ఆచరణలో వాటిని ఉల్లంఘించారని కమిషన్ తేల్చి చెప్పింది.

'మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించకూడదని నిపుణుల కమిటీ సూచించినప్పటికీ, నీటి లభ్యత పేరుతో దానిని పట్టించుకోలేదు. డీపీఆర్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించకుండానే అంచనాలు ఆమోదించారు. అప్పటి సీఎం నిర్ణయం ప్రకారమే మేడిగడ్డతో పాటు సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నిర్మితమయ్యాయి. నిర్మాణపనులకు కాంట్రాక్టులు ఇచ్చిన విధానం సరైనదికాదు. కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చడమే లక్ష్యంగా నిబంధనలను సడలించి అంచనాలను పెంచడంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మేడిగడ్డకు ఇచ్చిన సబ్‌స్టాన్షియల్ సర్టిఫికేట్ చట్టవిరుద్ధం' అని ఘోష్ కమిషన్ తేల్చింది.

**అసెంబ్లీ సాక్షిగా సర్కారు నిర్ణయం**

జస్టిస్ ఘోష్ నివేదిక రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టించింది. ఈ కమిషన్ నివేదికపై చర్చించేందుకే ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను కూడా నిర్వహించింది. మరోవైపు.. ఈ నివేదికను అసెంబ్లీలో చర్చించకుండా చూడాలని, నివేదికను బహిర్గతం చేయొద్దని బీఆర్ఎస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, వాళ్లకు నిరాశే ఎదురయ్యింది. దీంతో, అసెంబ్లీలో రెండు రోజుల పాటు చర్చించి ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఆదివారం అయినప్పటికీ ఆగస్టు 31వ తేదీ అర్ధరాత్రి దాటేదాకా దాదాపు తొమ్మిది గంటల పాటు ఈ నివేదికపై చర్చను నిర్వహించారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఎమ్మెల్యేలందరికీ పెన్‌డ్రైవ్ రూపంలో అందజేసింది.

**బీజేపీ ప్రతిస్పందన**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, నివేదికలో కేసీఆర్ అవినీతిపై ప్రస్తావన లేకపోవడం అనుమానాలు రేకెత్తిస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ,ఈ ప్రాజెక్టు అవినీతిపై బీజేపీ మొదటి నుంచీ చేస్తున్న ఆరోపణ నిజమేనని స్పష్టమైందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇందుకు పూర్తి బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. ఈ ప్రాజెక్టు అవినీతిపై తాము మొదటి నుంచి సీబీఐ విచారణ కోరుతున్నామని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను కాపాడే ఉద్దేశంతోనే ఇంత జాప్యం చేసిందని ఆరోపించారు.

**ప్రాజెక్టును మూసివేస్తారా?: బీఆర్ఎస్**

కాళేశ్వరం ప్రాజెక్టు కేసు సీబీఐకి అప్పగించడం అంటే ప్రాజెక్టును మూసివేయడమేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు స్పందిస్తూ వ్యాఖ్యానించారు. తెలంగాణ వరప్రదాయినిని శాశ్వతంగా మూసివేసి గోదావరి నదీ జలాలను ఆంధ్రకు తరలించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

**కవిత వ్యాఖ్యలతో ప్రకంపనలు**

ఈ మొత్తం వ్యవహారంలో కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవిత పార్టీ నేతలు హరీష్ రావు, సంతోష్ రావులపై చేసిన ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీశాయి. కేసీఆర్ బద్‌నాం కావడానికి వారిద్దరే కారకులని, ప్రాజెక్టు వ్యవహారంలో వారిదే కీలక పాత్ర అని, అందుకే రెండోసారి హరీష్‌రావును నీటి పారుదల శాఖ నుంచి తప్పించారన్నారు. అవినీతి అనకొండల మధ్య తన తండ్రి బలిపశువు అవుతున్నారని అన్నారు. ఇలా ఉండగా, జస్టిస్ ఘోష్ నివేదిక ఆధారంగా నాటి చంద్రశేఖరరావు, హరీష్‌రావులపై చర్యలు తీసుకోవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 7కు వాయిదా వేసింది.

**సుజాత గోపగోని**

సీనియర్ జర్నలిస్ట్, 6302164068

**సమాజంలో అత్యంత దుర్భర జీవనం గడుపుతున్న వెనుకబడిన తరగతుల్లో అత్యంత వెనుకబడిన కులాలకు చెందినవారే సంచార జాతుల వారు. రాష్ట్రంలో సంచార అర్ధసంచార విముక్త కులాలు మొత్తంగా 42 ఉన్నాయి. తమకంటూ ఒక స్థిర నివాసం లేని ఈ కులాలు బతుకుతెరువు కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పలు రాష్ట్రాలకు వలస పోతున్నారు.**



# సంచార జాతుల జీవి

సంచారజాతులు పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా పట్టణ ప్రాంత శివారులలో చిన్నచిన్న గుడారాలు, గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నాయి. ఒక ప్రదేశంలో 15 లేదా 20 రోజులకు మించి ఉండకుండా భుక్తిని వెతుక్కుంటూ నిరంతరం సంచరిస్తారు. పాము, తేలు తదితర మంత్రగాళ్లు, ఆయుర్వేద వైద్యులు, గారడీ చేసేవారు , విన్యాసాలు చేసేవారు, నటులు, కథకులు, జంతు వైద్యులు, పచ్చబొట్లు వేసేవారు, రోళ్లు తయారీదారులు , బుట్టల అల్లకం ఇలాంటి పనులతో పాటు యాచక వృత్తిని ప్రధానంగా చేసుకుని జీవనం గడుపుతుంటారు. రవాణా, పరిశ్రమలు, ఉత్పత్తి, వినోదం, పంపిణీ వ్యవస్థలలో తీవ్రమైన మార్పుల కారణంగా వారు తమ జీవనోపాధిని కోల్పోయారు.

**నేరస్తుల ముద్ర వేసిన బ్రిటిషర్లు**

నేడు సంచార జాతులుగా వ్యవహరిస్తున్నవారు రాజుల కాలంలో బాగానే బతికేవారు. కథలు వినాలన్నా, తోలుబొమ్మలాటలు చూడాలన్నా, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలన్నా రాజులు సంచార జాతులను పిలిపించుకొని వారిచేత నాటకాలు వేయించుకొని ఉల్లాసాన్ని పొందేవారు. గుళ్లు, ఇళ్లు, చెరువులు, బావులు, కోటలు కట్టేవారు. ఆ రోజుల్లో వీరికి ఎంతో గౌరవం ఉండేదని చరిత్ర చెబుతోంది. అయితే బ్రిటిష్ వాళ్ల కాలంలో సంచార జాతులకు కష్టాలువచ్చాయి. ముస్లిం పాలకులు, బ్రిటిష్ పాలనా సంస్కరణల్లో భాగంగా రైతాంగం పన్నులు చెల్లించలేక పలు ఇబ్బందులు పడ్డారు. ఆహార ఉత్పత్తిలో అధికభాగం నాటి పాలకులకు శిస్తు రూపంలో చెల్లించేందుకే సరిపోయే. వ్యవసాయ పనులు మందగించి ఎవరికీ పనులు లేకుండా పోయాయి. పనులే ప్రధానంగా గల సంచార జాతులకు పనులు లేకుండా పోయాయి. ఏ గ్రామానికి వెళ్లినా గుప్పెడు అన్నం దొరకని పరిస్థితి. ఆకలికి ఆగలేకపోయేవారు. చిన్న పిల్లల కడుపు నిపేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో చిన్న చిన్న దొంగతనాలు చేయడం మొదలు పెట్టారు. బ్రిటిష్ వారు ఇలాంటి వారికి 'క్రిమినల్ ట్రైబ్స్ 'అని పేరు పెట్టారు.

స్థిరపడిన సమాజానికి 'ముప్పు' కలిగించే సమూహాల పేరుతో జాబితా చేసి, 1871లో క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ అనే చట్టాన్ని ప్రవేశపెట్టారు. దీని ఫలితంగా దేశంలో అటువంటివి దాదాపు 200 సంఘాలను నేరస్థులుగా 'నోటిఫై' చేశారు. ఒకరు, ఇద్దరు దొంగతనాలకు పాల్పడినా సంచార జాతులన్నిటికీ నిందితులుగా పేరు పడిపోయింది. ఇది భరించలేని సంచార జాతుల వారు చాలాసార్లు బ్రిటీష్ వారిపై దాడులు చేశారు. పోలీసులు వీరిపై లెక్కలేనన్ని కేసులు పెట్టి వేధించేవారు. చావకొట్టేవారు.

పలువురు సంఘసంస్కర్తల కృషివల్ల, స్వాతంత్ర్యం వచ్చాక 'క్రిమినల్ ట్రైబ్స్' పరిస్థితిపై 1948లో అయ్యంగారి కమిషన్ వేశారు. వారి పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఆ పేరు (క్రిమినల్ ట్రైబ్స్' మార్చాలని అయ్యంగార్ ప్రభుత్వానికి సూచించారు. దాంతో 1952 ఆగస్టు 31న 'నేరస్తుల జాతుల' చట్టాన్ని రద్దు చేశారు. వీరిని ఎస్టీ జాబితాలో చేర్చాలని పలు వినతులు వచ్చినా నాటి కేంద్రంలోని





# తంలో వెలుగెన్నడు?





కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకోలేదు. 1970 దశకంలో లంబాడ, ఎరుకల కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారు. మిగతా కులాలను వదిలేశారు. 1980లో వీరంతా బీసీలు అయిపోయారు.

ఏళ్లు గడుస్తూనే ఉన్నాయి. అనేక కమిటీలు సంచారజాతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేశాయి. 2004లో జస్టిస్ మోతిలాల్ రాథోడ్ అధ్యక్షతన జాతీయ కమిషన్‌ను అప్పటి కేంద్రప్రభుత్వం వేసింది. 2006 లో మహారాష్ట్రకు చెందిన జస్టిస్ బాలకృష్ణ రేణకే అధ్యక్షతన రెండో కమిటీని యూపీఏ ప్రభుత్వం వేసింది. ఆ కమిటీ దేశవ్యాప్తంగా తిరిగి ఆయా జాతుల స్థితిగతులపై అధ్యయనం చేసింది. వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు 76 సిఫార్సులతో అప్పటి (2008) ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు నివేదిక సమర్పించింది. అయితే ఆ కమిషన్ సిఫార్సులను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోలేదు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వమైనా సంచార జాతుల జీవనాన్ని మెరుగుపరిచేలా బాలకృష్ణ రేణకే కమిటీ సిఫార్సులను అమలు పర్చాల్సిన అవసర ముంది. వారి సర్వతోముఖాభివృద్ధే బీజేపీ ధ్యేయం: కె.లక్ష్మణ్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా అత్యంత వెనుకబాటులో ఉన్న సంచార, అర్ధ సంచార జాతుల అభ్యున్నతే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. వారి సంక్షేమానికి కట్టుబడి, అభివృద్ధి ఫలాలను ప్రతి ఒక్కరికీ గతంలో దేశాన్ని పాలించిన కాంగ్రెస్ సంచార జాతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని తీవ్రంగా ఆరోపించారు. "గరీబీ హటావో" అంటూ దశాబ్దాల పాటు నినాదాలు చేసిన కాంగ్రెస్ నాయకులు, ఈ నిరుపేద సంచార జాతుల కోసం చేసిందేమీ లేదు. వారి ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే ఈ జాతులు విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలకు దూరమై సమాజంలో అట్టడుగున ఉండిపోయాయి' అని ఆందోళన వ్యక్తం చేశారు. కులం, మతం, ప్రాంతం, భాషల పేరుతో దేశంలో విభజన రాజకీయాలు చేయడానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడే దేశవ్యాప్తంగా సంచార జాతుల స్థితిగతులపై అధ్యయనం జరిగిందని లక్ష్మణ్ గుర్తు చేశారు. వారిని ఆదుకున్న మొట్టమొదటి ప్రభుత్వం బీజేపీయేనని చెప్పారు. 'ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే సంచార, అర్ధ సంచార జాతులకు విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించారు. 5 లక్షల సంచార జాతుల కుటుంబాలకు ఆయుష్మాన్ భారత్ కార్డులు అందించి, వారికి ఆరోగ్య భద్రత కల్పించాలని కేంద్రం కృషి చేస్తోంది. సమాజంలో వారిని చిన్నచూపు చూసేలా ఉన్న రకరకాల పేర్లను మార్చి, వారికి గౌరవప్రదమైన గుర్తింపును ఇవ్వాలని కూడా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది' అని లక్ష్మణ్ తెలిపారు

**రాష్ట్రంలోనూ అండగా ఉంటాం:**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని సంచార జాతుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు. "కేంద్ర ప్రభుత్వం ఈ జాతుల కోసం కేటాయించిన నిధులను సైతం గత పాలకులు పక్కదారి పట్టించారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్‌టీ, డీఎన్‌టీ ధ్రువీకరణ పత్రాలు అందేలా చూస్తాం. అవసరమైతే మేమే స్వయంగా వారిని కలెక్టర్ల వద్దకు తీసుకెళ్లి సర్టిఫికెట్లు ఇప్పిస్తాం," అని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, తిరుమల బ్రహ్మోత్సవాలు వంటి ప్రముఖ దేవాలయ ఉత్సవాలలో వారి సంప్రదాయ కళలను, నృత్యాలను ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీ పాకా సత్యనారాయణ, మరో ఎంపీ ఆర్. కృష్ణయ్య సంచార జాతులకు న్యాయం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ ప్రసంగించారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు**

తొలుత గంగిరెద్దుల, దొమ్మర్ల, పంబల విన్యాసాలు నడుమ బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. బాలసంతు, బండార, బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెద్దుల, జంగం, జోగి, కాటికాపరి, కొర్చ, మొండివారు, పిచ్చిగుంట్ల, పాముల, పార్ధి, పంబల, దమ్మాలి, వీరముష్టి, గూడల, కంజార, కాప్మారే, మొండిపట్ట, నొక్కార్, పరికి, మగ్గుల, యాట, చోపేమారి, కైకాడి, జోషినందివాలా, మందుల, కునపులి, పత్రా, రాజనాల, కాసికపాడి జాతులవారు చేసిన ప్రదర్శలు, పాటలు ఆకట్టుకున్నాయి. పలు రకాల డప్పు వాయిద్యాలు, సన్నాయిలు, ఇతర సంగీత సాధనాలతో తరతరాల వారసత్వంగా వస్తున్న కట్టుబాట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, విష్ణుకుమార్‌రాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్



## సెప్టెంబర్ 9 బలరామ జయంతి

కృష్ణాగ్రజుడుబలదేవుడు ఏడవ అవతారంగా భాగవతం పేర్కొంటోంది. ఆయన సాక్షాత్తు ఆదిశేషుడు. మునుపటి యుగం (త్రేతా)లో రామమూర్తిగా అవతరించిన శ్రీమన్నారాయణుడిని 'రామానుజుడి'గా సేవించి, తరువాతి యుగం (ద్వాపర)లో కృష్ణాగ్రజుడిగా సేవలందుకున్నాడు. ఆయన కర్షక ప్రతినిధి. అనావృష్టి నివారణకు హలధారియై అహరహరం శ్రమించాడు. అధర్మాన్ని నిరసించడం ఆయన నైజం. తన శిష్యుడు దుర్యోధనుడు స్వభావ రీత్యా అకృత్యాలకు పాల్పడినా, భీముడు ఆతనిని గదా యుద్ధంలో మట్టుపెట్టిన తీరును ధర్మ విరుద్ధంగా వ్యాఖ్యానించారు. రోకలి, నాగలి ఆయన ఆయుధాలు. ....

# కర్షక ప్రతినిధి...ధర్మపక్షపాతి

బలరాముని అవతార విశేషాలు శ్రీమద్భాగవతంలోని దశమస్కంధంలో కనిపిస్తాయి. రోహిణి తనయుడిగా పేరున్న ఆయన దేవకీ నందనుడు కూడా. ఇద్దరు తల్లుల పుత్రుడు కావడం విశేషం. 'నీ సోదరి దేవకి అష్టమ గర్భ సంజాతుడు నీ మరణ కారకుడవుతాడు' అని అశరీవాణి కంసుడిని హెచ్చరించడంతో, అప్రమత్తమైన ఆతడు సోదరి దేవకి, బావమరిది వసుదేవుడిని కారాగారంలో బంధించాడు. వారి ఆరుగురు శిశువులను సంహరించిన తరువాత ఏడవ గర్భం సమయంలో శ్రీమహావిష్ణువు, యోగమాయ సహకారంతో దేవకి గర్భస్థ పిండాన్ని రోహిణి గర్భంలో ప్రవేశపెట్టాడు. ఈ ప్రక్రియను 'సంకర్షణం' (బాగా లాగడం)అంటారు. అలా బలరాముడు 'సంకర్షణుడు'గా ప్రసిద్ధుడయ్యాడు. బలవంతులలో శ్రేష్ఠుడు కనుక బలదేవుడని, అందంగా ఉంటాడు కనుక బల రాముడని, నీలవస్త్ర ధారుడు కనుక నీలాంబరుడని, తాళవృక్ష ధ్వజం కలిగి ఉండడంతో తాళంకుడని,అందరినీ రమింప చేయడంతో రాముడు అని పేరు. ప్రలంబుడనే రాక్షసుడిని సంహరించినందుకు ప్రలంబఘ్నుడని ప్రసిద్ధుడు. ప్రధానంగా గార్ధభాసుర సంహారం ఆయన ఉత్కృష్ట లీలల్లో ప్రధానంగా చెబుతారు.

శ్రీమన్నారాయణుడి శ్వేత తేజస్సు బల రాముడిగా, నీలతేజస్సు శ్రీకృష్ణుడిగా ప్రభవించింది. శ్రీ మహావిష్ణువు కేశసంపదలోని ఒక తెల్లటి దానిని రోహిణి గర్భంలోకి, నల్ల దానిని దేవకీ గర్భంలోకి ప్రవేశపెట్టారని, అందుకే సోదరులు తెలుపు, నలుపు రంగులతో పుట్టారనే కథనం ప్రచారంలో ఉంది. బలరాముడికి యతులు, తీర్థయాత్రలంటే మక్కువ. ఆయన తీర్థయాత్రలు మహాభారతంలో విశేషంగా వర్ణితమయ్యాయి. తామసం,ముక్కుసూటితనం ఆయన లక్షణాలు. తన ఆయుధం నాగలి అసురులతో పోరాడటానికి, యమునా నదిని బృందావనానికి సమీపానికి మళ్లించడానికి, హస్తినాపుర రాజధాని మొత్తాన్ని గంగా నదిలోకి లాగడానికి కూడా దానిని ఉపయోగించుకున్నాడని కథనం. తనకు ఆగర్భశత్రువులైన మేనల్లుళ్లను హతమార్చేందుకు కంసుడు ఎత్తువేస్తాడు. వారిని ధనుర్యాగంపేరిట వారిని పిలిపించి చాణూర ముష్టికులనే మల్లయోధులను ఊసి గొలుపుతాడు. బలరామకృష్ణులు వారిని అవలీలగా వధిస్తారు. కృష్ణుడు కంసుడిని, బలరాముడు శక్తిమంతవమైన అక్కడి సైన్యాధిపతి కాలవక్రుడిని చంపాడు. బలరాముడు కాకుద్మి రాజు కుమార్తె రేవతిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు నిషాత, ఉల్ముక. కుమార్తె – వత్సల(శశిరేఖ).

గదాయుద్ధంలో ప్రవీణుడు. భీమ దుర్యోధనులకు గదా యుద్ధంలో శిక్షణ ఇచ్చాడు. దుర్యోధనుడు ఈ విద్యను మరింత శ్రద్ధగా, పట్టుదలగా నేర్చాడు. ద్రౌపదీ వస్త్రాపహరణం సందర్భంగా, ఆమెను అవమానించిన దుర్యోధనుడి తొడలు విరగకొడతానని భీముడు ప్రతిజ్ఞ చేయగా, అది అనివార్యం కావచ్చన్న భావనతో పాండవుల వనవాసం సమయంలో ఆతను తన గదాయుద్ధ విద్యను మరింత మెరుగుపరుచుకున్నాడు.

బలరాముడికి తమ్ముడు కృష్ణుడంటే ఎంత వాత్సల్యానురాగాలు ఉన్నా ఆయన పాండవాభిమానాన్ని (పక్షపాత వైఖరి) సహించలేకపోయాడు. అలా అని తమ్ముడికి ఇబ్బంది కలిగించే చర్యలు/కార్యాలకు దిగలేదు. 'జూదంలో శకుని పాండవులను న్యాయసమ్మతంగానే ఓడించి రాజ్యాన్ని పొందాడు. కనుక రాజ్యం దుర్యోధనుడిది. పాండవులకు దానిపై అధికారం లేదు. కావాలంటే వీళ్లు బతిమాలి తెచ్చుకోవాలి. కార్యసాధకుడైన బ్రాహ్మణుడిని పంపండి' అని బలరాముడు అనడంపై తమ్ముడు సాత్యకి విభేదించాడు. 'పాండవులపై న్యాయంగా గెలవలేదు. కనుక పాండవులకు అధికారం ఉంది' అన్నాడు. తమ్ముడు పాండవ పక్షపాతి అని ముద్రవేసి సభను వీడతాడు.

కౌరవ పాండవుల మధ్య యుద్ధాన్ని నివారించేందుకు విఫలయత్నం చేశాడు. కురుక్షేత్రంలో పార్థుడికి సారథ్యం వహించడానికి శ్రీకృష్ణుడు అంగీకరించినప్పుడు తాను ఏ పక్షం వైపునకు మొగ్గలేదు. తీర్థయాత్రలకు వెళ్లాడు. యుద్ధం దాదాపు ముగింపు దశలో ....భీమదుర్యోధనుల గదాయుద్ధం సమయానికి తిరిగి వచ్చాడు. ఇద్దరు సమబలులు కనుక పోరువద్దని నచ్చజెప్పచూచాడు. అయినా పోరు అనివార్యమైంది. భీముడు సుయోధనుడి తొడలు విరుగగొట్టాడు. ప్రియశిష్యుడి మరణం బలదేవుడిని కలచి వేసింది. గదాయుద్ధంలో నాభికి దిగువ భాగాన కొట్టరాదన్న యుద్ధనీతిని భీముడు విస్మరించాడన్న ఆగ్రహంతో ఆతనిపై హలాయుధాన్ని ప్రయోగించ బోయాడు. తమ్ముడి అనునయ వాక్యాలతో శాంతిం చాడు. కృష్ణభగవానుడు శరీర త్యాగం చేసే సమయం లోనే బలదేవుడు ఒక చెట్టు నీడన ధ్యానం చేస్తుండగా, ఆయన నోటి నుంచి వెలువడిన తెల్లని పాము సముద్రంలో చేరగానే, ఆయన శరీరం నేలకు ఒరిగింది. కొన్ని చోట్ల బలరాముడు తమ్ముడితో పూజలందుకుంటుండగా, పూరి క్షేత్రంలో అనుజుడు జగన్నాథుడు (శ్రీకృష్ణుడు), చెల్లెలు సుభద్రతో కొలువుదీరాడు. అక్కడి వార్షిక రథయాత్రలోనూ ఆయన రథమే ముందుంటుంది. జగన్నాథ సంప్రదాయంలో అతను ముక్కోటి దేవతలలో ప్రత్యేకమైనవాడిగా పరిగణిస్తారు.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్



Dr. G. Suryanarayana Raju
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience



Dr. D. Raghunadharao
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

# Asvins Specialty Hospitals

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.

www.asvinshospitals.com Ph: +91 94404 45775

**40+ Years of Oncology Expertise**
**Over 7,00,000 Patients Treated**
**75,000 Successful Surgeries**
**99% Success Rate**

ASVINS
Specialty Hospitals
Care•Cure•Comfort



## SERVICES

| SURGICAL SPECIALTIES: | MEDICAL SPECIALTIES: |
|---|---|
| Anaesthesiology | Bone Marrow Transplant |
| Breast Surgery | Cardiology |
| Bone & Soft Tissue Tumors | Chest Medicine |
| Gynaecology & Gynaec Oncology | Endocrinology |
| Head & Neck Oncology | Gastroenterology |
| Minimal Access Surgery | Hematology & Hemato Oncology |
| Neurosurgery | Internal Medicine |
| Plastic & Reconstructive Surgery | Intensive Care |
| Surgical Oncology | Medical Genetics |
| Thoracic Oncology | Medical Oncology |
| Transplant Surgery | Nephrology & Dialysis |
| Urology, Andrology & Endo Urology | Neurology |
| Vascular Surgery | Orthopaedic & Rheumatology |

**Book Your Consultation Now +91 9440445775**

**We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries**

**We Expertise in Treating All Cancers**

**Expert Treatment At Affordable Prices**

SCAN ME

# అశ్విన్ క్యాన్సర్ కేర్, భీమవరంలో

అశ్విన్స్
స్పెషాలిటీ హాస్పిటల్స్



*ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్*

**డా॥ జి. సూర్యనారాయణ రాజు**

M.S. MCh, FRCS, FUICC సర్జికల్ ఆంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ ఆంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్



*ప్రముఖ గైనో ఆంకాలజిస్ట్*

**డా॥ రమణి GSV**

MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ ఆంకాలజీ &
ప్రివెంటివ్ ఆంకాలజీ

**ప్రతి నెల మొదటి ఆదివారం**



*ప్రముఖ హెమాటో ఆంకాలజిస్ట్*

**డా॥ గెంటే. విక్రమ్ కుమార్**

MBBS, MD ఇమ్యునో- హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్)
కన్సల్టెంట్ హెమటాలజీ మరియు
హెమటో- ఆంకాలజీ

**ప్రతి నెల రెండవ ఆదివారం**

**ఈ దిగువ లక్షణాలు కలవారు డాక్టర్ గారిని సంప్రదించగలరు.**

తెల్ల బట్ట, అధిక నెలసరి, PCOS లక్షణాలు, గర్భసంచి కాన్సర్, అండాశయ కాన్సర్, అండాశయపు గడ్డలు & నీటి గడ్డలు, గర్భ సంచి కణితులు, గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ (HPV). రుతువిరతి తర్వాత సమస్యలు, దీర్ఘకాలిక దగ్గు, దగ్గేటప్పుడు రక్తం పడటం, మూత్రంలో రక్తం, ఆహారం మింగలేకపోవడం, నోటి పూతలు, మెడలో గడ్డలు, రొమ్ము లో గడ్డలు, వాంతులు, రక్తపు వాంతులు, కామెర్లు, దీర్ఘకాలిక అతిసారం, మలబద్ధకం, రక్తస్రావం, తెల్లబట్ట

బ్లడ్ కాన్సర్, అధిక రక్తస్రావం (Bleeding Problem), రక్తహీనత (Anaemia), ప్లేటిలెట్స్ కణాలు తగ్గడం, రక్త కణాలు సమస్య, రక్తం ఆధికంగా గడ్డకట్టడం, పసకలు (Jaundice), ప్లీహం పెద్దగా అవడం (Splenomegaly), బోన్ మ్యారో మార్పిడి

**అభినవ్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 224338**

ఉదయం
గం॥ 10:30ల నుండి
గం॥ 2:00ల వరకు

**లోటస్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 230555**

**గమనిక పేషెంట్స్ తమ పాత రిపోర్టులతో సంప్రదించండి | అన్ని రకాల క్యాన్సర్ల కు చికిత్స మరియు సలహాలు ఇవ్వబడును.**

**అపాయింట్మెంట్ కొరకు** హాస్పిటల్: 9440445775, సీత: 9618161032 అచ్చయ్య: 9398573243

**"ప్చ్.. పన్నాగమా? వాడి పిండాకూడా! అవతల కాకతీయ కాకులు ఇంకా స్కంధావారంలోనే ఉన్నాయి. ఏ క్షణమైనా మనపై దాడికి సిద్ధమౌతున్నట్లు వేగుల వార్త. యుద్ధానికి సన్నద్ధమవ్వాలి మహాప్రభో అంటే మహా ప్రధానిగారు చెవిన పెట్టరు. అసలు మహారాజులుంగారిని అనాలి. నెత్తిన బెట్టుకున్నారు. ప్చ్.. వాడు చెప్పిందే వేదం."**

**గిర్రున వెనుదిరిగి బయటకు వెళ్లిపోయాడు.**

**వెచ్చని ఆనందాలు గణపతిదేవుని శరీరమంతా వ్యాపించాయి. కాకతీయ సైనికులు ఇంకా స్కంధావారంలోనే ఉన్నారు. అంటే యుద్ధ ప్రయత్నాల నుండి వెనుదిరగలేదు. ఓటమిని ఒప్పుకోలేదు. ఏ క్షణమైనా మళ్లీ యుద్ధం ఆరంభం కావచ్చు. అది తన కోసమే అనడంలో ఎలాంటి సందేహం లేదు.**

తనను ఎందుకు చంపలేదో ఇప్పుడు అర్థమయింది. అక్కడ స్కంధావారంలో కాకతీయ సైన్యం ఉన్నంత వరకూ ఇక్కడ తనను చంపలేరు. చంపితే మరుక్షణం దేవగిరి భస్మీపటలం అవుతుంది. ఒకరకంగా వీళ్ల పీకకు కాకతీయ ఖడ్గం.. పదునైన ఖడ్గం ఆన్చి ఉంది. గట్టిగా ఊపిరి పీల్చినా తెగుతుంది పీక!



నాన్నగారు వీరమరణం పొంది ఉండవచ్చు. కాని రేచర్ల రుద్రసేనాని పెద్దనాన్న నిద్రపోడు. అమ్మో అమ్మో.. ఒక్క చేత్తో వందమంది శత్రు సైనికులను ఆప గల మహాయోధ. అలాగే మహాప్రధాని వెల్లంకి గంగాధర నాన్నగారు విశ్రమించడు. ప్రతీకారంతో ఇద్దరూ రగిలిపోతుంటారు. పెదనాన్నగారితో అనేక యుద్ధాల్లో పాల్గొని ఆరితేరిన మహాయోధులు ఇద్దరూ. అదే సమయంలో గంగాధర నాన్నగారు యుద్ధతంత్ర మాంత్రికుడు కూడా. ఇద్దరూ ఏ క్షణమైనా దేవగిరిని సర్వనాశనం చేయగల యోధానుయోధులు.. రణరంగ విశారదులు.

నాన్న మహాదేవుడు, గంగాధరుడు, రేచర్ల రుద్రయ.. ముగ్గురు ఒకే ప్రాణంగా పెరిగిన స్నేహితులు.

"నీకు ముగ్గురు నాన్నలు" అనేవారు పెదనాన్న.

నిజమే.. ముగ్గురిని యుద్ధశక్తి, రాజనీతి ప్రవీణులుగా కత్తులు సానబెట్టినట్లు సానబెట్టారు పెదనాన్న. నాన్న మహాదేవుని వీరమరణం వీరిద్దరికీ జీవితంలో మరచిపోలేని అవమానం. నాన్నతో ప్రాయోపవేశానికి కూడా వాళ్లిద్దరూ సిద్ధమే. కాని తన కోసం.. కాకతీయ సింహాసనం కోసం.. కాకతీయ వంశం కోసం బ్రతికి ఉంటారు.

ఒకటి తథ్యం. వారు అక్కడ తిండి తినరు.. నీళ్లు తాగరు. నిద్రపోరు!! విస్ఫులింగాలై మండుతున్న వారి కన్నులు గణపతి

# గణపతిదేవుడు




**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

ఊహించుకుంటున్నాడు.

కానీ, అనుమకొండలోనే కాదు కాకతీయ స్కంధావారంలోను ఏం జరుగుతున్నదో గణపతికి తెలియదు.

చెప్పేవారు ఎవ్వరూ లేరు. కాని రకరకాల ఆలోచనలతో కాలం గడుస్తున్నది. తనకు లభిస్తున్న గౌరవమో.. అగౌరవమో.. ఏదైనా కాకతీయులు యుద్ధంలో ఓడినా స్కంధావారం ఎందుకు తొలగించలేదో, అనుమకొండ వెళ్లలేదో! అనేక ప్రశ్నలు. తిరిగి దేవగిరిపై దాడి చేస్తారని వినవస్తున్న వార్తలకు ఇది వీళ్ల ప్రతిస్పందన మాత్రమేనని గణపతి ఊహించుకుంటున్నాడు. అవి కొంత ఉత్సాహాన్ని, ఉద్రేకాన్ని ఇస్తున్నాయి. కానీ అసలు అక్కడ ఏమి జరుగుతున్నదోనన్న ఆలోచనల తాకిడికి సాంత్వన కూరుస్తూ ఓ మైకం అతన్ని ఆవరించబోతోంది.. త్వరలో! అదే ప్రేమ మైకం!!

* * *

కాకతీయ స్కంధావారం– ఓ మహావీరుడు ఓ సాధారణ సైనికుడి చేతిలో ఓడిపోతే దిమ్మెరబోయి.. అవమానభారంతో కృంగిపోయి.. చావలేక చావురాక.. బ్రతకలేక.. శేషజీవితాన్ని ఎలా గడపాలో తెలియక.. కుమిలి కుమిలిపోతూ పిచ్చెక్కినట్లు ఉంటాడో, అలా ఉంది.

అందులో మధ్యగా కాస్త ఎత్తున సర్వ సైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రయ సేనాని. సర్వసైన్యాధ్యక్షుడు బయటకు వచ్చి సైనికులకు, సేనానులకు, సేనాధిపతులకు, దళపతులకు ఏదైనా సందేశం ఇవ్వడానికి తగినట్లుగా స్కంధావారం మధ్యగా కాస్త ఎత్తుపై ఏర్పాటు చేస్తారు.

అవమానంతో రగిలిపోతున్న మృగరాజులా అటూ ఇటూ తిరుగుతున్నాడు రుద్రసేనాని. కళ్లు ఎర్రెర్రగా మండుతున్నాయి. మాటిమాటికి దవడ బిగుసుకుంటోంది. కళ్లముందు, కంటిలోనూ, భోజన పళ్లెరంలోనూ, నీటి పాత్రలోనూ.. ఎటు చూసినా, చూడకున్నా రేయింబవళ్లు అదే దృశ్యం.. ఒక్కటే దృశ్యం..

కాకతీయ మహారాజు మహాదేవులవారి నిర్జీవ శరీరం!!

పళ్లు పటపట కొరికాడు.. లక్షవసారి.

ఒక్క క్షణం, ఒక్క క్షణం.. కనీసం లిప్తకాలం దొరికినా సోదరుడిలా కలిసి పెరిగిన మహారాజును ప్రాణాలొడ్డి కాపాడుకునేవాడే.. ఎంత పని జరిగింది.. ఎంత అవమానం.. ఎంత దుర్భరం.. ఈ ఓటమి!!

యుద్ధక్షేత్రంలో నాలుగు నెలలనాడు జరిగిన సంఘటన కళ్ల ముందు కదలాడింది.

ఎవరో గావుకేక పెట్టారు. "మహారాజులు ఒరిగిపోయారు. అయ్యయ్యో.. కాకతీయకేతనం అవనతం అవుతోంది. మహారాజు.. మన మహారాజు మరణించినట్లున్నారు.. హమ్మో.. హమ్మో.."

మతిపోయింది. చేతిలోని ఖడ్గం జారిపోయింది. పరుగుపరుగున కాకతీయ కేతనం క్రిందికి జారుతూ కనిపించినవైపుగా పరుగెత్తాడు. అప్పటికే చుట్టూ సేనానులు, దళపతులు, సైనికులు గుండెలు బాదుకుంటూ అటే పరుగులు పెడుతున్నారు.

నిజమే.. ఏది జరగకూడదో అదే జరిగింది. శవమై పడి ఉన్నాడు కాకతీయ మహారాజు మహాదేవుడు.

పరుగుపరుగున వచ్చి వాలాడు తను. యుద్ధరంగంలో దూరంగా తనని నిమగ్నుడిని చేసి ఇక్కడ మహాదేవుడ్ని నిర్జించారు. నిర్జీవుడైన మహారాజు, మిత్రుడు, సోదర సమానుడు అయిన మహాదేవుడ్ని చూసి బావురుమన్నాడు. మహారాజు శిరస్సును ఒడిలో జేర్చుకుని విలవిలలాడిపోయాడు.

"రెండు ఘడియలు.. రెండే రెండు ఘడియలు కాపాడలేకపోయారా నీచులారా.. నేనే వచ్చి కాపాడుకునేవాడిని. మహారాజును పొట్టన పెట్టుకున్నాము కదరా! ఇప్పుడు అనుమకొండ ఎలా వెళ్లాలి! మహారాజు మృతదేహంతో వెళ్లి కాకతీయ ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలి? పట్టపురాణి బయ్యమాంబాదేవి ముఖం ఎలా చూడాలి. 'నువ్వుండగా నాభర్త నిర్జీవుడు అవడం ఏమిటి అన్నా..' అని ప్రశ్నించే ఆమె చూపులకు ఎలా తట్టుకోవాలి?"

కుమిలిపోయాడు ఈ అరివీర భయంకరుడు. మహాదేవుడి నిర్జీవ శరీరాన్ని చూస్తూ తల్లడిల్లిపోయాడు. శత్రువులను దూషించాడు. పరివేష్టించి ఉండాల్సిన ఎక్కటీల చంపలు వాయించాడు. కత్తి ఎత్తి నరకబోయాడు. చేతకాని కాకతీయ సేనానులపై, దళపతులపై, సైనికులపై అరచాడు. గావుకేకలు వేశాడు. గుక్క పట్టి ఏడ్చాడు.

యుద్ధభూమిలో తలో దిక్కున యుద్ధం చేస్తున్న మహామహా కాకతీయ వీరయోధులు పిల్లలమర్రి బేతిరెడ్డి, చెరుకు బొల్లయ, విరియాల సూరన, మల్యాల కాటయనాయుడు, కామిరెడ్డి, విరియాల బేతరాజు, చౌండ.. మహారాజు ధ్వజకేతనం కూలడం చూసి పరుగుపరుగున అక్కడికి వచ్చారు.మహాసేనాని ఒడిలో రక్తసిక్త మహాదేవరాజు నిర్జీవ శరీరాన్ని చూసి దిగ్భ్రమతో కొన్ని లిప్తలు నిలబడిపోయారు. ఆపై ఆయన శరీరంపై పడి ఏడవసాగారు.

అప్పుడు గొణిగాడు దళపతి నాచన, "యువరాజు.. మన గణపతిదేవుడు..?"

చివ్వున చూశాడు తను. "ఏడి.. యువరాజు ఎక్కడ?" కనుచూపులో ఎక్కడా కనిపించలేదు.

"కనపడటం లేదు బహుశా శత్రువులు అపహరించుకు పోయారేమో సేనాని.."

మరుక్షణం ఎక్కటి నాచన తల వొక్కవేటుతో తెగి అవలపడింది. తన కరవాల ప్రహారానికి మరో తల అందకుండా అందరూ నేలపై పడిపోయారు. "క్షమించండి మహాసేనాని.. క్షమించండి.."

ఇప్పుడు అసలు సమస్య మహారాజు మరణించడం కాదు.

ఇప్పుడు కాకతీయ రాజ్యం ఏలిక లేని అనాథ రాజ్యం.

శత్రువులంతా తలో వైపు కమ్ముకుంటారు.

అటూ ఇటూ చూశాడు.

కాకతీయ మహారాజును చంపి యుద్ధంలో విజయం సాధించిన దేవగిరి మహారాజు జైత్రపాలుడు గాని, దేవగిరి సైన్యాధ్యక్షుడు జల్లన, ప్రధానమంత్రి బసవసురుడు.. ఏరి కనిపించరేం? మహాదేవుడి



మత్తి భానుమూర్తి

పార్థివదేహాన్ని వదిలేసి వెళ్లి పోయారేం? మహాదేవుడి శిరస్సును ఖండించి కందుక క్రీడ ఆడటానికి ఎందుకు ఆసక్తి చూపలేదు?

కాకతీయ ఛత్ర కేతనాలను..ఇతర రాజరిక హోదాలను ఎందుకు స్వాధీనపరచుకోలేదు? యువరాజు గణపతి దేవుణ్ని తీసుకుని మాయమయ్యా రంటే వాళ్ల ఆలోచన ఏవిటి?

తనకు తనే ప్రశ్నలు వేసుకుని కాస్త తేరుకున్నాడు. సేనానులకు, దళపతులకు చెప్పాడు, "మహారాజు మహాదేవుల వారు వీరమరణం పొందారు. యువరాజు గణపతిదేవుడు కోటలో ఉన్నారు.. ఇదే అందరికి.. రాజధాని లోని సాధారణ ప్రజలందరికీ ఇదే చెప్పాలి.. రాజ్యమంతటా ఇదే తెలియాలి. అర్థమైందా.. నేనన్నది విన్నారా.. ఏం చెప్పాలి?!.. యువరాజు కోటలో ఉన్నారు!! అని.. సరేనా.."

అందరికి అర్థమయింది. వాళ్లంతా సైనికులు.



రాజు చనిపోయి, యువరాజు శత్రువులకు చిక్కాడంటే సాధారణ ప్రజల్లో కలిగే అలజడి, శత్రురాజుల్లో తొణికే రణోత్సాహం వారు అర్థంచేసుకోగలరు.

"అలాగే మహాసేనాని.." అన్నారు.

కళ్లు తుడుచుకుని లేచి అందరిని మహాదేవరాజు శవం చుట్టూ నిలబెట్టి ప్రమాణం చేయించాడు తను.

"మనం యువరాజు గణపతిదేవుని తోడ్కొని మాత్రమే తిరిగి అనుమకొండ వెళతాం. లేదా.. ఇక్కడే మరణిస్తాం. అప్పటి వరకూ స్కంధావారం విడిచి వెళ్లం. ఇది మహారాజు శ్రీశ్రీశ్రీ మహాదేవులవారి పార్థివ శరీరంపై ఆన.." వంట్లో సలసలమండుతున్న రక్తం నిలువెల్లా పొంగుతుండగా.. అందరూ నిండు హృదయంతో, ముక్తకంఠంతో నినదించారు.

అనంతరం మహాదేవుని శరీరాన్ని భుజాన వేసుకుని స్కంధావారానికి చేరారు.

వార్తాహరుడు వాయువేగంతో వెళ్లి మహాప్రధాని గంగాధరమంత్రికి మహారాజు మరణం, యువరాజు అదృశ్యం వార్తలు వివరించారు.

రుద్రసేనాని తీసుకున్న నిర్ణయం కూడా చెప్పారు.

అ వెనకే మహారాజు పార్థివ శరీరాన్ని అనుమకొండకు రహస్యంగా తరలించి కర్మకాండ నిర్వహించవలసినదిగా గంగాధరమంత్రికి లేఖ రాసి పంపాడు. పట్టమహిషి బయ్యమాంబాదేవి, ఇతర అంతఃపుర రాణీ పరివారానికి తెలియజేయమని.. తమ చేతకానితనాన్ని క్షమించమని కోరుతున్నట్లుగా చెప్పమన్నాడు.

సైన్యమంతా తిరిగి అనుమకొండ రావడం అంటే అది యువరాజు గణపతిదేవునితోనేనని.. లేకుండా స్కంధావారాన్ని దగ్ధం చేసుకుని మరణిస్తామని, ఇది కాకతీయసైన్యమంతా ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయమని విస్పష్టంగా తెలియజేశాడు.

జరిగిన పరిణామాలు గంగాధరమంత్రిని హతాశుడిని చేశాయి. ఆయన కర్మకాండ జరిపించ వలసినదిగా శైవ గురువులకు, సంబంధిత నియోగా

**"మనం యువరాజు గణపతిదేవుని తోడ్కొని మాత్రమే తిరిగి అనుమకొండ వెళతాం. లేదా.. ఇక్కడే మరణిస్తాం. అప్పటి వరకూ స్కంధావారం విడిచి వెళ్లం. ఇది మహారాజు శ్రీశ్రీశ్రీ మహాదేవులవారి పార్థివ శరీరంపై ఆన.." వంట్లో సలసలమండుతున్న రక్తం నిలువెల్లా పొంగుతుండగా.. అందరూ నిండు హృదయంతో, ముక్తకంఠంతో నినదించారు.**

**అనంతరం మహాదేవుని శరీరాన్ని భుజాన వేసుకుని స్కంధావారానికి చేరారు.**

నికి వర్తమానం పంపి హుటాహుటిన స్కంధవారానికి వచ్చి రుద్రసేనానిని కలిశాడు.

కిం కర్తవ్యం??

జరిగిపోయింది సరే.. జరగాల్సింది ఏవిటి?? ఇప్పుడు రాజు లేని.. వారసుడు, పట్టాభిషిక్త యువ రాజు లేని రాజ్యం కాకతీయ రాజ్యం!

తీవ్ర తర్జనభర్జనలు జరిగాక తొలుత వెనువెంటనే జరగాల్సింది, ప్రకటించాల్సింది నిర్ణయించారు.

'యువరాజు గణపతిదేవుడు క్షేమమేనని.. అనుమకొండ కోటలోనే భద్రంగా ఉన్నారని!' లేకుంటే కాకతీయ రాజ్యం కకావికలమౌతుందని.. ప్రజలు గందరగోళమై మరిన్ని కొత్త సమస్యలు రావచ్చని యుద్ధతంత్రజ్ఞులంతా ఏకీభావం వ్యక్తపరచారు.

గంగాధరుడు అంతే వేగంగా అనుమకొండకు వెళ్లి ఆ ప్రకటన చేశాడు.

మహాదేవుడు మరణించాడన్న దుఃఖం.. రేపటి బ్రతుకు బాగుపడడానికి యువరాజు గణపతిదేవుడు ఉన్నాడన్న భరోసా.. ఈ రెండు భావనల మధ్య ప్రజలంతా తల్లడిల్లిపోతూ ఒకరితో ఒకరు చర్చించుకుంటూ తమకు కలిగిన ఈ ఉపద్రవాన్ని ఉపశమింపజేయమంటూ కనబడిన దేవుడికల్లా మ్రొక్కసాగారు.

స్కంధావారంలో కత్తులు సానబెడుతున్న రేచర్ల రుద్రయ స్థితప్రజ్ఞుడైతే అనుమకొండలో బుర్రలు సానబెడుతున్న గంగాధరమంత్రి ఉద్దండుడు. ఓరుగల్లు నగర అధ్యక్షుడు ఇందులూరి పెదమల్లనను, నియోగాధిపతులను, బహత్తర నియోగాధిపతి దమ్మ వీరను.. అందరిని హెచ్చరించాడు. ప్రజల దైనందినంలో ఎలాంటి ఒడుదుడుకులు ఉండరాదని ఆజ్ఞలు జారీ చేశాడు. రాజ్యమంతటా ఎక్కడా నిత్యావసరాల కొరత ఉండకూడదని వర్తక సమయాల శెట్టిలందరికి వర్తమానం పంపాడు. రాజ్యమంతా ప్రశాంతత ఉన్నా ఏదో నిగూఢమైన బాధ వ్యాపించి ఉంది.

బయటి శత్రువుల్లో గణపతి గురించిన సందేహాలు పెరుగుతున్నాయి. సామంతులు అనుమకొండలో జరిగే తంతు జాగ్రత్తగా గమనిస్తున్నారు. ఏ క్షణమైనా స్వాతంత్ర్యం ప్రకటించుకోవడానికి గోతి దగ్గర నక్కల్లా చూస్తున్నారు. ఇవన్నీ రుద్రసేనానికి, గంగాధరునికి తెలియని సంగతులు కావు.

దేవగిరిని దెబ్బ కొట్టి గణపతిని విడిపించి కాకతీయ సింహాసనంపై కూర్చోబెడితే చాలు.. ఈ అధములంతా తోక ముడుస్తారు.

ఇక్కడ మనకు సహకరించే మిత్రులెవరు? దేవగిరి శత్రువులెవరు??

రెండింటికి ఒక్కటే సమాధానం.. ద్వారసముద్రం రాజధానిగా హోయసల రాజ్యాన్ని పాలిస్తున్న బల్లాలదేవుడు.

దేవగిరికి తూర్పున అనుమకొండ ఉంటే నైరుతిగా హోయసల రాజ్యం ఉంది. హోయసల బల్లాలుడు మహాయోధుడు. దేవగిరి సేణువులను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. ఇప్పటికే కొంత భాగాన్ని ఆక్రమించాడు. ఆయనకు రుద్రదేవుడు, ఆయన తండ్రి ప్రోలరాజు (రెండవ) సామంతులుగా విశ్వసనీయులుగా ఉండేవారు.

రుద్రసేనాని యుద్ధ నైపుణ్యం ఆయనకు బాగా తెలుసు. ఎప్పుడూ ప్రశంసిస్తూ ఉంటాడు కూడా.

గంగాధరుని సలహా మీదట రుద్రయ స్వయంగా ద్వారసముద్రం వెళ్లి బల్లాలుని కాళ్లపై పడ్డాడు.

"నువ్వేమీ దిగులు చెందవద్దు రుద్రా.. ఆ జైతుగి అంతు చూద్దాం. నేనున్నాను మీకు అండగా.." అభయమిచ్చాడు బల్లాలుడు. అంతేకాదు అప్పటికప్పుడు మంచి సైన్యాధ్యక్షుడితో పెద్ద సైన్యాన్ని దేవగిరి సరిహద్దుల వద్ద స్కంధావారం ఏర్పాటు చేసుకుని ఉండమని పంపాడు.

ఆయనకు కృతజ్ఞతలు చెప్పి తిరిగి స్కంధావారానికి చేరాడు రేచర్ల రుద్రయ.

సైనికులంతా ఆయన అశ్వ శకటం వెంట

పరుగులు పెట్టారు.. ఏమి శుభవార్త చెబుతాడో విందామని..

కాని ఏమీ చెప్పకుండానే నవ్వుతూ చేయి ఊపి గోల్లెనలోకి వెళ్లిపోయాడు.

అందరూ ఉసూరుమన్నారు. మహాదేవుని మరణం తర్వాత ఆయన కాస్త నవ్వుముఖం పెట్టడం ఇప్పుడే.

“సర్వసైన్యాధ్యక్షులవారు కాస్త నవ్వారంటే.. శుభవార్తే కావచ్చు..”

కాస్త ఊరడింపుగా అందరూ ఒకరినొకరు చూసుకున్నారు. మళ్లీ మామూలే.

లక్షలాది సైన్యం వేరు వేరు గొల్లెనలల్లోనూ ఆరుబయట.. ఈత చాపలు, మంచాలపై, నేలమీద దిగులుగా కూర్చుని మునగదీసుకుని పడుకుని, మాట్లాడలేక, మాటలు రాక, దిక్కులు చూస్తూ, ప్చ్.. అంటూ నిట్టూరుస్తూ.. కళ్లనీరు క్రుక్కుకుంటూ, శూన్యంలోకి చూస్తూ ఓ రుద్రదేవా.. కాకతమ్మా.. ఎంత అవమానం కలిగించారు దేవరా! అనుకుంటు న్నారు.

కొందరు బయట క్రిందపడి.. కొందరు చెట్ల నీడన.. మరికొందరు చేతులు వెనక్కట్టుకుని పచార్లు చేస్తూ.. తమ దళపతుల వంక.. సేనానుల వంక.. సేనాధిపతుల వంక.. మహావీరుల గొల్లెన తెరల వంక.. బయటకు పరుగెత్తే వార్తాహరుల వంకా.. గుర్రాలపై వేగంగా వచ్చి వడివడిగా సైన్యాధ్యక్షుల గోల్లెనలోకి వగరుస్తూ పరుగులు పెట్టె గూఢచారుల వంకచ చూస్తున్నారు.

వాళ్లు ఏదైనా శుభవార్త తెచ్చారేమోనని కళ్లలో ఆశల వత్తులు వేసుకుని.. వేగంగా వెళ్లి మరో సైనికుడితో తన ఆలోచనలను పంచుకుంటూ, దుఃఖాన్ని చెప్పుకుంటూ, ఆశలగోడు వెళ్లబోసు కుంటూ.. సైనికులంతా ఈసురోమని కనిపిస్తున్నారు.

సైనికుల వాలకాలు ఇలా ఉంటే గోల్లెనల్లో యుద్ధతంత్రజ్ఞులంతా.. రకరకాల ఆలోచనల్లో చర్చల్లో మునిగి తిండి తిప్పలు కూడా మరచి.. ఏమి చెయ్యాలో తోచక.. తోచిన ఆలోచన సరైనదో కాదో చెప్పలేక.. నమ్మలేక.. ఆత్మవిశ్వాసం సడలి.. వెర్రిచూపులు చూస్తూ ఎంత పని జరిగింది.. అని నిట్టూరుస్తూ?!!

ఇంతటి దీనావస్థలోనూ.. నిశ్చలమై వెలుగుతున్న ఆశల అఖండదీపం మహాసైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రయ!!

ఆ మహాదీపం వెలుగులో మిణుకు మిణుకుమంటున్న ప్రాణాలతో కత్తులు నూరుకుంటూ యుద్ధానికి సిద్ధమై ఉంది లక్షలాది సైన్యం. ఆయన ఊ అంటే చాలు దేవగిరిని భస్మీపటలం చేయగలరు. ప్రాణాలా.. అవి చీమల్లాంటివి.. ఉంటే ఎంత పోతే ఎంత??

స్కంధావారంలోని లక్షలాది సైనికులు.. కాకతీయరాజ్యంలోని కోట్లాది సాధారణ ప్రజలు తనవైపే ఆశగా చూస్తు న్నారని.. తనకు తిరుగులేని యుద్ధ తంత్రం ఆదేశించమని ఆ రుద్రదేవుడిని ప్రార్థిస్తున్నారని.. ఆయనకు తెలుసు. ఆయన ఎదురు చూస్తోంది కాకతీయరాజ్య మహాప్రధాని గంగాధరమంత్రి నుండి ముహూర్త సమయం!!

వందమంది ప్రధానులు, మంత్రులు, అమాత్యులతో కూడిన మంత్రిమండలే యుద్ధతంత్ర మండలి. దేవగిరిలో జరుగుతున్న ప్రతి తతంగం, ప్రతి ఎత్తుగడ, అక్కడ యువరాజు గణపతికి అందిస్తున్న అన్నపానీయాలు.. గౌరవ మర్యాదల సంగతులు.. మరుక్షణం ఇక్కడ స్కంధావారానికి, అక్కడ అనుమకొండ రాజప్రాసాదానికి చేరిపోతోంది. తదనుగుణంగా ఎత్తులు పైఎత్తులు రచిస్తూ తగిన సమయం కోసం అక్కడా ఇక్కడా లిప్తల కాలాన్ని కూడా వ్యర్థపరచడం లేదు.

ఏక్షణమైనా దేవగిరిని ఓడించి లేదా వంచించి గణపతిదేవుడ్ని తోడ్కొని రావాలి.

అందుకు ప్రతి యోధుని రక్తం సలసలా మరిగిపోతోంది.

సంధ్యాకాలమయ్యింది.. ఈరోజు కూడా వ్యర్థమా.. ప్చ్.. నిస్పృహతో స్కంధావారం ఊగిపోతోంది.

అప్పుడు వచ్చాడు గొల్లెన నుండి బయటకు రుద్ర సేనాని..

(సశేషం)

[redacted] చర్చ



# సుప్రీంకోర్టు తీర్పుతో సీఎంపై శునక ప్రేమికుడి దాడి..!

**మనిషిని మచ్చిక చేసుకునే జంతువులలో ముందుండే శునకం సుమారు 15 వేల సంవత్సరాల క్రితమే మానవాళితో కలిసి జీవించడం అలవాటు చేసుకొని విశ్వాసానికి మారు పేరుగా నిలిచింది. వేలు, లక్షల రూపాయలు ఖర్చు చేసి వీటిని పెంచుకోవడానికి ఇష్టపడే వారి వద్ద ఉండే కుక్కలు ఒక రకం అయితే, వీధిలో ఉండే కుక్కలు మరో రకం. ఇప్పుడు ఈ కుక్కలే దేశంలో ప్రధాన వార్తలయ్యాయి. రాజధాని హస్తినలో పార్లమెంట్ సమావేశాలు వాడివేడీగా జరగడమే కాకుండా, ఉప రాష్ట్రపతి ఎన్నిక, ఓట్ చోరీ వంటి కీలక అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ వీధుల్లో విహరించే శునకాలు ప్రధాన పతాక శీర్షికలయ్యాయి. అదికూడా ఆషామాషీ వ్యవహారంగా కాదు. అత్యున్నతమైన సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం దేశ రాజధానిలోని వీధికుక్కలపై కీలక ఆదేశాలు జారీచేయడం ఒక వైపు సంచలనం కలిగిస్తే, మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై ఒక దుండగుడు భౌతిక దాడిచేయడం కలకలం రేపింది. ఒకదానికొకటి ముడిపడి ఉన్న ఈ రెండు ఘటనలు జాతీయ స్థాయిలో సంచలనమయ్యాయి.**

దేశ రాజధానిలో వీధికుక్కలపై పన్నెండు రోజుల వ్యవధిలో సుప్రీం కోర్టు ఇచ్చిన రెండు ఆదేశాల మధ్య కాలంలో ఆగస్టు 20న ఢిల్లీ సీఎంపై దాడి జరగడం జాతీయ స్థాయిలో సంచలనమయ్యాయి. వీధి కుక్కల అంశం ఒక సామాజిక విషయం అయితే, ముఖ్యమంత్రిపై దాడి ఘటన ఒక రాజకీయ అంశం. సీఎం రేఖాగుప్తా ప్రజాసమస్యలను స్వయంగా తెలుసుకునే నిమిత్తం ఢిల్లీలోని సివిల్స్ లైన్స్ ప్రాంతంలోని తన క్యాంపు కార్యాలయంలో ‘జన సున్వాయ్’ అనే కార్యక్రమాన్ని ప్రతీ వారం నిర్వ హిస్తుంటారు. అందులో భాగంగా ప్రజల నుంచి విన్నపాలను స్వీకరిస్తుంటారు. అదేతీరుగా ఆగస్టు 20న జరిగిన కార్యక్రమంలో సకారియా రాజేశ్‌భాయ్(41) ఆమెపై దాడి చేశాడు. అతడు సీఎంకు కొన్ని పత్రాలను అందించాడు. అనంతరం పెద్దగా కేకలేస్తూ ఆమె చేతిని పట్టుకొని లాగాడు. జుట్టు పట్టుకొని ఆమెను తోసేశాడు.





ఈ ఘటనతో ఒక్కసారి దిగ్భ్రాంతి గురైన భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు చెప్పినదాని ప్రకారం

నిందితుడు సకారియా గుజరాత్ రాష్ట్రం, రాజ్‌కోట్‌లో ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. జంతు ప్రేమికుడు. శునకాలంటే ఇష్టం. వీధికుక్కల తరలింపుపై సుప్రీం కోర్టు తీర్పుతో కలత చెందాడు. ఆక్రోశంతో హుటాహుటిన రైలు టికెట్ కూడా కొనకుండానే రాజ్‌కోట్ నుంచి ఢిల్లీకి చేరుకున్నాడు. ముందుగా సుప్రీం కోర్టుకు వెళ్లాడు. అయితే అక్కడి భద్రతను చూసి బెదిరిపోయాడు. ఆ తర్వాత సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చాడు. సీఎంపైన దాడి చేయడానికి ఒక కత్తిని కూడా తెచ్చుకున్నాడు. పటిష్టమైన భదత్ర కారణంగా కత్తిని లోపలకు తీసుకొనివెళ్లలేకపోయాడు. జైలులో ఉన్న తన బంధువును విడుదల చేయాలని కోరుతూ సీఎంకు వినతిపత్రం ఇచ్చాడు. ఆ తర్వాత హఠాత్తుగా ఆమెపై దాడి చేశాడు. సకారియాకు రాజ్‌కోట్‌కు మరో ఆటో డ్రైవర్ తహసీన్ సయ్యద్ సహకరించినట్టు విచారణలో తేలింది. పోలీసులు అతడినీ అరెస్టు చేశారు.

ముఖ్యమంత్రిపై దాడిని పార్టీలకు అతీతంగా నేతలందరూ ఖండించారు. అయితే ఆప్ ఎమ్మెల్యే అనిల్ ఝా మాత్రం దాడిని ఒక డ్రామాగా పేర్కొన్నారు. “ఢిల్లీ పాలనలో విఫలమైన సీఎం ఈ దాడి నాటకానికి తెరలేపారు, ఆమె గురించి నాకు విద్యార్థి దశ నుంచే తెలుసు” అంటూ అనుచితంగా మాట్లాడారు. గతంలో ఢిల్లీ సీఎంగా ఉన్న కేజ్రీవాల్‌పై దాడులు జరిగినా పట్టించుకోని పోలీసులు ఇప్పుడు వేగంగా స్పందిస్తున్నారంటూ ఆప్ నేతలు వ్యాఖ్యానించడం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనం. భద్రతా చర్యల్లో వైఫల్యానికి బాధ్యులుగా చేస్తూ ఢిల్లీ కమిషనర్‌ను పదవి నుండి తప్పించారు. ముఖ్యమంత్రిపై దాడి ఘటనకు సంబంధించి రాజకీయ దుమారం, కుట్రలు, పోలీసు చర్యలు, కేసుల నమోదు, భద్రత పెంపు, మీడియా హడావుడి ఒక ఎత్తు అయితే, ప్రధాన నిందితుడు సకారియా వీధి కుక్కల మీద ప్రేమతోనే ఈ అవాంఛనీయ ఘటనకు సాహసించాడా? అంటే పలు సందేహాలు రావడం ఖాయం.

జంతు ప్రేమికుడిగా చెబుతున్న సకారియా రాజేశ్‌భాయ్‌కి నేర నేపథ్యం ఉంది. గతంలో అతడిపై పలు కేసులు నమోదయ్యాయి. దాడులు, మద్యానికి సంబంధించి దాదాపు 9 కేసులు ఉన్నాయి. సుప్రీం కోర్టు తీర్పుతో కలత చెందిన నిందితుడు కోర్టు ఆదేశాలను పాటిస్తున్న రేఖా గుప్తాను లక్ష్యంగా చేసుకున్నారు. దాడికి ఒక రోజు ముందు ఆమె ఇంటి వద్ద సంచరిస్తూ రెక్కీ కూడా నిర్వహించాడని పోలీస్ విచారణలో వెల్లడైంది. సకారియా కుక్కలపై కోర్టు తీర్పు, దాన్ని అమలు చేస్తున్న సీఎంపై కక్ష పెంచుకొని రాజ్‌కోట్‌కు 1200 కి.మీ.లకుపైగా దూరం ఉన్న ఢిల్లీకి 20 గంటలు ప్రయాణం చేసి రావడమే పెద్ద సంచలనం. అతడు మతి స్థిమితం లేకుండా ప్రవర్తిస్తుంటాడని తల్లి చెబుతున్నప్పటికీ టికెట్ లేకుండా ప్రయాణించడం, రెక్కీ నిర్వహించడం, బంధువు విడుదల కోసం అంటూ పత్రాలు తీసుకురావడం, భారీ భద్రత మధ్య సీఎంపై దాడి చేయడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. అంతేకాకుండా ఆయనకు సహకరించిన తహసీన్ సయ్యద్ రెండు వేల రూపాయల సహాయం చేయడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసు విచారణలో తొలుత సకారియా తమ ప్రాంతంలో వీధి కుక్కల సమస్యను పరిష్కరించడం లేదని సీఎంపై కోపం పెంచుకున్నట్టు తెలిపాడు. రాజ్‌కోట్‌లో ఉండే కుక్కల గురించి ఢిల్లీ సీఎం ఏమి చేస్తారు?! అతడి తల్లి మాత్రం సుప్రీం కోర్టు తీర్పుతో కలత చెందాడని అన్నారు. ఇంతకీ అతడు కుక్కలను తరలించాలని కోరుకుంటున్నాడా..? లేకపోతే తరలించవద్దని కోరుకుంటున్నాడా...? అంతా గందరగోళమే. సకారియా తలా తోక లేకుండా పూటకో మాట చెబుతుంటే అవే మీడియాలో పతాకశీర్షికలవుతున్నాయి.




ముఖ్యమంత్రిపై దాడి చేసిన సకారియా రాజేశ్ భాయ్ అనుమానాస్పద వ్యవహార శైలిని, అతడికి సహకరించిన ఆటో డ్రైవర్‌ను లోతుగా విచారిస్తేనే వాస్తవాలు బయటకు వస్తాయి. రాజకీయ ప్రయోజనాలతో ఆప్ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కట్టుదిట్టమైన భద్రత ఉండడంతో ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అయితే సుప్రీం కోర్టు తీర్పుకు, సీఎంపై దాడికి మధ్య సంబంధం ఆశ్చర్యాన్ని, అనుమానాన్ని కలిగిస్తుంది. నిజాలు విచారణలో బయటకు వస్తాయి. ప్రస్తుతమైతే భారతదేశం పెద్ద ఉపద్రవం నుంచి బయటపడినట్టే. ఏదేమైనా శునకాల మీద ప్రేమతో ముఖ్యమంత్రిపై దాడి చేయడాన్ని దేశ ప్రజలందరూ ఇదేమీ చోద్యమని ఆశ్చర్యపోతున్నారు.

**– శ్రీపాద**

# మార్క్సిజం-శ్రీరామరాజ్యం

భాగం-2

# సత్పురుషులకు విన్నపం



**మార్క్స వాదం – శ్రీరామరాజ్యం అనేది శ్రీ కరపాత్రీస్వామి రచన. అందులోని ఒక శీర్షిక ఇది. ఈ ప్రజాస్వామ్య యుగంలో... సత్పురుషులైనవారు తమ స్థాయి మేరకు రాజకీయాలలో కల్పించుకోవాలని, జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని సందేశమిస్తోంది. మెరుగైన సమాజాన్ని నిర్మించే నిమిత్తం బ్రహ్మచర్యం మొదలైన నాలుగు ఆశ్రమాలవారూ పాటుపడాలని చెబుతోంది.**

ఉపాసన, జ్ఞానము అనేవి మనస్సుకు చెందిన విషయాలు అని కొందరు చెబుతుంటారు. ప్రపంచ మంతటా గందరగోళం నెలకొన్నప్పటికీ మహాత్ములు, విద్వాంసులు వాటి నుంచి దూరంగా ఉండి, దైవాన్ని సేవిస్తూ ఉండాలని చెబుతుంటారు. మంచిదే!! కానీ శాస్త్రాలు, ధార్మిక కేంద్రాలు నశించిపోతూ ఉంటే విద్వాంసులైన వారికి... భాగవతంలో హిరణ్య కశిపుని సేవించిన ప్రహ్లాదుని గురువు చండామార్కుని వలె ప్రభుత్వ విధానాలే అన్ని అనర్థాలకూ కారణమని తెలిసి కూడా... ధార్మికులై, భజన చేస్తూ ఉండిపోవ డానికి మనసు ఎలా సహకరిస్తుంది?

అసలు ధార్మిక, ఆధ్యాత్మిక భావనలతో నిమగ్నమైన మనసు కూడా శాస్త్రాల వల్ల, సత్పురుషుల కృప వల్లనే రూపుదిద్దుకుంటుంది. ప్రహ్లాదుడు కూడా తండ్రిని ఎదిరించడం ఎందుకులే అనుకుంటే... మనస్సులో భగవన్నామం జపిస్తూ, పైకి మాత్రం తండ్రి చెప్పినట్లే నడుచుకుంటే... నేటికాలంలో కనీసం రామనామం చెప్పేవారు ఎవరు ఉండేవారు?

ప్రహ్లాదుడు సత్యశీలతతో, తన జీవితం ఎన్నో కష్టనష్టాలవై పాలైనా సిద్ధాంత రక్షణ చేశాడు. అందువల్లనే లోకంలో ధర్మం స్థిరపడింది. ఈ విధంగా విద్వాంసులు, మహాత్ములు ఆనాటి రాజతంత్రంలో, పాలనలో కలగ చేసుకునేవారు. రాజనీతిని శాసించేవారు.

అయితే ఇప్పుడు ప్రజాస్వామ్యం ఏర్పడింది. ఈ సిద్ధాంతంలో పాలనకు సంబంధించి సర్వోచ్ఛ సత్త ప్రజల చేతుల్లోనే ఉంటుంది. ప్రజలే నిజమైన పాలకులయ్యారు. అందువల్ల రాజనీతి యందు దక్షత సంపాదించుకోవడం ప్రతి ఒక్క పౌరుడి పరమ కర్తవ్యం అయింది. ప్రజాధనాన్ని, ధర్మాన్ని రక్షించడం... తరువాతి తరాలకు అందించడం ప్రజల కర్తవ్యాలే. ఉదారత, గంభీరత, దక్షతలతో పాటుగా దేశం–ధర్మాలకు హితాహితాలను గమనించి ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాలను నిర్దేశించుకుని పాలించుకోవాల్సి ఉంది.

ఎక్కడ రాజతంత్రం సరిగా పనిచేయలేదో... అక్కడ నియంతల పాలన రాజ్యమేలుతుంది. అటువంటి చోట్ల విశేష దక్షత కలిగిన రాజనీతిజ్ఞులు, విద్వాంసులు, మహాత్ముల వల్ల తప్ప వేరొక విధంగా ఏ పనీ నెరవేరదు. ప్రజలను సమీకరించడం, వారికి ప్రోత్సాహమివ్వడం, అభ్యుదయం కోసం వారిని సిద్ధం చేయడం అనే పనులన్నీ రాజనీతిజ్ఞుని చేతియందే ఉంటాయి. తగిన సమయంలో ధర్మాన్నీ, ధర్మ శాస్త్రాలనీ రక్షించడం కోసం విద్వాంసుల వద్దకే వెళ్లాలి.

ఈ అభిప్రాయంతోనే సూతుడు, "విద్వాంసులు, వైదిక ధర్మాన్ని స్థాపించడం కోసం శుద్ధమార్గంలో ప్రయత్నాలు చేయాలి. వైదికధర్మం స్థిరమైతే అంతటా స్థిరత్వమే నెలకొంటుంది" అని చెప్పాడు.

"సమర్థులై ఉండి కూడా ఎవరైతే తమదైన పంథాలో ధర్మరక్షణకు ప్రయత్నం చేయరో... వారు పాపాలలో భాగం పంచుకోవాల్సి వస్తుంది. మాతాపితరులు, గురుజనులు లేదా జనసమూహాల ధనం–ధర్మం–ప్రాణాలకు నష్టం ఏర్పడుతుంటే... సమర్థుడైన పురుషుడు కులాసాగా కూర్చుని తమాషా చూసినట్లయితే ఏదో ఒక ప్రయత్నం చేయకపోతే... అది ప్రత్యక్షపాపం కూడా అవుతుంది. ఎవరైతే సమర్థులు కాకపోయినా యథాశక్తి, ధర్మశాస్త్ర మర్యాదలను రక్షించడం కోసం ప్రయత్నిస్తుంటారో... వారు ఆ పుణ్యబలం చేతనే అన్ని పాపాలనుంచి విడుదలవుతారు. సమ్యక్ జ్ఞానాన్ని పొందగలుగు తారు" అని సూత సంహిత చెబుతోంది.

అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం... వీటన్నింటినీ కలిపి యమం అంటారు. ఇవి నివృత్తి మార్గంలో (సన్యాసి) నడిచేవారికి అతి ముఖ్యమైనవి. శౌచము, సంతోషము, స్వాధ్యాయము మొదలైన వాటిలో ఏమాత్రం గడబిడ కలిగినా క్షమించవచ్చు. కానీ యమమును నిర్వహించడంలో పూర్ణ తత్పరత ఉండి తీరాలి. అందువల్లనే రామాయణంలో 'యమాన్ సేవేత్ సతతం నియమాన్ మత్పరః క్వాచిత్'... యమమును సర్వదా సేవించాలి అని చెప్పారు. నియమంలో కొనసాగింపు లేకపోయినా కూడా మనం పనులను నెరవేర్చుకోవచ్చు. అహింస మొదలుగా గల యమాన్ని చెప్పడానికి కారణం... మనసా వాచా కర్మణా ప్రాణి రక్షణ చేయడం, ప్రాణులను పీడించకుండా ఉండడం అనేవి ముఖ్యమని చెప్పడానికే.

ఇది రాజనీతికి కూడా వర్తిస్తుంది. లోకరక్షణ, ప్రాణిరక్షణ, ధర్మరక్షణ రాజకీయాలలో ఉండేవారి ముఖ్య లక్షణాలు కావాలి. వీటివల్లనే నష్టాలు ఏర్పడకుండా నివారించవచ్చు. ఈ కారణం వల్లనే మహాత్ములైన వారు ఇటువంటి కార్యాలలో కలగ చేసుకుంటూ ఉంటారు. అరణ్యవాసులైన ఋషులు, చాణక్యుడి వంటి బాలబ్రహ్మచారి, సమర్థ రామదాస స్వామి వంటి నివృత్తి నిష్ఠులైన వారు కూడా ఇటువంటి కార్యకలాపాలలో సంలగ్నులై అవుతుంటారు. తమ పనిలో సఫలత కలిగినా, కలగకపోయినా... సముచితమైన ప్రయత్నం ఎప్పుడూ నిష్ఫలం కాదు అని విశ్వసిస్తారు. ఎవరికైనా అదృష్ట ఫలాలు తప్పకుండా సంక్రమిస్తాయి.

వర్తమాన సమాజంలో ప్రజల ధనానికి – ధర్మానికి సంకట పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విశిష్ట విద్వాంసులు, మహాత్ములతో పాటు సత్ గృహస్థులు కూడా ఏ మాత్రమూ భయపడకుండా రాజనీతిలో కలగ చేసుకోవాలి. ధర్మరక్షణ కోసం ఏది అవశ్యకమో అది చేయాలి. దీని పరిణామం నిశ్చయంగా శుభమంగళములు కలుగుగాక! అన్ని దిశలయందు మంగళము కలుగుగాక!

**(వచ్చేవారం : ఎవరు రాజకీయాలలో పాల్గొనాలి?)**

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**

**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

# అత్త మీద కోపం దుత్త మీద చూపిస్తున్నారు!

రష్యా నుంచి భారత్ చేస్తున్న చమురు కొనుగోళ్లను ఆపి వేయాలని భారత్‌ను బెదిరించడంతోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మతి తప్పిందని అంతా నిర్ధారించుకున్నారు. తరువాత ఉన్మాద స్థితికి వెళ్లాడాయన. ఫలితమే భారత్‌ను 'డెత్ ఎకానమీ' (మృతప్రాయ ఆర్థిక వ్యవస్థ) అంటూ ప్రకటించి ప్రపంచ మానవాళిని ఆశ్చర్యంలో ముంచేశారు. తన ఈర్ష్య, అసూయ, అక్కసును కూడా వెళ్లగక్కారు. దశాబ్దం క్రితం ప్రపంచ దేశాల అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల జాబితాలో 10వ స్థానం ఉన్న భారత్, నేడు 5వ స్థానానికి ఎదగడంతో పాటు రానున్న రోజుల్లో సగర్వంగా 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానానికి చేరడం ఖాయమని మన దేశ ఆర్థిక ప్రగతి పరుగుల అంచనాలు రుజువు చేస్తున్నాయి. భారత ఆర్థిక ప్రగతి 6.5 శాతానికి పైగా నమోదు కావడంతో ఐఎంఎఫ్ అంచనాలను (3 శాతం మాత్రమే) సహితం తలక్రిందులు చేసినట్లు అయింది. భారత ఆర్థిక వ్యవస్థ అద్భుత అంచనాలను చేరిందంటూ ఆర్‌బీఐ కూడా కితాబు ఇవ్వడం గమనార్హం. ఆర్థిక ప్రగతిలో యూఎస్‌ను సహితం తలదన్నే విధంగా భారత్ ముందుకు దూసుకుపోతున్నది. ప్రపంచ దేశాలు ఏం తినాలి, ఏం తాగాలి, ఎప్పుడు నిద్ర పోవాలి అంటూ హిట్లర్ మానసిక స్థితితో ట్రంప్ తన స్థాయిని మరిచి వాగడం వల్ల అమెరికా ప్రతిష్ట మసకబారడం కొనసాగుతున్నది. రష్యా నుంచి కొనుగోళ్లకు నిరసనగా విధించిన సుంకాలు మొత్తానికే ముప్పు తెచ్చే రీతిలో ఉన్నాయి.



పెహల్గామ్ దుర్ఘటన తర్వాత భారత్ చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" సైనిక చర్య ద్వారా పాకిస్థాన్‌ను మూడు రోజుల్లోనే మట్టి కరిపించి కాళ్ల బేరానికి వచ్చే దుస్థితికి తీసుకురావడాన్ని ట్రంప్ జీర్ణించుకోలేక పోతున్నట్లు అర్థం అవుతున్నది. ప్రపంచానికి భారత సైనిక సత్తా ఏమిటో అవగతమయింది. అమెరికా, చైనా, రష్యాల సరసన భారత్ నిలవడం ట్రంప్ తిక్కను పెంచుతున్నది. ఆధునిక సాంకేతిక యుద్ధ క్షేత్రంలో భారత సైన్యం తన ప్రతిభను ప్రపంచానికి చాటింది. పాకిస్తాన్‌కు చెందిన వందల కి.మీ దూరంలో యుద్ధ విమానాలను అతి సులభంగా, అత్యంత కచ్చితత్వంతో కూల్చివేయడం చూసిన అమెరికన్ ట్రంప్‌కు మతిపోయినట్లయింది. భారత్ అన్ని రంగాల్లో అంచనాలను మించి దూసుకుపోతోంది. భారతదేశ వ్యాప్తంగా మౌలిక వనరుల కల్పన ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెడుతున్నారు. మేకిన్ ఇండియా మాధ్యమంగా వికసిత్ భారత్ -2047 లక్ష్యాలను అధిగమించడానికి వడివడిగా అడుగులు వేస్తున్నది. గత దశాబ్ద కాలంలో ఐదు నగరాల్లో ఉన్న మెట్రో రవాణా సౌకర్యాలను 24 నగరాలకు విస్తరించారు. ఐఐటీ, ఏయిమ్స్, ఐఐఎం లాంటి ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ ఇంపార్టెన్స్ సంస్థలను మూడు రెట్లు పెంచారు. డిజిటల్ లావాదేవీల్లో భారత ప్రజలదే అగ్రస్థానం. విమానాశ్రయాలను 74 నుంచి 160కి పెంచడం వాస్తవం. రైల్వే లైన్ల విద్యుదీకరణను గత పదేళ్లలో రెట్టింపు పూర్తి చేయడం ఓ అద్భుత ప్రగతిగా గుర్తించాలి. 2014లో దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు 91,287 కిమీ ఉండగా, 2024 వరకు 1,46,195 కిమీల వరకు పెంచారు. 'సంస్కరణలు, పని తీరు, మార్పు' అనే మూడు సూత్రాలే చోదక శక్తిగా భారత ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకుంది.

'ముందే కోతి, ఆపైన నిప్పులు కొక్కింది' అన్న చందంగా ట్రంప్ తీసుకునే ప్రతి చర్య, పలికే ప్రతి మాట పిచ్చోడి చేతిలో రాయి వలె మారినట్లు కనిపిస్తున్నది. సగటు అమెరికన్లు ట్రంప్ వైఖరికి సిగ్గు పడుతున్నారు. భారత దిగుమతులపై 50 శాతం వరకు సుంకాలను పెంచడానికి కారణంగా రష్యా నుంచి భారత్ చవకగా చమురు కొనుగోలు చేయడమే అని ట్రంప్ హద్దులు మీరి అరుస్తున్నారు. అన్ని దేశాలకు తానే సూపర్ బాస్ అనుకుంటూ అరుస్తున్నారు, అభాసుపాలవుతున్నారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలోనే ట్రంప్ నోటికి పని చెబుతున్నారు.



డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒక చచ్చుబడిన ఆర్థిక వ్యవస్థ అనో, మృత ఆర్థిక వ్యవస్థ అనో వ్యాఖ్యానించడానికి ఎంతో అజ్ఞానం, అవివేకం అవసరమవుతాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి అవి పుష్కలంగా ఉన్నాయనడంలో సందేహం లేదు. దేశ పాలనకు నాలుగు స్తంభాలైన రాజకీయ, ఆర్థిక, సామాజిక, చారిత్రక అంశాల్లో కనీసం ఒక్కదానిలో కూడా రాహుల్ గాంధీకి లేశమాత్రంగా నైనా అవగాహన లేదనడానికి ఇది మరో ఉదాహరణ. కాంగ్రెస్ పార్టీ హయాంలో భారతదేశం ఇతర దేశాల నుంచి,

ప్రపంచ దేశాలన్నీ ఆర్థిక మాంద్యంతో, ఆర్థిక సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న స్థితిలో కూడా భారతదేశం ఆర్థికంగా ప్రగతి సాధిస్తూనే ఉంది. అంతర్జాతీయంగా ఒక ఆర్థిక శక్తిగా ఉన్న భారత దేశం మీద, భారతదేశ ఆర్థిక సహాయ సహకారాల మీద అనేక దేశాలు ఇదివరకే కాదు, ఇప్పటికీ కూడా ఆధారపడి ఉన్నాయి. భారతదేశ ఆర్థిక విశ్వసనీయత రేటింగ్ పెరిగిందనీ, తాము ఎంతటి రుణ సహాయానికైనా సిద్ధమనీ అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, ఫ్రాన్స్ ఆర్థిక సహాయ సంస్థ తదితర అంతర్జాతీయ ఆర్థిక సహాయ సంస్థలు కోవిడ్ కాలంలోనే కాక, కోవిడ్ అనంతర కాలంలో కూడా పదే పదే సూచించినప్పటికీ భారత ప్రభుత్వం

# ఆర్థిక వ్యవస్థ మీద రాహుల్ అసత్యాలు



**అంతర్జాతీయ ఆర్థిక సహాయ సంస్థల నుంచి సహాయం పొందవలసిన స్థితిలో ఉండేది. ఇప్పుడు ఇతర దేశాలతో ఉన్న రుణభారాన్ని దాదాపు 65 శాతం తగ్గించుకోవడంతో పాటు ఇతర దేశాలకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించగల స్థితిలో ఉంది. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వడి వడిగా ఎదుగుతున్న భారతదేశం పట్ల అగ్రరాజ్యం అమెరికా అసూయా ద్వేషాలు వెళ్లగక్కడంలో అర్థముంది. కానీ, స్వదేశం సాగిస్తున్న పురోగతిని చూసి కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీ అసూయా ద్వేషాలు వెళ్లగక్కడం ఆశ్చర్యం కలిగిస్తోంది.**

ఆ సహాయాన్ని ఉపయోగించుకోలేదంటే దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత పటిష్ఠంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జీడీపీ వృద్ధి, స్థిరంగా ఉన్న స్థూల ఆర్థిక వ్యవహారాలు, ఆర్థిక సంస్కరణలు వగైరాలన్నీ కలిపి భారతదేశ ఆర్థిక వ్యవస్థను అన్ని విధాలా పరిపుష్టం చేశాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు సుస్థిరంగా, పటిష్ఠంగా ఉందనడానికి అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంక్ తదితర అంతర్జాతీయ సంస్థల వార్షిక నివేదికలే సాక్షీభూతాలు.

**అజ్ఞానానికి పరాకాష్ఠ**

ఒక జాతీయ పార్టీకి నాయకుడై ఉండి, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడై ఉండి రాహుల్ గాంధీ కనీస మాత్రంగా ఈ నివేదికలను అధ్యయనం చేయకపోవడం, దేశ ఆర్థిక వ్యవస్థ పట్ల అవగాహన లేకుండా వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు చేయడం హాస్యాస్పదంగా ఉంది. ఆయన వ్యాఖ్యలకు పూర్తిగా విరుద్ధమైన పరిస్థితి దేశం ఇప్పుడు ఆర్థికంగా దూసుకుపోతోంది. ప్రపంచంలో ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న దేశాలన్నిటికంటే భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) ఎక్కువ. గత ఏడాది భారతదేశ వాస్తవిక జీడీపీ 8.2 శాతానికి చేరుకుంది. అమెరికా 2.5 శాతం, చైనా 5.2 శాతం, జపాన్ 1.9 శాతం, జర్మనీ 0.3 శాతంతో భారతదేశం కంటే బాగా వెనుకబడి ఉన్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కూడా భారతదేశ జీడీపీ 6.5 నుంచి 7 శాతానికి చేరుకుందని తన తాజా నివేదికలో ప్రకటించింది. భారత్‌లో గ్రామీణాభివృద్ధి, ప్రాథమిక సదుపాయాల కల్పన మీద బడ్జెట్ కేటాయింపులు పెరుగుతున్న కారణంగా అతి వేగంగా ఆర్థిక పురోగతిని సాధి స్తోందని కూడా అది తెలిపింది. భారతదేశం ఇప్పుడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, 2026 నాటికి దాని జీడీపీ 6.8 శాతానికి చేరుకుంటుందని అది తెలియజేసింది.

మరో రెండేళ్లలో, అంటే 2027 నాటికి భారతదేశం ఆర్థిక పురోగతిలో జర్మనీని మించిపోయి, 5.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా పరిణామం చెందాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. అంతేకాక, 2030 నాటికి ఇది 7.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేది కూడా ప్రభుత్వ దృఢ సంకల్పం. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి తెలియని, అర్థం కాని, అవగాహన లేని విషయమేమిటంటే భారతదేశం ఇప్పటికే ప్రపంచంలో ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి చేరుకుంది. దేశీయ ఉత్పత్తులను పెంచుతూ, ఆర్థిక సంస్కరణలను కొనసాగిస్తూ, పెరుగుతున్న తమ యువ జనాభా సహాయంతో ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే అయిదేళ్లలో అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధిలో భారత దేశ వాటా 12.9 శాతానికి పెరగాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది. ఇందులో ప్రస్తుతం అమెరికా వాటా 11.3 శాతం ఉంటోందని అంతర్జాతీయ స్థాయి ఆర్థిక సంస్థలు తెలిపాయి. ప్రపంచాన్ని ఎటువంటి ఆర్థిక సంక్షోభాలు ముంచెత్తుతున్నా, భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతున్నా, ప్రకృతి వైపరీత్యాలు విజృంభిస్తున్నా, వాణిజ్య ఒప్పందాలు అతలాకుతలం అవుతున్నా భారతదేశ ఆర్థిక వ్యవస్థ చెక్కుచెదరకుండా పురోగతి సాధించడంతో పాటు, 2027–30 సంవత్సరాల మధ్య అగ్ర రాజ్యాలను అన్ని విధాలా మించిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

నిజానికి, విజయాలు, సాఫల్యాల విషయానికి వచ్చేసరికి భారతదేశం ప్రచారార్భాటాలకు దూరంగా ఉండడం మొదటి నుంచి జరుగుతున్న విషయమే. భారతదేశం వంటి బహుళ జాతులు, బహుళ సంస్కృతులు, బహుళ మతాల దేశంలో పది పన్నెండేళ్ల కాలంలో ఇంతగా ఎదగడమనేది ఆషామాషీ విషయం కాదు. విచిత్రమేమిటంటే, భారతదేశం తాను మాత్రమే ఎదగడం కాదు. పొరుగున ఉన్న అనేక దేశాలను కూడా ఎదిగేలా చేస్తోంది. భూటాన్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్, సూడాన్, అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాలు భారత్ తోడ్పాటుతో ఆర్థికంగా ఎదుగుతున్న విషయాన్ని ప్రపంచ ఆర్థిక సహాయ సంస్థలన్నీ గుర్తించడంతో పాటు తమ వార్షిక నివేదికల్లో కూడా ప్రస్తావిస్తున్నాయి. నిజానికి, పౌరులంతా గర్వపడే స్థితిలో భారత్ ఉంది. ఇతర దేశాలలోని భారతీయులు తలెత్తుకు తిరిగేలా అన్ని రంగాల్లోనూ వేగంగా పురోగతి సాధిస్తోంది. కృతనిశ్చయంతో, దృఢ సంకల్పంతో పైపైకి దూసుకుపోతోంది. భారతదేశాన్ని మృత ఆర్థిక వ్యవస్థగా అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనేక ప్రతికూలతల మధ్య భారత్ ఎదుగుతున్న విషయాన్ని అర్థం చేసుకోలేకపోయారు. దేశంలోనే ఉంటూ



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్

అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాలుగు ఓట్ల కోసం స్వదేశం మీద విమర్శలు, వ్యాఖ్యానాలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం.

**సవాలక్ష ఆధారాలు**

భారతదేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా మారడానికి, అన్ని రంగాల్లోనూ పురోగతి సాధిస్తుండడానికి ప్రధాన కారణం దేశంలోని ఉత్పత్తి రంగం క్రియాశీలంగా, సచేతనంగా మారడమే. ఈ ఏడాది జూలై నాటికి దేశంలోని ఉత్పత్తి రంగం 59.2 పాయింట్లకు చేరుకుంది. గత 17 ఏళ్ల కాలంలో భారతదేశం ఈ స్థాయికి చేరుకోవడం ఇదే మొదటిసారి. ఉత్పత్తి రంగం ఎదుగుదలకు కావలసిన డిమాండ్, సరఫరా వ్యవస్థలు బాగా ఊపందుకున్నాయి. ఉత్పత్తి రంగంలో భారతదేశం అగ్రస్థానానికి చేరుకుంటోందనే విషయం కాదనలేని వాస్తవమని ఎస్ అండ్ పి గ్లోబల్ ఇండియా మ్యాన్యుఫాక్చరింగ్ పర్చేసింగ్ మేనేజర్స్ ఇండెక్స్ తెలియజేసింది. ఫార్మస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్ రంగాల్లో భారతదేశం కొత్త పుంతలు తొక్కుతోందని కూడా అది తెలిపింది. ప్రస్తుతం జీడీపీలో ఉత్పత్తి రంగం వాటా 13 శాతం ఉంది. మేకిన్ ఇండియా విధానం కారణంగా ఇది త్వరలో 25 శాతానికి పెరిగే అవకాశం ఉందని కూడా అది తెలిపింది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యలు బాగా తగ్గుముఖం పట్టాయని, ద్రవ్యోల్బణం 3.4 శాతానికి చేరుకోగా, నిరుద్యోగ సమస్య 14 శాతం నుంచి 8 శాతానికి పడిపోయిందని కూడా ఇది తెలిపింది.

కాగా, 2024 డిసెంబర్ నాటి వరకూ విదేశీ పెట్టుబడుల మొత్తం 1.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని, ఇది ఈ ఏడాది మరో 71 బిలియన్ డాలర్లు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక రంగ నిపుణులు తెలియజేస్తున్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకట్టుకునే విషయంలో కూడా భారతదేశం ప్రస్తుతం 15వ స్థానంలో ఉంది. వ్యవసాయ రంగ భవిష్యత్తు పూర్తిగా మారి పోతోందని, పారిశ్రామికాభివృద్ధి అమెరికాను మించిపోతోందని, దేశవ్యాప్తంగా 200కు పైగా నగరాలు అంచనాలకు మించి అభివృద్ధి చెందాయని, సుమారు 900 పట్టణాలు నగరాల స్థాయికి ఎదుగుతున్నాయని, విద్యుదుత్పత్తి రంగం కూడా కొత్త పుంతలు తొక్కు తోందని దేశ ఆర్థికాభివృద్ధి సూచికలు తెలియజేస్తు న్నాయి. రవాణా రంగం, రైల్వేలు, విమానాశ్రయాలు వంటివి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్నాయి. రక్షణ రంగం స్వావలంబన సాధించుకుంది. టెక్నాలజీ రంగం, అంతరిక్ష పరిశోధన రంగం అమెరికా, రష్యా, చైనా, దక్షిణ కొరియా, జర్మనీ వంటి అగ్ర రాజ్యాలతో పోటీ పడుతున్నాయి. నైపుణ్యాల అభివృద్ధిలో 2013 వరకూ బాగా వెనుకబడి ఉన్న భారతదేశం 2023 నాటికి అభిలషణీయ స్థాయికి చేరుకుంది. దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ అనేక సంస్కరణల కారణంగా లాభాల బాట పట్టడంతో పాటు, నిరర్థక ఆస్తుల నుంచి దాదాపు పూర్తిగా కోలుకోవడం జరిగింది.

ఇక 2027 నాటికి భారతదేశం 5.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమనేది ఒక లక్ష్యమే కాక, ఒక అగత్యంగా కూడా కనిపిస్తోంది. ప్రపంచ దేశాల్లో తానే ఒక అగ్రరాజ్యంగా ఎదగాలని భారత ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా ప్రభుత్వం అనేక సంస్కరణలను చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ దేశానికి పెను సవాళ్లు కాబోతున్నాయి. అయితే, రాజకీయ సుస్థిరతతో పాటు, సుస్థిర పాలనకు కూడా అవకాశం ఉన్న ప్రస్తుత సమయంలో ప్రభుత్వం ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకు పోతోంది. భారతదేశ ప్రగతిని బద్ధశత్రువైన చైనాతోసహా సుమారు 122 దేశాలు అబ్బురంగా చూస్తూ, ప్రశంసల వర్షం కురిపిస్తున్న సమయంలో దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేయడం, విచిత్ర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. భారతదేశ ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తోందనో, చచ్చుబడిందనో లేక డెడ్ ఎకానమీ అనో వ్యాఖ్యలు చేయడం మానసిక దౌర్బల్యానికి, దివాలాకోరుతనానికి నిదర్శనం. ★

## జావెద్ అఖ్తర్‌ను రానివ్వని బెంగాల్ ముస్లింలు



దేశంలో ముస్లిం ఓటు బ్యాంక్‌కు మార్గదర్శకులు ఎవరు? బుజ్జగింపు రాజకీయాలు చేసే కాంగ్రెస్, టీఎంసీ వంటి పార్టీలు నెత్తిన పెట్టుకుని పూజించే మైనారిటీ నేతలు ఎవరు? వాళ్లు ఉదారవాద ముస్లింలయితే కాదు. ముస్లిం మత ఛాందసవాదులే. పశ్చిమ బెంగాల్ ఉర్దూ అకాడెమీ చేసిన నిర్వాకం దీనినే చెబుతోంది. హిందీ సినిమాల మీద ఉర్దూ ప్రభావం అనే అంశం మీద ఆ అకాడెమీ ఆగస్ట్ 31 నుంచి, సెప్టెంబర్ 2 వరకు ప్రముఖ సినీ గేయ రచయిత జావెద్ అఖ్తర్‌తో నిర్వహించ తలపెట్టిన నాలుగు రోజుల కార్యక్రమాన్ని హఠాత్తుగా రద్దు చేసింది. కొన్ని అనివార్య కారణాలతో రద్దు (కొన్నిచోట్ల వాయిదా అని రాశారు) చేసినట్టు అకాడెమి సభ్య కార్యదర్శి నజహత్ జైనబ్ ఒక ప్రకటనలో చెప్పారు. దీని మీద పశ్చిమ బెంగాల్ పౌర హక్కుల సంఘాలు భగ్గుమన్నాయి. మమతా బెనర్జీ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం ఛాందసవర్గాల ముందు మోకరిల్లిందని అవి దుయ్యబడు తున్నాయి. తాను ముస్లింల దృష్టిలో కాఫిర్‌ని, హిందువుల దృష్టిలో ముస్లిం మతోన్మాదిని అయ్యానని జావెద్ వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సెక్యులరిజం రక్షణకు సంబంధించి రాజ్యాంగం ప్రవచించిన రక్షణ చర్యలను తీసుకోవడంలో విఫలమైందని అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రైట్స్ అనే సంస్థ ఆరోపించింది. ఇది కోల్‌కతా కేంద్రంగా దశాబ్దాలుగా పని చేస్తున్నది. ఈ నిర్ణయం అత్యున్నత స్థాయిలో జరిగినదేనని కూడా చెప్పింది. వచ్చే సంవత్సరం జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసమే, రాష్ట్రంలో అశాంతి రేగకుండా ఉండేందుకే జావెద్ కార్యక్రమాన్ని రద్దు చేసి ఉంటారని మళ్లీ సన్నాయి నొక్కులు నొక్కింది ఈ సంస్థ. జావెద్ ఇస్లాంనే కాదు, అన్ని మతాలను అవమానించాడు అంటోంది జమాత్ ఉలేమా ఎ హింద్. ఆయన నాస్తికుడైతే మాకేం అభ్యంతరం లేదు. కానీ అతడు ఇస్లాంను అవమానించాడు కాబట్టి ఈ కార్యక్రమం పట్ల సంస్థ నిరసన వ్యక్తం చేసిందని వివరించింది. దీని కార్యదర్శి జిల్లూర్ రహమాన్ ఆరిఫ్ బెంగాలీలందరికి గుండె ఆగిపోయే మాట చెప్పాడు. రాష్ట్రంలో మత సామరస్యం పొల్లి పోరలు తోందట. ఇప్పుడు జావెద్ రాష్ట్రానికి వచ్చి ఏదో ఒక మతాన్ని విమర్శిస్తే ఈ సామరస్యం అంతా ఏమై పోవాలి, అదే మా అభ్యంతరం అన్నాడు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నదీముల్ హక్ అయితే తన పార్టీ ప్రభుత్వ నిర్ణయం గురించి ఒక్క మాట చెప్పడానికి కూడా ఒప్పుకోలేదు.

ఇలాంటి బుజ్జగింపు తృణమూల్‌కే పరిమితం అనుకోవద్దు. ఇంతకు ముందు రాష్ట్రాన్ని ఏలిన సీపీఎం కూడా ఇదే చేసిందని బాంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ వ్యాఖ్యానించారు. ఇందుకు కారణం ఏమనుకున్నారు? ముస్లిం మత ఛాందసవాదులే అని నిక్కచ్చిగా చెప్పారామె. ఇప్పుడు ఉర్దూ అకాడెమీ ఆహ్వానించినప్పటికీ జావెద్‌ను రాష్ట్రానికి రాకుండా చేసింది కూడా ముస్లిం మత ఛాందసవాలే అన్నారామె. పత్రికలు, ప్రభుత్వం చెప్పడానికి మొహమాట పడిన ఒక మాటను తస్లీమా బయటపెట్టారు. జావెద్ ఇస్లాంను అవమానించాడు. అతడిని మేం రాష్ట్రంలోకి రానివ్వం. ఒకవేళ వస్తే ఆయనను తరిమేస్తాం. తస్లీమాను ఎలా బయటకి తరిమి కొట్టామో అలాగే జావెద్‌ను కూడా అని ఛాందసవాదులు ప్రకటించారని బాంగ్లా రచయిత్రి తెలియచేశారు. ఒక్క ఉర్దూ అకాడెమీ ఏమిటి; రాష్ట్ర ప్రభుత్వం కూడా ముస్లిం ఛాందసవాద శక్తుల ముందు నిస్సహాయంగా ఉండిపోయిందని తస్లీమా ఎద్దేవా చేశారు. ★



# కామారెడ్డి వరద బాధితులకు సేవాభారతి అండ

**కామారెడ్డి:** కుండపోతతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాలో సేవాభారతి కార్యకర్తలు, స్వయంసేవకులు వెంటనే రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్ ద్వారా వరదల్లో చిక్కుకున్న 8 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలకు సహకరించి వరదల్లో చిక్కుకున్న 1071 మందిని కాపాడారు. కామారెడ్డి జిల్లా చరిత్రలో కనీవినీ ఎరుగని కుండపోతతో చెరువుల కట్టలు తెగాయి. వంతెనలు కూలాయి, కల్వర్టులు కొట్టుకుపోయాయి. ఊళ్లకు ఊళ్లే జలదిగ్బంధమయ్యాయి. రహదారులు ధ్వంసమై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి, పలు ప్రాంతాల్లో గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోయి అంధకారం అలముకుంది. ఎప్పుడూ లేని విధంగా రెండు రోజుల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రంతో పాటు ఏ గ్రామాన్ని, తండాను కదిలించినా వరద కన్నీటి గాథలే. జిల్లాలోని రాజంపేట మండలం ఆర్గొండ గ్రామంలో ఆగస్ట్ 27న కేవలం 6 గంటల్లోనే 41.5 సె.మీ.లు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువు ఉధృతంగా ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

మొదటి రోజు కామారెడ్డి పట్టణ కేంద్రం నుంచి మొదలుకుని భిక్కనూరు వరకు 44వ జాతీయ రహదారిపై వరదలు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. భిక్కనూరు మండలంలోని జంగంపల్లి, బస్వాపూర్ వద్ద జాతీయ రహదారిపై వరదలో చిక్కుకున్న పలువురు వాహనదారులకు సేవాభారతి కార్యకర్తలు మొదటి రోజు 700 మందికి భోజనం అందించారు.

మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లిలో ముంపునకు గురై పాఠశాలలో ఉంటున్న వారికి సేవాభారతి ఆధ్వర్యంలో అత్యవసర మందులు, భోజనాలు ఏర్పాటు చేశారు.

రాజంపేట మండలం నడిమి, లేత మామిడి తండాలలో వరదవల్ల చాలామంది నిరాశ్రయులయ్యారు. వీరికి మూడు రోజులు భోజనం అందించారు. నిత్యావసర వస్తువులైన బియ్యం, పప్పు దినుసులు, వంటపాత్రలు, ధరించేబట్టలు, కప్పుకోడానికి రగ్గులు మొదలైనవి యుద్ధ ప్రాతిపదికమీద అందించారు.

కామారెడ్డి లోతట్టు ప్రాంతాలలో వరదలలో చిక్కుకున్న సుమారు రెండు వేలమంది ప్రజలకు 2రోజులపాటు భోజన ప్యాకెట్స్‌ను వితరణ చేశారు. అలాగే బస్టాండ్‌తో సహా జాతీయ రహదారిపై, బస్టాండ్‌లో నిలిచిపోయిన 1000 మంది మంది ప్రయాణీకులకు సమాజ సహకారంతో స్వయం సేవకులు ఆహారం అందించారు. లింగంపేట మండలంలోని ముంపుకు గురైన కొన్ని గ్రామాలలో ఆహార సదుపాయం కల్పించారు.






**మానవుడు స్వాతంత్ర్యాభిలాషి. తల్లి పట్ల ప్రేమ ఎలాంటిదో జన్మభూమి పట్ల కూడా అలాంటిదే. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని వాల్మీకి ఘంటం నుంచి మాత్రమే వెలువడడానికి కారణం ఈ నేల. తన సంస్కృతి, సంప్రదాయం, ఆచార వ్యవహారాలు, భాష–అన్నిటిపైన అభిమానం సహజం. వాటి రక్షణ కూడా తన కర్తవ్యమే.**

ఒక వర్గం చరిత్రకారులకు ఓ అభిప్రాయం ఉంది. వలస పాలనలోనే భారత దేశంలో జాతీయత రూపుదిద్దుకొన్నదంటారు. నిజానికి భారతీయుల మధ్య సాంస్కృతిక ఏకరూపత, భౌగోళిక ఐక్యత ఉన్నాయి. రామాయణ, భారతాలు ఆసేతు హిమా చలానికి సంబంధించినవి. మధ్యలో కొంత విచ్ఛిత్తి ఏర్పడింది. మహమ్మదీయుల ఏలుబడిలో భారతీ యత బలహీనపడుతున్నప్పుడు పృథ్వీరాజ్, రాణా ప్రతాప్, శివాజీ వంటి ఎందరో జాతీయ ప్రభుత్వ స్థాపనకు పోరాడారు. కానీ ఈ జాతీయతా భావం బ్రిటిష్ కాలానికి దాదాపు అంత్య దశకు వచ్చింది. ఈ పరిస్థితుల్లోనే భాష, తెగ, మతం ఆసరాగా చేసుకొని క్రింది స్థాయిలో జాతీయతాభావం మరింత విశాలమై సామ్రాజ్యవాద వ్యతిరేకత రూపంలో చిగురించి, మహావృక్షమైంది. ఆ వృక్షానికి శాఖలు నా దేశం, నా సంస్కృతి, నా స్వాతంత్ర్యం.

1905 నాటి బెంగాల్ విభజన సామ్రాజ్యవాద వ్యతిరేక అగ్నిని రగిలించింది. జాతీయతాభావం దేశమంతటా వ్యాపించింది. బంకించంద్ర చటర్జీ 'ఆనందమఠం' నవలలోని 'వందేమాతరం' 1906 కలకత్తా కాంగ్రెస్‌లో జాతీయ సమైక్యతా గీతమైంది. ఆ ఉద్యమానికి ఎందరో కవులు స్ఫూర్తినిచ్చారు. రాజమండ్రి సభలో బిపిన్ చంద్రపాల్ సమక్షంలో చిలకమర్తి ఆశువుగా, '*భరత ఖండంబు చక్కని పాడియావు/హిందువులు లేగ దూడలై యేడ్చుచుండ /తెల్లవారను గడుసరి గొల్లవారు /పితుకుతున్నారు మూతులు బిగియగట్టి*' అన్న పద్యం చదివారు. దేశభక్తి కవిత్వంలో అగ్రేసరుడు రాయప్రోలు, '*ఏ దేశ మేగినా, ఎందు కాలిడిన/ ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన/ పొగడరా నీ జాతి నిండు గౌరవము/ లేదురా మన వంటి పౌరులింకెందు/అవమానమేలరా అనుమాన మేలరా/ భారతీయుడ నంచు భక్తితో పాడ*' అని రాశారు.

స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు ప్రాంతంలో ఇలాంటి వాతావరణం ఏర్పడింది. దీనిని మరింత తేజోమంతం చేసిన మహనీయుడు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. వారి రచన 'ఆంధ్రప్రశస్తి' జాతీయవాద సాహిత్యాన్ని పరిపుష్టం చేసింది. ఆంధ్రప్రశస్తి కావ్యంలోని 12 కవితా ఖండికలలో ఐదవదే వేంగీ క్షేత్రము. ఆంధ్రుల పూర్వ వైభవం, వేంగిని పాలించిన తెలుగు పాలకుల శౌర్య ప్రతాపాలను, చారిత్రక, సాంస్కృతిక ప్రాభవాల గురించి విశ్వనాథ రాశారు. అయితే పూర్వాంధ్రుల వైభవానికీ, నాటి యాంధ్రుల దీనస్థితికీ అంటే పారతంత్ర్యానికీ గల వ్యత్యాసాన్ని తలుచుకుని దుఃఖిస్తూ 'వేంగీ క్షేత్రము' రాశారు.

పూర్వాంధ్ర రాజుల కథలతో నిండిన పేటిక అది. ఆ పెట్టె ఆంధ్రుల సొత్తు. ఆ పెట్టె నుండి తనకు నచ్చి, హృదయముప్పొంగ జేసిన రత్నాల వంటి గాథలను ఏరుకొనినారు. ఒకనాడు వైభవం అనుభవించిన వేంగీ క్షేత్ర చరిత్ర గాథను పద్యావళి రూపంలో మనకందించారు. ఈ రచన గురించి చల్లా రాధాకృష్ణ శర్మ ఇలా చెప్పారు. "విశ్వనాథ వారి ఆంధ్ర అభిమానానికి అక్షరాకృతియే ఆంధ్ర పౌరుషము (ఆంధ్రప్రశస్తిలోని మరొక ఖండం). కృష్ణాగౌతమీ పెన్నా భద్రలు తెలుగు మాగాణాన్ని తడిపి, తెలుగు వారికి సిరులు సమకూరుస్తున్నట్టుగానే ఈ పౌరుష కావ్యం తెలుగుల గుండె పొరల్లో ప్రవేశించి తెలుగువారికి ఆనందోత్సాహాలు ప్రసాదిస్తుందనడం సత్య సన్నిహితం."

ఆంధ్రులు శ్రీపర్వతీయులు, కనుక వారిపై పార్వతీదేవి కృపకు లోటు లేదని భావం. "తెలుగు జాతికి పౌరుషంబు బల దద్రి స్వామి కన్యాకృపా కలనంబుం గలదీ దృశంబుగ మహా కష్టంబులీనాటికి" అగస్త్య మహర్షి, వాల్మీకి మహర్షి ఆంధ్రులే అని విశ్వనాథ వారి భావన, అగస్త్యుడు వింధ్య పర్వతాహంకారాన్ని నాశనం చేసినవాడు. విశ్వనాథ వారు ప్రథమాంధ్రస్వామిగా భావించిన అగస్త్య మహర్షి మొదలు, బొబ్బిలివీరుడు తాండ్ర పాపయ్య వరకు పూర్వాంధ్రుల పౌరుషం వివరించారు. ఈ గ్రంథాన్ని 1917లో తాను ఇంటర్ మీడియట్ చదివే రోజుల్లో రాశారు. విశ్వనాథ ఈ దేశభక్తి పద్యాలను ముద్రించి తన చిన్నతమ్ముడు రామమూర్తితో అమ్మించేవారని పెద్దలమాట. తెలుగు వారెంత గొప్పగా బ్రతికినారో వెల్లడించిన పద్యమిది.

*"ఒకనాడు గలదాంధ్ర యువకులు తూరుపు కనుమ దుర్గముల నేలిన దినంబు / ఒకనాడు గలదు శిల్పకళా సరస్వతి అమరావతిని నృత్యమాడిన దినము ఒకనాడు గలదాంధ్ర సకల ప్రపంచమ్ము కృష్ణా స్రవంతి నూగిన దినము / ఒకనాడు గలదు నిల్వక వారు శత్రులనాంధ్ర సైన్యంబు వేటాడు దినము"*

**(ఆంధ్ర పౌరుషము)**

అమరావతి శిల్పకళా సరస్వతి విశ్వవిఖ్యాతి నార్జించింది. అమరావతీ స్థూపంలోని చెక్కడపు పనులు నాటి ఆంధ్ర శిల్పుల పవిత్ర మతాభి నివేశమునకు, కళా కోవిదత్వమునకు గీటురాళ్లు. నేటికి రెండు వేల సంవత్సరాల నాటి ఆచార వ్యవహారాది విషయాలను ఈ శిల్పాలు ప్రతిబింబిస్తున్నాయి.

టాలమీ తన గ్రంథంలో "మైసోలమ్" నుండి అత్యంత సున్నితమైన రవసెల్లాలను (సన్నటి వస్త్రం) వజ్రాలను పాశ్చాత్య సీమలకు ఎగుమతి అయ్యేవని రాశాడు. అట్టి ఆంధ్రోన్నతి కాల గమనంలో తల్లక్రిందులైంది. బండ్లపై ఓడలు కట్టవలసి వచ్చినది. సింహశార్దూలములు నక్కలతో సరిరాక పోయినవి. సజీవ నదులు కాలువలైనవి. ఈ సందర్భాన్ని చల్లా రాధాకృష్ణశర్మ ఇలా వ్యాఖ్యానించారు.

"ఎంత గొప్పగా బ్రతికిన తెలుగువారు దురదృష్టవశాత్తూ దుస్థితికి లోనుకావడం విశ్వనాథ వారికి దుర్భరంగా తోచింది. గత వైభవాన్ని సగర్వంగా స్మరిస్తునే, కంట తడిపెట్టారు. తెలుగువారి ఖడ్గధాటికి శత్రు వీరుల రక్తం నదులు కట్టిందని పేర్కొంటూనే

# విశ్వనాథ చూ

'అస్మదున్నతి తలక్రిందులయ్యె" అని వాపోయారు. "మమ్మెటుల గాచెదో నీవిక నాంధ్ర మాతృకా" అని తమ సంశయాన్ని వెలిబుచ్చారు. అసమాన్యములైన ఆంధ్రుల శౌర్య సాహసాలు వాడిపోవడాన్ని తలుచుకుంటేనే కళ్లల్లో నీరు నిలుస్తుంది. మనస్సు వికలమవుతుంది. కంఠమేమో రుద్ధమవుతుంది అని పేర్కొన్నారు. చివరకు ఆకాశం కూడా సానుభూతి వ్యక్తం చేస్తుంది. పువ్వులమ్మిన చోటే కట్టెలమ్మడం రమణీయ దృశ్యం కాదు. అలాగే పచ్చ పచ్చగా బ్రతికినవాడు ఈసురోమని కాలం గడపడం హృదయ విదారమైన దృశ్యం. సహజంగా ఆంధ్రాభిమానముగల విశ్వనాథ ఈ దృశ్యాన్ని ఊహించుకుని రంపపు కోతకు పాల్పడివుంటారు" (విశ్వనాథ శారద).

నేడు తెలుగువారు ఈ స్థితికి దిగజారి పోవడానికి అంతర్వైరములే కారణమని, నేటి యాంధ్రులు కూడు గుడ్డలుండిన చాలను స్థితికి వచ్చినారు. జాతీయ సత్వము చచ్చిపోయినదని నిందించాడు కవి, నేటి స్థితికి నిదర్శనమే ఈ పద్యము.

*ఆంధ్ర భూదవుల కార్యాలయాంతః పుర*
*ప్రగతి కోతులకు నావాసమయ్యె*



*రాజకిరీట రారా జన్మణిచ్ఛటల్*
*ప్రతిఫలించెడి చోట్లు పాదుపడియె*
*పట్టపేనుగులు గర్వ సమేతముగ నేగు*
*కదల జిల్లేడు మొక్కలు జనించె*
*ఆంధ్ర పౌరుషము మాట్లాడు చోటులు శిలా*
*ధృతిని మార్గము నిరోధించినిలిచె*
*ఆంధ్ర తేజమ్ముగని మొదమంది నట్టి*
*యాకసము గూడ మాలిన్యమై చెలంగె*

# సిన వేంగీక్షేత్రం

*కాలమా! నీ కృతమ్ములు గలవు గద శ*
*తమ్ములున్ వేలు నేమి ఫలమ్ము చెప్పి*
**(ఆంధ్ర పౌరుషము 10ప)**

విశ్వనాథ ఆంధ్ర ప్రశస్తి గురించి మల్లంపల్లి శరభయ్య ఇలా అన్నారు, "చరిత్రకందిన దేశకాల ఖండములను ఆలంబనమున గొని విశ్వనాథ ప్రతిభ చరిత్రకందని దేశకాల వైభవములను శాశ్వతముగా మన కన్నుల ముందు నిలుపుచున్నది. రెండువేల సంవత్సరములకు పైబడిన కాలము నుండి యీ తెలుగు నేల నాలుగు చెరగులలో వెలసిన అనేకములైన పూర్వాంధ్ర మహా సామ్రాజ్యముల ఉదయాస్తమయ ములకు సంబంధించిన విషాదానంద శబలితమైన సంస్కృతి ధారయే ఇందలి కావ్య వస్తువు. ఆ చరిత్ర స్థలములను మహాక్షేత్రముగా సందర్శించి– అభివర్ణించి –విశ్వనాథ ఆంధ్రజాతికెల్ల శాశ్వతముగా వానిని మహాక్షేత్రములుగా వెలయించెను. అట్టి వాటిలో వేంగీ క్షేత్రమొకటి.'

ఇది పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరుకు సమీప గ్రామం. నేటి 'పెదవేగి' ఇదే. ఒకప్పుడు "వేంగీ" చాళుక్యుల రాజధాని. ఇప్పటికీ వారిని "వేంగీ చాళుక్యులనే" పిలుస్తున్నారు. క్రీ॥శ॥ 350 ప్రాంతంలో వేసిన అలహాబాద్ శాసనంలో "వేంగీ హస్తివర్మ" అని కనపిస్తుంది.

శాతవాహనుల తరువాత ఆంధ్రదేశ భాగములను పాలించినవారు– ఇక్ష్వాకులు, బృహత్ప లాయనులు, ఆనంద గోత్రీకులు, శాలంకాయనులు. వీరు వేంగిలో స్వతంత్ర రాజ్యం స్థాపించి పాలించారు. శాలంకాయనులు చిత్ర రథస్వామి (సూర్య భగవానుడు) పాదానుద్యాతులమని చెప్పుకొన్నారు. వీరి కులదైవం సూర్యుడు. నేటికిని పెదవేగిలో ఒక పురాతన దేవాలయమున్నది. వారు చిత్రరథస్వామి దేవాలయమని చెబుతారట. క్రీ॥శ॥ 624లో రెండో పులకేశి తూర్పు తీరంపై దాడి చేసి వేంగిని గెలిచి తన తమ్ముడు విష్ణువర్ధనుని ఆ రాజ్యానికి రాజును చేశాడు. విష్ణువర్ధనుడు కీ॥శ॥631 తరువాత రాజధానిని వేంగీపురం నుండి రాజ మహేంద్ర వరానికి మార్చాడు.

ఒక చరిత్రాత్మక రాజ్యానికి రాజధానియై, మహానగరంగా విలసిల్లిన వేంగీపురమిప్పుడు కళాకాం తులు కోల్పోయి చిన్న గ్రామంగా దర్శనమిస్తున్నది. అయినా అక్కడి వైభవ చిహ్నాలు చూస్తే భావోద్వేగం కలుగుతుంది. కళ్లు చెమ్మగిల్లు తాయి. ఈ హీనస్థితి చూస్తే ఇదొకనాటి మహా నగరమంటే నమ్మరు. కాని శాసనాలు ఆ సత్యాన్ని ధ్రువపరుస్తున్నాయి.

రాజులు శౌర్యపు పాయసమ్ములు పంచి పెట్టిరి. పల్లవరాజు రమణులు కాళ్లకు పారాణి పెట్టారు. తెలుగు పిల్లలు కత్తి తిప్పారు. ఆ వేంగి రాజుల పాద చిహ్నాలను తన గర్భంలో ఇముడ్చుకొన్న ఈ భూఖండంలోనే జీవచ్ఛవాంధ్ర జనులు కన్నీరు కారుస్తారు.

తెలుగువారు చెడుగుళ్ల నాడే శత్రువులను కవ్వించడం, గూటీబిళ్ల సొగసులో రిపు శిరస్సుల బంతులాడడం, ఉప్పెన బట్టెలాటలో శత్రు వ్యూహం భేదించు నేర్పు, కోతి కొమ్మచ్చి ఆటలో కోటగోడల కెగబ్రాకుట తెలుసుకున్నారు. తెలుగు తల్లులు బొడ్డు కోయని కూనలకు కూడ ఉగ్గుపాలతో రంగరించి పోసిరట. ఇలా వేంగి గాథలను విశ్వనాథ పద్య రూపంలో ఆవిష్కరించారు. ఈ నేల చేవకు సముద్ర గుప్తుడు హడలిపోయినాడు. చిత్రరథస్వామి సేవలచే ఈ నేల పునీతమైంది. పల్లవ స్త్రీల వ్రతాల ఫలిత ముగా నిట సంపదలు నిల్చినవి. వ్రేలు గ్రుచ్చినంతనే నిధులు వెలువడు ప్రదేశము ఇప్పుడు నిరుపయోగ ముగా మిగిలినది. అది చూసి విశ్వనాథ హృదయం చలించింది. ఆయన శరీరంలో అనేక జన్మల నుండి ఆంధ్రరక్తం ప్రవహించి ఉన్నందువల్ల భారతీయ వేదాంతానికి ఆయువుపట్టు "పునర్జన్మ సిద్ధాంతము"పై గాఢ నమ్మకం.

ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం మాటలలో, "వాస్తవ జగత్తులో నుండి వాసనా మయమైన అంతర్ జగత్తు లోనికి ఆలోచనను అంతర్భవింపజేస్తున్నవీ పద్యాలు, అంతశ్చేతనమే అక్షరాకృతి తెల్పడం ఈ పద్యరచనా శిల్పము. అచ్చమైన అనుభూతికి మచ్చలేని మణిదర్పణాలీ పద్యాలు.

"రమ్మణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్" అన్న కాళిదాసు శ్లోకంలోని రసదృష్టి ఈ పద్యాల్లో కనిపిస్తుంది. అపూర్వ భావనా బంధురమైన రచనలతో ఆలోచనామృతాన్ని వర్షించడం కంటె సున్నితమైన హృదయం స్పందనాన్ని కలిగించి తన్మయత్వం కలిగించడం కష్టం. రసార్ద్రచిత్తునికి గాని అట్టి రచనలు సాధ్యం కాదు."–విశ్వనాథ కవితావైభవం.

**మూలం:**


1) విశ్వనాథ సత్యనారాయణ గారి భక్తి దేశభక్తి :పంపన సూర్యనారాయణ

2) ఆంధ్ర పౌరుషము చారిత్రక సాంస్కృతిక అంశాల విశ్లేషణ:
డా॥ మాడుగుల ప్రఫుల్ల,'ఔచిత్యం' అంతర్జాల తెలుగు పరిశోధన పత్రిక

3) విశ్వనాథ వేంగీ క్షేత్రము : చారిత్రక విశేషాలు: డా॥ పట్టపు శివకుమార్

4) ఆంధ్రులచరిత్ర – సంస్కృతి: ఖండవల్లి బాలేందుశేఖరం, ఖండవల్లి లక్ష్మీ రంజనం.





**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

రచన అంటాం, రచయిత్రి అని పిలుస్తాం.
కళ అంటూ ఆరాధిస్తాం. కళాకారిణిగా గౌరవిస్తాం.
శాస్త్రం పేరిట ప్రత్యేకతనిస్తాం. మహిళా శాస్త్రవేత్తగా పరిగణిస్తాం.
సాహిత్యం, కళలు, శాస్త్రాలు, వీటన్నింటికీ ఉన్న అంతర్లీన లక్షణం వ్యక్తీకరణ. అభివ్యక్తం చేయడం. ఎంత ప్రభావంతంగా వ్యక్తపరిస్తే, అంతగా జనస్పందన.
'నాట్యం'లో సాహిత్యం, సంగీతం, మరెన్నో కలగలిసి ఉంటాయి. నర్తకిని తిలకిస్తే రచనల, కళల, శాస్త్రాల సమాహారం కనిపిస్తుంది. మరి బాలనర్తకీమణులను చూస్తే సంస్కృతి ప్రత్యక్షమైనట్లే! ఇప్పుడు మనం చూపు సారిస్తోంది 'బాల సరస్వతి'కి సంబంధించి...
తమిళనాట పుట్టిన నృత్యకారిణి బాలసరస్వతి. నృత్యం చేసే వారందరికీ తెలుగు ధారాళంగా వచ్చి ఉండాలని అంటారామె. అందుకేనేమో 'నాట్యలోక రాణి'గా ప్రశంలు అందుకున్నారు.ఎ.ఎస్. రామన్ (అవధాన సీతారాముడు) అనే ఒక ఆంగ్ల వార పత్రిక సంపాదకుడి (భారతీయ మొదటి సంపాదకుడు) వల్ల ఆమె పేరు విశ్వవ్యాప్తమైంది. ఆయనతో 'బాలమేధావి' అనిపించుకోవడమే ఆమె ప్రత్యేకత. 'పద్మవిభూషణ్' పురస్కారం అందుకొని బాలసరస్వతికి ఇది స్వర్ణోత్సవ సందర్భం!
కర్ణాటక సంగీతానికి, దాని ప్రభావం ఉన్న భరతనాట్యానికి తెలుగు భాషతో పరిపూర్ణత సాధించడమే ఆమె విలక్షణత.

---



# ఆబాలగోపా

తంజావూరు పేరు విన్నారు కదా! తమిళనాడులోని ఊరు. పండిత, కళాకారుల నిలయం.

తమిళుల తర్వాత అధిక సంఖ్యలో ఉండేది తెలుగువారే అక్కడ. అంతర్జాతీయ విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ గుర్తించిన 'ప్రపంచ వారసత్వ' ప్రదేశాలో ఒకటి. విశ్వవిఖ్యాత 'సరస్వతీ మహల్' ఉంది కూడా ఇక్కడే! వేలాది చేతిరాత ప్రతులు ఉన్నాయక్కడ.

అటువంటి సాహిత్య, సంగీత, నాట్యకళాకారుల వంశం. జయమ్మాళ్, వీనధనమ్మాళ్, సుందరమ్మాళ్, రుక్మిణమ్మ... వీరంతా కళాకారిణులే. ఈ వారసత్వమే బాల సరస్వతికీ లభించింది.

మొట్టమొదటి నాట్య ప్రదర్శన కాంచీపురంలో....అటు తర్వాత మద్రాసులో.

అనంతర కాలంలో జపాన్ వేదికపైన కూడా! ఒక సందర్భంలో కోల్‌కతాలో నర్తించారు.

వారణాసిలో ప్రదర్శించినపుడు ప్రేక్షకుల్లో ఉన్న రవీంద్రనాథ ఠాగూర్ చూసి ముగ్ధులయ్యారు. శాంతినికేతన్‌కు ఆహ్వానించడంతో.. ఆమె జైత్రయాత్ర మరింత వేగాన్ని అందుకుంది. తంజావూరు బాలసరస్వతి ఖ్యాతి మరెంతో విస్తరించింది. ఇంగ్లండ్‌లో వరసగా అనేక రోజులపాటు నృత్య ప్రదర్శనలు.

దేశవిదేశాల్లో ఇచ్చిన ప్రత్యేక ప్రదర్శన 'జనగణమన' ఆ గీతాన్ని 'తత్త్వబోధిని' పత్రిక ప్రచురించింది అప్పట్లోనే.

శీర్షిక : భారత విధాత.

ఠాగూర్ విరచిత గీతంలోని భాగాల సమాహారం ప్రదర్శిస్తున్నపుడు ఎంతగానో పొంగి పులకించే వారామె. దేశభక్తికి, భాషాభివృద్ధికి అనుదిన బంధం ఉంటుందనేవారు.

ఆమె అభిప్రాయం ప్రకారం....మన చరిత్ర, సంస్కృతి, భాషల పరంగా అభిమాన గౌరవాలు, సంప్రదాయాలు, ఆచారాల గురించిన నిబద్ధత.

విధేయతను కనబరిచే తత్త్వం. రాజీపడని వర్తనం. వీటన్నింటి కలయికే దేశభక్తి తత్పరత. తత్వరత. ఏ ప్రదర్శనకైనా, కళాత్మకతకైనా ఇదే ప్రాతిపదిక. అందుకే ఆ భక్తిభావాన్ని ఎంతగానో అభివ్యక్తం చేసేవారు.

భారతీయ నాట్యరీతుల్లోని సంప్రదాయ విలువల పరిరక్షణకు ఎంతగానో పరితపించారు. భరతముని 'నాట్యశాస్త్రం'లోని అభినయ ప్రాధాన్యాన్ని విశదీకరించేవారు.

భావం, రాగం, తాళం...ఇవే అంతర్గత విశేషాలు. వీటిని బాల్యం నుంచే నేర్పిస్తే కళాకారిణుల సత్వరం రాణిస్తారు. ముఖ, హస్త, పాద కదలికలతో భంగిమలను కనబరుస్తారు. ప్రత్యేకించి భరతనాట్యం గురించిన విశేష శిక్షణ వారికి ఎంతైనా వన్నె తెస్తుందంటూ తన అనుభవాలను వివరించేవారు బాలసరస్వతి.

కాంచీపురంలోని దేవీమందిరంలో బాలికగా ఆమె అభినయ చాతురి ప్రేక్షకులందరినీ పరివశింపచేసింది. అప్పటికి తనకి ఏడేళ్ల వయసు.

అభినయం అనేసరికి మనోభావాల ప్రదర్శన ఉంటుంది. భావోద్వేగాలను వ్యక్తీకరించడం ప్రస్ఫుటమవుతుందనీ తన అనుభవాలు నిరూపించాయి.

మద్రాసుకు చెందిన మ్యూజిక్ అకాడమీ సౌజన్యంతో బాలసరస్వతి నృత్య విద్యాలయాన్ని ప్రారంభించారు. అనేకసార్లు అమెరికా



# ల 'బాల సరస్వతి'

సందర్శించారు.అక్కడి విశ్వవిద్యాలయాల విద్యార్థినులకు భారతీయ నృత్య సంప్రదాయ అంశాలను విపులీకరించారు. మన కళలకు ఎంత ప్రాచుర్యం కలిగించారో మాటల్లో చెప్పలేం.

సంగీత నాటక అకాడమీ ఆమెకు జాతీయస్థాయి పురస్కృతిని అందజేసింది. సంగీత కళానిధి బిరుదూ ఆమెనే వరించింది. రవీంద్రభారతి (శాంతినికేతన్) డాక్టరేట్ పట్టా ప్రదాచేసింది. ఇలా ఎన్నెన్నో పురస్కారాలు అందుకున్నారు.

భరతనాట్యాన్ని అభ్యసించడం కోసమే తెలుగును నేర్చుకొని, నిపుణత సంతరించుకొని, ఆదర్శప్రాయులయ్యారు. శబ్దం, వర్ణం, పదం, జావళీలు, థిల్లానాలు, జతిస్వరాలు వీటన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేయడం, పరిశోధించడం కళారంగానికి అనంత ప్రయోజనాన్ని చేకూర్చింది.

బాలనర్తకుల కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కళాసంస్థలవారు, ప్రభుత్వాల పరంగా ఏం జరగాలన్నది అంశాలవారీగా తెలిపారు ఆమె. వాటిని క్రోడీకరించి చూస్తే:

1. బాల్యం అనేది అపురూపం. అప్పుడు కలిగే ఏ భావనైనా బాలికల జీవితాన్ని ప్రభావితం చేసి, ఎన్నో విధాలుగా తీర్చిదిద్దుతుంది. ప్రోత్సాహం ముందుగా ఇంటినుంచి కావాలి, రావాలి, తల్లిదండ్రులే బాధ్యతవహించి ఉత్సాహపరచాలి.

2. గురు ముఖఃత శిక్షణ ఎంతో కీలకం. భాష, భావం, వ్యక్తీకరణ ప్రక్రియల్లో శిష్యులను ముందుకు తీసుకెళ్లేది గురువులే. వారి ఆకాంక్షలకు అనుగుణంగానే శిష్యులు రూపుదిద్దుకుంటారు అంటూ తన బాల్యానుభవాలను ఇలా గుర్తుచేసుకున్నారు. 'నాది ఆసక్తినింపిన మనస్తత్వం. తెలియనివి తెలుసుకోవాలని ఉంటుంది. తెలిసినవాటిని వ్యక్తీకరించాలనీ అనిపిస్తుంటుంది. మెళకువలు తెలియాలంటే గురుప్రోత్సాహం ఉండి తీరాల్సిందేకదా! నా గురువులు నన్ను తీర్చిదిద్దారు. ఆలోచనలకు వారే పదునుపెట్టారు. ఎన్ని ప్రశ్నలడిగినా ఓపికగా సమాధానాలు చేప్పేవారు. ప్రదర్శన అవకాశాలనీ వారే కల్పించారు.'

ఈ మాటలు సదా మననీయాలు. ప్రస్తుత విద్యావిధానం పరీక్షలకే పరిమితమవుతోంది. మార్కుల కోసమే బాల్యమంతా హరించుకుపోతోంది. సృజనను వెలికిదీసే వాతావరణమే కనుమరుగవుతోంది. పిల్లల ఇష్టాలకంటే పెద్దల నిర్బంధ ధోరణులే ఎక్కువవుతున్నాయి. దీనికి భిన్నంగా ఉత్సాహపూరిత వాతావరణం కావాలిప్పుడు.

ఆబాలగోపాలాన్నీ కళాభివ్యక్తితో ఆకట్టుకున్న బాలసరస్వతిని తరతరాలూ గుర్తు చేసుకుంటాయి. ఆమె జ్ఞాపకాలకు అనుగుణంగా భారత ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది.అందులో భాగంగా ప్రత్యేక తపాలా బిళ్ల విడుదలైంది. ఆ ఆవిష్కరణ సందర్భంలో దేశ రాజధాని వేదికగా ఏర్పాటైన బాల నర్తకీమణుల నృత్య ప్రదర్శనలు అపూర్వ అనుభూతినిచ్చాయి.

ఆమె వారసత్వం కళాజ్యోతిని తలపిస్తోంది.తనయ లక్ష్మి ఆ బాటలోనే నడిచారు. మనుమడు ప్రత్యేకంగా సంస్థను స్థాపించి, బాలల నాట్యజీవితాలను తీర్చిదిద్దుతున్నారు. బాల సరస్వతి జీవిత అనుభవాలకు ఆమె అల్లుడు అక్షర రూపమిచ్చారు. ఆమె వారసులు ఆమె ఆశయాలను పరిరక్షిస్తూ,విస్తృత ప్రాచుర్యానికి తెస్తున్నారు. బాల్యదశనుంచే ప్రధానంగా ఆడపిల్లల కళాత్మకత, సృజన శక్తులను వెలికితీసే లక్ష్యంతో బాలనర్తకి' అనే విభాగాన్ని రూపొందించారు.

***తెలుగుతల్లి మెడలో పూలమాలికలు***
***బంగరు భవితకు పలికలు***
***చిన్నారి బాలికలు.***
***వారి ఆలోచనను గుర్తించి***
***సృజనశీలతను గ్రహించి***
***నర్తనాది రంగాల్లో ప్రోత్సహిస్తే చాలు.***
***అదే అన్ని విధాలా మేలు.***
***కళా సరస్వతికి నవోదయ నీరాజనాలు!***



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**





# కరుగుతున్న లద్దాఖ్‌కు

**వేసవిలో, హిమాలయాలలో మంచు కరిగి నీరుగా మారడం, శీతాకాలంలో మంచుకొండలు తిరిగి ఏర్పడడం ప్రకృతి మనకిచ్చిన వరం, ప్రకృతి ధర్మం. అయితే దీనికి భిన్నంగా, గత కొన్ని దశాబ్దాలుగా, మంచుకొండలు కరుగుతున్నంత వేగంగా, అంతే పరిమాణంలో తిరిగి మంచుకొండలు హిమాలయాలలో ఏర్పడకపోవడం, భారతదేశాన్ని ముఖ్యంగా లద్దాఖ్ ప్రాంతాన్ని కలవరపెడుతున్న అంశం. దీన్నే శాస్త్రీయంగా "గ్లాసియల్ మెల్టింగ్ & ఇరోజన్" అనవచ్చు. దీనిమీద అనేక మంది స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలు, జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు చేస్తున్న పరిశోధనలు, తద్వారా విడుదల చేస్తున్న నివేదికలను చూస్తుంటే విస్తుపోయే విషయాలు తెలుస్తున్నాయి.**

హిమాలయాల్లో హిమానీనదాలు అత్యంత వేగంగా కరిగిపోతూ, తత్ఫలితంగా దాదాపు 200 కోట్ల జనాభాకు భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడొచ్చని, అందులో ముఖ్యంగా లద్దాఖ్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురి కావచ్చని ఐక్యరాజ్యసమితి–ఐరాస నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఇలా మంచు ఎక్కువ పరిమాణంలో కరిగి, ప్రమాదకరమైన వరదలు సంభవించడం, తత్ఫలితంగా నీరు నదులద్వారా పల్లపు ప్రాంతాలకు పారి, భవిష్యత్తులో లద్దాఖ్ ప్రాంతంలో నీటి కొరత పూర్తిగా ఏర్పడే ప్రమాద ముందని అంచనా. దీనికి ముఖ్య కారణం ఆ ప్రాంతం హిమానీనదాల నుంచి మంచు కరుగగా వొచ్చే నీటి పైనే ఆధారపడటం. ఎందుకంటే లద్దాఖ్‌లో వర్షపాతం తక్కువ, నీటి ఆవిరి వేగం ఎక్కువ, చెట్లు చేమలు ఎక్కువ లేకపోవడం. అందుకే దానిని "ఎక్కువ ఎత్తులో చలితో కూడిన ఎడారి(హైకోల్డ్ డెజర్ట్)" అంటారు. అందుకే ఈ ప్రాంతంలో ఏర్పడే వాతావరణ అసమతుల్యత ముఖ్య జీవనాధారమైన వ్యవసాయాన్ని దెబ్బతీస్తోంది. ప్రజల జీవనం దుర్భరమౌతోంది. దీన్నే వాతావరణ సంక్షోభం (క్లైమేట్ క్రైసిస్) అనొచ్చు.

**హిమానీనదాలు వేగవంతంగా కరిగిపోవడానికి ముఖ్య కారణాలు:**

**1. వాతావరణ మార్పులు- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

భూతాపం ద్వారా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. మంచు అతి వేగంగా కరిగిపోతుంది. తిరిగి అంతే పరిమాణంలో మంచు పేరుకుపోదు. ఇది హిమానీ నదాల తరుగుదలకు ఒక ముఖ్య కారణంగా పేర్కొనచ్చు.

**2. హిమానీనదాల అరుగుదల**

ఇది భౌతిక ప్రక్రియ. ఇది రెండు విధాలుగా జరుగుతుంది. మొదటిది రాపిడి వల్ల. మంచులో ఉన్న రాతి ప్రదేశాలు/ రాతి ఉపరితలాలు, మంచు గుట్టలు ఒకదానితో ఒకటి వొరుసుకొనిపోతాయి. మంచు ముక్కలైపోతుంది. పడిపోతుంది. కరిగి పోతుంది. రెండవది విడివడడం. మంచు పదే పదే కరుగుతూ, తిరిగి గడ్డకడుతూ, విడివడిపోయి, పడిపోయి, హిమానీనదం ద్వారా దూరంగా కొట్టుకు పోవడం.

**మంచు కరగడం, కుంచించుకుపోవడం వల్ల వచ్చే దుష్ఫలితాలు**

మంచు కరగడం వల్ల హిమాలయ పర్వత ప్రాంతాల్లో భూమి, వృక్షసంపదలో మార్పులు సంభవిస్తాయి. జీవుల మనుగడకు విఘాతం ఏర్పడుతుంది. వ్యవసాయ భూముల స్థితిగతులలో మార్పు వస్తుంది. భూమి కోతకు గురవుతుంది. భూమి మీద కరిగిన నీరు నిల్వ ఉండిపోతుంది. వ్యవసాయ భూమి విస్తీర్ణం తగ్గిపోతుంది. రవాణా మార్గాలు దెబ్బ తింటాయి. నీరు నదుల ద్వారా సముద్రానికి చేరుకుంటుంది. సముద్ర మట్టం అనూహ్యంగా పెరిగి పోతుంది. తుఫానులు, సునామీలు సంభవిస్తాయి. తీరప్రాంతాలు క్రమేణా కోతకు గురవుతాయి. తీరప్రాంతాలలోని జనావాసాలు, నగరాలు సముద్రంలో ముంపునకు గురికావడం వంటి విపత్తులు చోటు చేసుకునే ప్రమాదం ఉంది.



**హిమనీనదాల అరుగుదల/కుచించుకు పోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలు:**

హిమానీనదాలు కుచించుకు/సుష్కించుకుపోవడం వల్ల గుర్రపునాడ ఆకారపు లోయలు ఏర్పడుతాయి. మంచు పర్వతాల మధ్య పాత్ర ఆకారంలో ఖాళీలు ఏర్పడుతాయి. పర్వతాలు బీటలువారుతాయి. పర్వతాల్లో కొమ్ములు లాంటి కోసైన శిఖరాలు ఏర్పడుతాయి. ఒకప్పుడు దట్టంగా ఉన్న పర్వత భాగం కరిగి కృశించిపోయింది అనేందుకు ఇది ఒక నిదర్శనం. దీని కారణంగా హిమానీనదం ఉపరితలం నున్నగా అయిపోతుంది. మంచు పేరుకుపోదు. మంచు ఉపరితలం పై గీతలు పడే అవకాశాలున్నా యని పరిశోధనలు వెల్లడించాయి. ఫలితంగా లోతైన లోయలు ఏర్పడుతాయి. పర్వతప్రాంతంలో కరిగిన మంచు ఈ లోయల్లోకి చేరుతుంది. ఘనీభవిస్తుంది.



# హిమానీనదాలు - నీటి కష్టాలు

అది గడ్డకట్టి/ సరస్సుల రూపంలో అక్కడే ఉండి పోతుంది. పీఠభూమి ప్రాంతాలకు ప్రవహించదు. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో నీటి కరువు ఏర్పడే ప్రమాదం ఉంది.

అలాగే అనుబంధ లోయలు- హ్యాంగింగ్ వ్యాలీస్ ఏర్పడతాయి. వీటి వల్ల ఆ ప్రదేశాలలో నదుల ప్రవాహం మారుతుంది. నీటి ఉష్ణోగ్రతల్లో మార్పు వస్తుంది. జలచరాల మనుగడపై ప్రభావం చూపుతుంది. కరిగిన మంచు ప్రవహించడం వల్ల రాతి భాగాలు రాపిడికి గురై, రాతి చూర్ణం మంచు ప్రాంతాలలో పేరుకుపోవడం లాంటివి జరిగే ప్రమాదముంది. నిజానికి పటిష్టమైన హిమానీనదాలు నీటి నిల్వలుగా ఉపయోగపడతాయి. ఇవి వేసవి కాలంలో కరిగి పల్లపు ప్రాంతాలకు నీటిని అందిస్తాయి. అలాంటి పటిష్టమైన హిమానీనదాలు మానవాళి ఆధునిక పోకడలతో, వాతావరణంలో మార్పులు ఏర్పడి, అధికంగా కరిగి, నీరు నష్ట పోవడం మానవాళి ఎదుర్కొంటున్న పెను ముప్పుగా భావించవచ్చు.

**లద్దాఖ్‌పై ప్రభావం:**

దాదాపు 1980 నుంచి లద్దాఖ్ ప్రాంతం నీటి కరువును ఎదుర్కుంటోందని నివేదికలు పేర్కొంటున్నాయి. దీనికి కారణం హిమానీనదాలు కరిగి పోవడం/కుంచించుకుపోవడం. ప్రస్తుతం అక్కడ నమోదవుతున్న వర్షపాతం సంవత్సరానికి 50 నుండి 70 మి.మి.లు మాత్రమే అని గణాంకాలు చెప్తున్నాయి. పైగా 80 శాతం వరకు ఇక్కడి ప్రజలు వర్షాధార వ్యవసాయం పైనే ఆధార పడుతున్నారని తెలుస్తోంది. దీన్ని బట్టి ఈ ప్రాంత సమస్య ఎంత గంభీరమైనదో అంచనా వేయవచ్చు. 2000 - 2024 మధ్యకాలంలో ఈ ప్రాంతం చాలా హిమానీనదాల పరిమాణాన్ని నష్టపోయింది. దీనివల్ల మంచు పర్వతాలలో ప్రతికూల అసమతుల్యత ఏర్పడింది. ఇక్కడి హిమానీనదాల సాంద్రత ఒక ఏడాదికి 0.35 నుంచి 0.37 మీటర్ల నీటి పరిమాణం వరకు తగ్గిపోయింది. తూర్పు లద్దాఖ్ ప్రాంతంలో ఈ తగ్గుదల 0.21 నుంచి 0.33 మీటర్లుగా ఉంది.

పార్కాచిక్ హిమానీనదం 1971-1999 మధ్యకాలంలో సగటున సంవత్సరానికి 2 మీటర్లు సన్నగిల్లింది. 1999-2021 మధ్య కాలంలో సగటున 12 మీటర్లకు సన్నగిల్లింది. జన్స్కార్ ప్రాంతంలోని డ్రాంగ్ డ్రంగ్ హిమానీనదం సగటున ఒక మీటరుకు సన్నగిల్లిపోతోంది. క్రీస్తు శకం 1600తో పోలిస్తే ప్రస్తుతం ఇక్కడ దాదాపు 40% హిమానీనదాలు కనుమరుగైపోయాయి. పాంగోంగ్‌లో 1990-2019 మధ్యకాలంలో 87 హిమానీనదాలు 6 నుంచి 7 శాతం సన్నగిల్లాయి.

**లద్దాఖ్‌కు ముంచుకొస్తున్న నష్టాలు**

- మంచు నీటి నిల్వల పరిమాణం క్రమేణా తగ్గిపోవడం
- ఆకస్మిక వరదలు
- వ్యవసాయానికి నీటి అలభ్యత
- ఎడారి ప్రాంతంగా మారిపోవడం
- పర్యాటక రంగం దెబ్బతినటం
- ప్రజల జీవనం దుర్భరం కావటం
- స్థానికులు వలస పోవటం

**నష్టనివారణకు ప్రభుత్వ చర్యలు**

- హిమాలయాలలో పర్యావరణ స్థితిగతులను, హిమానీనదాల పరిమాణాలను నిరంతరంగా పర్యవేక్షించడం
- హిమానీనదాల పరిరక్షణకు నిర్దేశించిన విధానాలను అభివృద్ధి చేయడం, అమలు పరచడం
- శాస్త్రవేత్తలతో నిరంతరం అనుసంధానమై, సంబంధిత విజ్ఞానాన్ని వృద్ధి చేయడం
- హిమాలయాలు ఉన్న రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి వాతావరణ విభాగాలను ప్రోత్సహించడం
- వాతావరణ మార్పుల వల్ల వచ్చే సవాళ్లను, నష్టాలను అంచనా వేయడం
- సవాళ్లను, నష్టాలను తట్టుకోవడానికి, అధిగమించడానికి, తప్పకపోతే అలవాటుపడడానికి కావలసిన ప్రణాళికలను సిద్ధం చేయడం.

జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికరణ సంస్థ- ఎన్డీఎంఏ నిపుణులతో కలిసి హిమానీనదాల సరస్సుల నుంచి అకస్మాత్తుగా ఉద్భవించే వరదల కారణంగా వచ్చే విపత్తును సమర్థమంతంగా ఎదుర్కోవడానికి, ఆస్తి, ప్రాణ నష్టాలను నిలువరించడానికి అవసరమైన మార్గదర్శకాలను జాతీయ స్థాయి తయారు చేస్తుంది.

**క్షేత్రస్థాయి కార్యాచరణలో కొన్ని ప్రాజెక్టులు**

- మంచు స్థూపాలు - వీటి ద్వారా నిల్వ చేసిన నీటితో వ్యవసాయ అవసరాలు తీర్చడం.
- వ్యవస్థీకృత నీటి నిల్వ నిర్వహణ
- బిందు సేద్యం
- చెక్ డాముల నిర్మాణం
- సాంప్రదాయక ఇంధన వనరుల వినియోగం
- ఉపగ్రహం ద్వారా పరిసరాలలో మార్పులను గమనించడం
- క్షేత్ర స్థాయి పరిశీలనలు, పరిశోధనలు
- అడవుల పెంపకం
- వ్యర్థాల సమర్థ నిర్వహణ
- కరువు పరిస్థితుల నిర్వహణ

కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చేస్తున్న కృషి అభినందనీయం. ఈ కృషి ఇలాగే కొనసాగి లద్దాఖ్ ప్రాంతం ఈ విపత్తునుంచి గట్టెక్కాలని ఆశిద్దాం.

**"సర్వేజనాః సుఖినోభవంతు"**



**మహోవాది రామకృష్ణ**





# ముస్లింలు టెక్సాస్‌ను వదిలిపోవాలి!

కాంగ్రెస్‌కు చెందిన 31వ జిల్లా టెక్సాస్ నుంచి వాలెంటీనా గోమెజ్ పోటీ చేస్తున్నారు. ఈమె ఒక నినాదంతో బరిలోకి దిగారు. అదే ఇప్పుడు సంచలనంగా మారింది. ఆ నినాదం టెక్సాస్‌ను ముస్లింలు వదిలి పోవాలి. పైగా పవిత్ర ఖురాన్ ప్రతిని దగ్ధం చేసినట్టు కూడా ఒక వీడియో విడుదల చేసింది. తన ధ్యేయం టెక్సాస్ నుంచి ఇస్లాంను పారద్రోలడమేనని ప్రకటించారు. ప్రపంచంలో ఉన్న 57 ముస్లిం దేశాలలో ఎక్కడికో ఒక చోటికి వీళ్లంతా పోవాలని (నిజానికి చాలా తీవ్రమైన భాషలో) ఆమె చెప్పారు. ముస్లిం వర్గాలు క్రిస్టియన్ దేశాలను బెదిరిస్తున్నాయంటూ తన వీడియోలో ఆమె రెచ్చగొట్టే వ్యాఖ్యలు కూడా చేశారు. 'మనం ముస్లింలను శాశ్వతంగా నిరోధించక పోయినట్టయితే, మీ కూతుళ్లు లైంగిక అత్యాచారాలకు గురి అవుతారు. మీ కుమారుల తలలు తెగుతాయి.' అని గోమెజ్ హెచ్చరించారు. ఈ మాటల తరువాత ఆమె ఖురాన్ ప్రతికి నిప్పు పెట్టి జీసస్ క్రైస్ట్ ఇచ్చిన బలంతో అని నినదించారు. ఖురాన్ హింసను ప్రేరేపిస్తుందని సామాజిక మాధ్యమాలలో పెట్టిన వీడియోలలో కూడా ఆమె ఆరోపించారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లో హమాస్ చేసిన ఘాతుకం, 2021లో కాబూల్ విమానాశ్రయంలో బాంబు పేలుళ్లు (ఇందులో 13 మంది అమెరికా సైనికులు చనిపోయారు) వంటి అంతర్జాతీయంగా కలకలం సృష్టించిన కొన్ని ఉదంతాలను కూడా గోమెజ్ ప్రస్తావించారు. నా విధానంలో మార్పేమీ ఉండదని, వీటికి కారణమైన పుస్తకానికి నేను విధేయంగా ఉండనని రాశారు. ఫాక్స్ ఇంటూ 26 చానల్‌కు (హూస్టన్) ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖురాన్ లైంగిక హింసను, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందని కూడా అన్నారు. ముస్లింలు యూరప్‌లో పసివాళ్లపై లైంగిక అత్యాచారాలు చేసినా ఏ ఒక్క ముస్లిం దీనిని ఖండించలేదని ఆమె విమర్శించారు. ఎందుకంటే వారి పవిత్ర గ్రంథం ఖురాన్ చెప్పేదే అదని ఆమె అన్నారు. అవిశ్వాసులపై లైంగిక అత్యాచారాలు చేయమని, వారి గుండెలను ఉగ్రవాద భయంతో నింపమనే చెబుతుందని ఆమె రాశారు. ప్రస్తుతం టెక్సాస్‌లో ఒక శాతం ముస్లింలు ఉన్నారు.

అయితే ఆమె వ్యాఖ్యలను సొంత పార్టీ వారు కూడా ఖండించారు.

# అయ్యప్ప మీద మార్క్సిస్టుల

ప్రపంచ కార్మికులారా ఏకం కండి అన్నట్టు, ప్రపంచ అయ్యప్ప భక్తులారా పంప రండి అంటున్నారు కేరళ మార్క్సిస్టులు. సెప్టెంబర్ 20న పంపలో కేరళ ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ప్రపంచ అయ్యప్ప భక్తుల సమావేశం ఉద్దేశం ఏమిటి? ఇప్పుడు దీని మీదే అందరికి అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. శబరిమలైలో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నట్టు కేరళ కామ్రేడ్ల ప్రభుత్వం ఎప్పుడో ప్రకటించింది. ఇందులో మరొక మలుపు ఉంది. శబరిమలై దేవస్థానం ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భం పేరుతో కేరళ ప్రభుత్వం ఈ కార్యక్రమం తలపెట్టింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నాస్తికుడు, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తాడు. అయ్యప్ప భక్తుల అంతర్జాతీయ సమావేశానికి వచ్చి మరింత పవిత్రం చేయండి అంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కూ, ఆయన పుత్రరత్నం ఉదయనిధి స్టాలిన్‌కు కేరళ దేవదాయ మంత్రి స్వయంగా వెళ్లి ఆహ్వానించి వచ్చారు. ఇందులో స్టాలిన్ అన్నవాడు తమిళనాడులో దేవాలయాలను కూల్చడమే పనిగా పెట్టుకున్నవాడు. ఆయన కుమారుడు, మంత్రి ఉదయనిధి సనాతన ధర్మాన్ని డెంగ్యూతోటి, కరోనాతోటి పోల్చినవాడు. కాబట్టి ఈ అంతర్జాతీయ అయ్యప్ప భక్తుల సమావేశం మీద అనుమానం కలగడంలో వింతేముంది? ఇదంతా చూసి స్టాలిన్ లాంటివాడికే సిగ్గేసిందేమో! తాను భక్తుల సమావేశానికి రావడం లేదని ప్రకటించారు. అందుకే దేశం నలుమూలల

# కదులుతున్న ధర్మస్థల



చెన్నయ్య

కర్ణాటకలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో శవాల సామూహిక ఖననం కుట్రదారులు బయటపడుతున్నారు. తనే 70 నుంచి 80 శవాలను ఖననం చేశానని చెప్పిన చెన్నయ్యకు మద్దతు ఇచ్చిన మహేశ్ శెట్టి తిమెరోడి ఇంటిని ఆగస్ట్26న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తనిఖీ చేశారు. ఉచిరీలో ఉన్న ఇతడి ఇంటిలోనే చెన్నయ్య గడచిన రెండునెలలుగా ఉన్నాడని బయటపడింది. ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసిన చెన్నయ్యను వెంట తీసుకుని తిమెరోడి ఇంటిని సిట్ తనిఖీ చేసింది. కానీ దాడికి కాస్త ముందే తిమెరోడి ఇల్లు విడిచి ఎటో వెళ్లిపోయాడు. తిమెరోడి ఇంటిపై అర్ధరాత్రి జరిగిన ఈ తనిఖీలో మూడు కత్తులు, కీలక సమాచారం లభ్యమైనట్టు సమాచారం. దీనితో తానొక సామాజిక ఉద్యమకారుడిని అని అతడు చెప్పుకోవడం గురించి అనుమానాలు మొదలయ్యాయి. ఇప్పుడు తనను అంతం చేస్తారన్న భయం ఉందని చెన్నయ్య కూడా చెప్పాడు. 'కంకాళాల ముఠా' తనను విడిచిపెట్టదనే అతడు అనడం విశేషం. దాదాపు 50 రోజులు తమాషా జరిగింది. చివరికి నదీతీరంలో లేదా అడవిలో ఏమీ దొరకలేదు. ఈ విషయం తెలియగానే తిమెరోడి ఇంట ఘర్షణ జరిగిందని కూడా చెన్నయ్య చెప్పాడు. ఇంతలోనే కత్తులు దొరకడం కొంత ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఈ కుట్రకు సంబంధించిన కొన్ని పత్రాలు కూడా లభ్యమయినాయి. తిమెరోడి భార్య, కూతురు, కొడుకుల సెల్‌ఫోన్‌లను సిట్ స్వాధీనం చేసుకుంది. తిమెరోడి ఇంటిలో ఉండగా చెన్నయ్య ఉపయోగించిన రెండు ఫోన్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. కేవలం దుష్ప్రచారంతో ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రాన్ని అప్రతిష్ట పాల్జేయాలన్న కుట్ర

# దొంగ భక్తి



నుంచి అయ్యప్ప భక్తులంతా అక్కడికి వచ్చి సంప్రదాయ విరుద్ధంగా ఏమైనా జరిగితే ప్రతిఘటిస్తామని హెచ్చరిస్తున్నారు.

కేరళ ప్రభుత్వం ఆధ్యాత్మిక చింతనకు సంబంధించి ఇలాంటి కార్యక్రమం నిర్వహించవలసిన అవసరం ఏమిటన్నది మొదటి ప్రశ్న. భారతీయత అన్నా, హిందూధర్మం అన్నా చులకన భావం కలిగిన మార్క్సిస్టుల ప్రభుత్వం 2019లో యువ మహిళా సామాజిక ఉద్యమ కారిణిల కేసు విషయంలో కేరళ ప్రభుత్వం ఏం చేసిందో దేశం మరచిపోలేదని విశ్వహిందూ పరిషత్, శబరిమలై కర్మ సమితి, కేరళ క్షేత్ర సంరక్షణ సమితి హెచ్చరించాయి. అయ్యప్ప ఆలయం గురించి, ఆ ఆలయంలో శతాబ్దాలుగా పాటిస్తున్న ఆచారాల గురించి ఎలాంటి అవగాహన లేని కొంతమంది మహిళా ఉద్యమకారిణుల వ్యాజ్యం మేరకు న్యాయవ్యవస్థ వారిని ఆలయంలోకి అనుమతించాలని ఆదేశించింది.కానీ అన్ని వయసుల వారిని ఆ ఆలయంలోకి అనుమతించరు. అయినా ఒక మతానికి సంబంధించిన సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం సెక్యులర్ వ్యవస్థకు భంగమన్న సంగతి ఇప్పుడు మార్క్సిస్టులకు ఎందుకు గుర్తుకు రావడం లేదని విశ్వహిందూ పరిషత్ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు విజి థంపి ప్రశ్నించారు. ఇందులోని చట్టపరమైన అభ్యంతరాల గురించి కూడా తాము పరిశీలిస్తామని అన్నారు. దేవస్థానం యాభయ్ ఏళ్ల వార్షికోత్సవం జరపదలిస్తే తిరువనంతపురంలో జరపాలి గాని, పంపలో ఎందుకని కూడా అంటున్నారు. ఆనాడు మహిళా ఉద్యమకారిణిలు ఒక పథకం ప్రకారం ఆలయంలోకి ప్రవేశించి పవిత్రకు భంగం చేయాలని ప్రయత్నించినట్టే, ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం కూడా చేయబోతున్నదనే అనుమానాలు ఉన్నాయని వీహెచ్‌పీ ఆరోపణ. 2019లో ఆలయంలోకి ప్రవేశించిన బిందు అమ్మిణి అనే ఆమె కూడా ఇప్పుడు భక్తుల సమావేశానికి హాజరవుతున్నది కాబట్టి ఈ అనుమానం తలెత్తిందని భక్తులు అంటున్నారు. పైగా పంప సమావేశానికి రాబోతున్న భక్తులలో 3000 మందికి ప్రత్యేక దర్శనం కల్పిస్తారని వార్తలు వెలువడుతున్నాయి. ఇదే అందరికీ అనుమానాలు రేకెత్తిస్తున్నది. శబరిమలై దేవస్థానాన్ని పతనం చేయడమే ధ్యేయంగా 2018 నుంచి కేరళ ప్రభుత్వం పని చేస్తున్నదని శబరిమలై కర్మ సమితి కన్వీనర్ ఎస్‌జేఆర్ కుమార్ ఆరోపించారు. ఇప్పుడు అంతర్జాతీయ అయ్యప్ప సంగమం దానికి కొనసాగింపేనని అన్నారు. పైగా బెదిరింపులతో ఈ సమావేశాన్ని ఎవరూ ఆపలేరని సాక్షాత్తు ముఖ్యమంత్రి పినరయి విజయన్ బెదిరించడం మరొక విశేషం.

# కుట్ర డొంక

కోణం నుంచి సిట్ దర్యాప్తును సాగించక తప్పని పరిస్థితి కనిపిస్తున్నది. సామూహిక శవాల ఖననం ఆరోపణ కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించాలని ఆగస్ట్ 25న బీజేపీ కర్ణాటక అధ్యక్షుడు బీవై విజయేందర్ కోరారు. ధర్మస్థలలోనే సామాజిక ఉద్యమకారుడిగా తనకి తాను చెప్పుకునే మరొక వ్యక్తి, సామూహిక హననాల గురించి ప్రచారం చేసిన గిరీశ్ మట్టన్నవార్ మీద కూడా మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు అందింది. ఒక హిందూ సంస్థకు చెందిన సురేశ్ గౌడ ఈ ఫిర్యాదు చేశారు. మదన్ బుగాది అనే వ్యక్తిని తీసుకువచ్చి అతడు మానవ హక్కుల సంఘం అధికారి అని గిరీశ్ మోసగించాడన్నదే ఆ ఫిర్యాదు సారాంశం. ఇంతకీ ఆ మదన్ బుగాదీ హుబ్బళి కేంద్రంగా రౌడీతనం చేసుకు బతుకుతూ ఉంటాడు. సామాజిక మాధ్యమాల ద్వారా ధర్మస్థల గురించి గిరీశ్ చేసిన దుష్ప్రచారం కూడా తక్కువేమీ కాదు. ఈ పుణ్యక్షేత్రం మహిళలకు ఎంతమాత్రం క్షేమకరమైనది కాదని, సామూహిక వివాహాల పేరుతో మహిళలపై అకృత్యాలు జరిగే స్థలమని, ఇక్కడి ఆటో డ్రైవర్లు కూడా మనుషుల అక్రమ రవాణా కార్యకలాపాలలో ఉంటారని ప్రచారం చేశాడు.



# నేపాల్ మీద టర్కీ కన్ను

నేపాల్‌లో హిందూ చిన్నారులను మతం మార్చే కుట్ర పెద్ద ఎత్తు జరుగుతున్నదని ఆ దేశ మీడియా ఘోషిస్తున్నది. విదేశీ నిధులతో పనిచేసే సంస్థలు మత మార్పిడి పనిలో తీరుబడి లేకుండా ఉన్నాయని ఆ మీడియా వార్తల సారాంశం. విదేశీ నిధులు అందుకుంటూ ఇలాంటి పనికి పాల్పడుతున్న సంస్థల మీద నేపాలీ అధికారులు ఇటీవల దాడులు నిర్వహించారు. కపిలవస్తు, రౌతాహత్, బాంకే, దంగ్ జిల్లాల్లో ఉన్న పేద, అనాథ పిల్లలే లక్ష్యంగా ఆ సంస్థలు మత మార్పిడికి ప్రయత్నిస్తున్నాయని ఆ దాడుల తరువాత తెలిసింది. హిమాలయా ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అనే ప్రభుత్వేతర సంస్థ నిర్వహించే పాఠశాలల విద్యార్థి వసతి గృహాలలో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలోని అంశాలను కాకుండా, ఇస్లామిక్ పుస్తకాలలోని అంశాలను బోధిస్తున్నారని తేలింది. ఆ ప్రభుత్వేతర సంస్థకు నేపాల్ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల యాభయ్ లక్షల నేపాలీ రూపాయల సాయం అందిస్తుంది. ఇది కాకుండా టర్కీ కేంద్రంగా పనిచేసే సాహ్ ఇంటర్నేషనల్ అనే సంస్థ కూడా నిధులు అందిస్తుంది. ఇది కాకుండా ఇస్లాంను బోధించే ఉపాధ్యాయులు ఇండోనేషియా నుంచి టూరిస్ట్ వీసా మీద నేపాల్ చేరుతున్నారు. అక్కడ మత కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇది వలస చట్టాలకు పూర్తిగా వ్యతిరేకం. ముస్లింల కార్యకలాపాలు బాగా ముదిరిపోవడంతో అధికారులు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే దేశ భద్రతకు ముప్పు ఉంటుందని వారు అంగీకరిస్తున్నారు. అలాగే పిల్లల చదువుల మీద కూడా దీని దుష్ప్రభావం ఉంటుందని కూడా చెప్పారు. టర్కీలో ఎర్డాగన్ అధికారంలోకి వచ్చిన తరువాత భారత్, నేపాల్, శ్రీలంకలలో ఇస్లామిక్ విద్యను ప్రోత్సహించే కార్యక్రమం చేపట్టింది. ఇవన్నీ చూసిన తరువాత నేపాల్ ప్రభుత్వం ఇలాంటి ధోరణులకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇదంతా ఐదారేళ్ల పాటు మాత్రమే అధికారంలో ఉన్న మావోయిస్టుల ఘనతగానే చెప్పాలి.

# కశ్మీర్‌లో ఇన్నేళ్లకు మళ్లీ గణేశ నిమజ్జనోత్సవం



**370** అధికరణ రద్దు తరువాత కశ్మీర్‌లో మార్పు వస్తున్న మాట నిజం. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం నుంచి హిందువులు ఉపశమనం పొందుతున్నారు. లోయలో గాలి మారింది. 35 ఏళ్ల క్రితం ముస్లిం మతోన్మాదుల నెత్తుటి కాండతో కకావికలైన పండిట్‌లు ఇప్పుడు కోలుకుంటున్నారు. మళ్లీ తమదైన ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకునే స్వేచ్ఛను పొందుతున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక పరిమళాలు స్వేచ్ఛగా వెదజల్లాలంటే శాంతియుత వాతావరణం అవసరం. ఇప్పుడు కశ్మీర్ లోయలో అది చాలావరకు కనిపిస్తున్నది. గణేశ్ చతుర్థి సందర్భంగా పండిట్‌లు ఇటీవల పెద్ద ఎత్తున నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోగల గడమే ఇందుకు నిదర్శనం.



శారదామాత గుడి

ఆగస్ట్ 31న (ఐదురోజుల పూజల తరువాత) నిమజ్జన ఊరేగింపు శ్రీనగర్‌లోని హబ్బ కదల్ నుంచి ప్రారంభమైంది. గణపత్యార్ ఆలయం నుంచి నిమజ్జనం రథయాత్ర ప్రారంభమైందని, ఝెలం నది వరకు సాగిందని సామాజిక ఉద్యమకారుడు, పండిత్‌ల హక్కుల కార్యకర్త సంజయ్ టికూ తెలియచేశారు. రాష్ట్రంలో ఉగ్రవాదం ప్రబలిన తరువాత మళ్లీ ఇన్నాళ్లకు మొదటిసారి నిమజ్జనం ఊరేగింపు నిర్వహించుకోగలిగామని చెప్పారు. కులమత భేదాలు లేకుండా, ప్రాంత, వర్గ తేడా లేకుండా ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా మానవాళి అంతా సుభిక్షంగా ఉండాలని తాము విఘ్ననాయకుని ప్రార్థించామని సంజయ్ చెప్పారు. మూడేళ్ల నుంచి తాము గణేశ్ నిమజ్జనం నిర్వహిస్తున్నామని, ఇంత పెద్ద ఎత్తున ఊరేగింపుతో నిమజ్జనం నిర్వహించడం ఇప్పుడేనని సంజయ్ అన్నారు. 1990లలో పండిత్‌ల సామూహిక హత్యాకాండ జరగడం, వేలాది మంది లోయను వీడి పోవడం తెలిసిందే. కానీ 370 అధికరణం రద్దు తరువాత పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ తమ స్వస్థలాలకు కొందరు పండిత్‌లు వచ్చి చేరుకుంటున్నారు. ఇప్పటికీ అడపాదడపా హిందువుల మీద దాడులు సాగుతున్నా ధైర్యంగా వారు వస్తున్నారు. అలాగే మూడేళ్ల నుంచి తమ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకోగలుగుతున్నారు. కానీ ఇళ్ల వరకే పరిమితం. ఈ సంవత్సరం మళ్లీ మొదటిసారి గతంలో వలెనే గణేశ్ నిమజ్జనోత్సవాన్ని సామూహికంగా, ఇళ్ల నుంచి బయటకు వచ్చి జరుపుకున్నారు. ఆగస్ట్ 31వ తేదీనే కశ్మీర్ హిందువులు మరొక పండుగ జరుపుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం మూతపడిన బద్గామ్ శారదా భవానీ అమ్మవారి ఆలయాన్ని అదే రోజు తిరిగి తెరిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందువులతో పాటు, స్థానిక ముస్లింలు కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు.మధ్య కశ్మీర్‌లోని ఇచ్‌కూట్ గ్రామంలో ఈ ఆలయం ఉంది. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంతో మూత పడిన ఈ ఆలయంలో ముహూర్తం మేరకు తిరిగి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. పాకిస్తాన్‌లో ఉన్న శారదా మాత ఆలయానికి ఈ ఆలయం శాఖ అని హిందువులు భావిస్తారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను మౌల్వీలు ఎంపిక చేస్తారా?



ఎన్నికలలో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థులను ఆ పార్టీ ఎంపిక సంఘం నిర్ణయిస్తుందా? లేక ముస్లిం మత గురువులా? ముస్లిల ఆధిపత్యం ఉన్నచోట కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎవరు ఉండాలో అధిష్ఠానాన్ని మౌల్వీలే ఆదేశిస్తారని కచ్చితంగా చెప్పే ఆధారం ఒకటి అనుకోకుండా బయటపడింది. అస్సాంలోకి దొడ్డిదారిన చొరబడిన బాంగ్లాదేశీ ముస్లింలు ఎక్కువగా ఉండే జామత్ ఉలేమా ఇ హింద్ (ఏ) సంస్థ అధినేత అర్షద్ మదానీ గతంలో కాంగ్రెస్ నాయకురాలు సోనియాకు రాసిన లేఖలో ఉన్న ఈ మహాసత్యం రాజకీయ దుమారానికి ఆస్కారం ఇచ్చింది. ఆ విషయాన్ని తాజాగా ఒక సమావేశంలో మదానీ స్వయంగా బయటపెట్టాడు. అందుకే అది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదు, ఇస్లామిక్ కాంగ్రెస్ అన్నారు బీజేపీ అధికార ప్రతినిధి. అస్సాం నుంచి 50,000 మంది అక్రమ చొరబాటుదారులను తరిమేశామని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం హఠాత్తుగా వెలుగు చూసింది. "నేను గతంలో సోనియా గాంధీకి ఒక లేఖ రాశాను. ఆర్ఎస్ఎస్ మనస్తత్వం ఉన్న హిమంత బిశ్వశర్మకు కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఇవ్వవద్దని అందులో సూచించాను. ఇప్పుడు చూడండి! ముస్లింలను వేధించడం ద్వారా ఆయన అస్సాంను అగ్నిగుండం చేస్తున్నారు." ఇదీ మదానీ చెప్పినది. దీనిని ఏమనాలి? కాంగ్రెస్‌కీ, ముస్లిం మతోన్మాదులకీ మధ్య ఉన్న సాన్నిహిత్యం దీనితో వెల్లడి కావడం లేదా?

హిమంత బిశ్వశర్మ 2015లోనే బీజేపీలో చేరారు. అంతకు ముందు వరకు ఆయన కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. జలుక్బరి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి 2001లో కాంగ్రెస్ అభ్యర్థిగానే గెలిచారు. 2006, 2011 నాటి ఎన్నికలలో కూడా ఆయనే గెలిచారు. అదే పార్టీ కూడా. తరుణ్ గొగొయ్ మంత్రివర్గంలో కీలక శాఖలు కూడా నిర్వహించారు.

# అయోధ్య మందిరం మీద ధర్మధ్వజం



ఈ సంవత్సరం నవంబర్ 25న అయోధ్యలో జరిగే మరొక భారీ సాంస్కృతిక కార్యక్రమాన్ని జాతి వీక్షించబోతున్నది. నూతన రామమందిరం మీద ఆరోజే ధర్మధ్వజాన్ని ప్రతిష్ఠిస్తారు. ఆ రోజే సీతారాముల వివాహ పంచమి పర్వదినం కావడం విశేషం. ఈ కార్యక్రమం కోసం 10,000 ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావచ్చు. అలాగే ఆర్ఎస్ఎస్ సరసంఘచాలక్ కూడా ఈ కార్యక్రమానికి హాజరు కాబోతున్నారు. ఆలయ ప్రాంగణంలోనే భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. 23వ తేదీన మరొక భారీ కార్యక్రమం ఉంది. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ సభ్యులు విశేషంగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో ధర్మధ్వజానికి పూజ, రామ రక్షాస్తోత్ర సామూహిక పఠనం, ఇంకొన్ని ప్రత్యేక పూజలు, మంత్రోచ్చరణ ఉంటాయి. నవంబర్ 25 ఉదయం 11.45-12.15 మధ్య ధర్మధ్వజాన్ని ఆవిష్కరిస్తారు. ఆ అరగంట కార్యక్రమంలోనే ప్రధాన మందిర బంగారు శిఖరం మీద, మిగిలిన ఆలయాల మీద కూడా ధర్మధ్వజాలను ఆవిష్కరిస్తారు. రామమందిర నిర్మాణం ఈ సంవత్సరం సెప్టెంబర్-అక్టోబర్ మాసాల నాటికి పూర్తి కాగలదని తీర్థక్షేత్ర ట్రస్ట్ చైర్మన్ నృపేంద్ర మిశ్రా గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే.

కానీ కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా బయటకు వచ్చి బీజేపీలో చేరారు (ఇందుకు తమాషా అయిన కారణం చెబుతారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి గురించి రాహుల్ గాంధీతో చర్చించడానికి హిమంత ఢిల్లీ వెళ్లారు. అయితే భృత్యులు మాత్రం ఇప్పుడు వీల్లేదని చెప్పారు. ఎందుకు? ఆయన తన పెంపుడు కుక్కతో ఆడుకుంటున్నారు. డిస్టర్బ్ చేయరాదట. హిమంత అట్నుంచి అటే ఢిల్లీ బీజేపీ ఆఫీసుకు వెళ్లారని అంటారు). మదానీ వ్యాఖ్యల మీద హిమంత చక్కగా స్పందించారు. నన్ను ఇవాళ మదానీ బెదిరించాడు. ఈ పనే గతంలో రాహుల్ కూడా చేశారు. మదానీకి నేను ఒకటే చెప్పదలిచాను. మీరు నన్ను ఎంత బెదిరిస్తే అంతే తీవ్ర స్థాయిలో రాష్ట్ర ప్రజలు మీ మీద పోరాటానికి సిద్ధపడతారని గుర్తుంచుకోండి అన్నారాయన.

ఇప్పుడు ప్రశ్న ఏమిటీ అంటే, కాంగ్రెస్ అభ్యర్థులను మౌల్వీలు ఎంపిక చేస్తారా? నాగరికతకు ప్రతికూలమైన చర్చ దిశగా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నది అన్నారు బీజేపీ ఐటీ సెల్ ప్రతినిధి అమిత్ మాలవీయ. కాంగ్రెస్ అభ్యర్థులను మౌల్వీలు ఎంపిక చేస్తుంటే, ఇక ఆ పార్టీ అభ్యర్థుల ఎంపిక సంఘం పనేమిటని బీజేపీ మరొక అధికార ప్రతినిధి షెహజాదీ పూనావాలా ప్రశ్నించారు. అందుకే ఆ పార్టీ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదని, ఇస్లామిస్ట్ కాంగ్రెస్ అని అన్నారు.

ఏమైనా కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపిక చేయడంలో చిరకాలంగా ముస్లిం సంస్థలతో లోపాయకారి అవగాహన ఉందన్నది చాలా సందర్భాలలోనే రుజువైంది. ఇప్పుడు ఆ మాట మదానీ నోటి నుంచి విన్నాం. 2021, మే నెలలో తన ప్రభుత్వం అధికారం చేపట్టిన నుంచి 160 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న దాదాపు 50,000 మంది చొరబాటుదారులను బయటకు పంపిందని ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించారు. ఈ పని దశల వారీగా అన్ని చోట్ల ఇంకా కొనసాగుతుందని కూడా హెచ్చరించారు. కేవలం మతావేశంతో, ఉద్రికత్త ప్రసంగాలతో వ్యవహరిస్తున్న హిమంతను తక్షణం రాజీనామా చేయించాలని మదానీ తాఖీదు ఇచ్చాడు. ఇందుకు హిమంత సమాధానం వింటే మదానీ వణకిపోక తప్పదు. మదానీ కనుక నాకు దొరికితే (బహుశా బాంగ్లాదేశీయుడన్న ఆధారంతో) ఆయనను కూడా బాంగ్లాదేశ్‌కి పంపేస్తాను. నేను జామాత్‌నే కాదు, ఎవరినీ లెక్క చేయను అన్నారు.

# భగవాధ్వజం మీద బ్రిటన్ ముస్లింల వ్యాఖ్యలు, ఫిర్యాదు



ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ నగరానికి చెందిన కొన్ని హిందూ సంస్థలు ముస్లిం కౌన్సిల్ ఆఫ్ బ్రిటన్ మీద పోలీసులకు ఫిర్యాదు చేశాయి. హిందువులు ఎంతో పవిత్రంగా ఆరాధించే కాషాయ పతాకాన్ని ముస్లిం సంస్థలు ఉగ్రవాద చిహ్నంగా పిలవడమే ఇందుకు కారణం. ముస్లిం కౌన్సిల్ మొత్తం ఇంగ్లండ్‌లో ఉన్న ముస్లింలందరికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. గడచిన వారంలో అక్కడ కొందరు హిందువులు గణేశ్ నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. రెండు కార్లలో వారు వెళ్లారు. వాటికి కాషాయ జెండాలు, భారత జాతీయ పతాకాలు కూడా అలంకరించారు. ఆ కాషాయ జెండా ఉగ్రవాద ప్రతీకలని ముస్లింలు నోరు పారేసుకున్నారు. దేశంలో మతావేశాలకు ముస్లిం సంస్థలు ఆజ్యం పోస్తున్నాయని హిందువులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలలో హిందువులు భాగస్వాములని చెప్పే జరుగుతున్నదని హిందూ సంస్థలు ఆరోపిస్తున్నాయి. కాషాయధ్వజం గురించి ముస్లిం వర్గాలు చేస్తున్న ప్రచారం అవాస్తవమైనది, అసత్యమైనది, వర్గాల మధ్య ఉద్రిక్తతలు లేవనెత్తేది, హిందువులను దోషులుగా నిలబెట్టే కుట్రతో చేస్తున్నదని, కాషాయ పతాకం తమ ధర్మంలో ఎంతో పవిత్ర చిహ్నమని లీసెస్టర్‌లోని 40 హిందూ సంస్థలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఇంగ్లండ్‌లోని మిగిలిన వర్గాల మధ్య తమను అగౌరవ పరచడానికి, వర్గాల మధ్య ఘర్షణ తేవడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. శతాబ్దాలుగా హిందూ సమాజం కాషాయ జెండాను పరమ పవిత్రంగా భావిస్తున్నదని, అది త్యాగానికీ, ధైర్యానికీ, సత్యానికి ప్రతీక అని, అలాంటి జెండాను ఉగ్రవాద చిహ్నంగా వ్యాఖ్యానించడం అసందర్భమే కాకుండా, ఇంగ్లండ్ చట్టాలు ఇస్తున్న మతస్వేచ్ఛకు కూడా విరుద్ధమని హిందూ కమ్యూనిటీ ఆర్గనైజేషన్స్ గ్రూప్ కన్వీనర్ వినోద్ పోపట్ అన్నారు. ★

## కథ

"వ్యాపార వర్గాల్లో ఇదో సాధారణమైన వార్త... కానీ... అంత అవసరమేమొచ్చింది నవీన్‌కి..." డాక్టర్ రంగనాథం నాతో అన్నాడు.

"కనుక్కుంటాను కానీ వాడి పరిస్థితి ఏమిటి..." అన్నాను నేను గాబరాగా రంగనాథంతో...

"ఇబ్బంది ఏమీ లేదు.. అతను చాలా కాలిక్యులేటెడ్. ఆత్మహత్యాయత్నంలో కూడా" అన్నాడు నవ్వుతూ.

డాక్టర్స్‌కి ఇవన్నీ సహజమే నేను వాడి పక్కన కుర్చీలో కూర్చున్నాను.. నిశ్శబ్దంగా డాక్టర్ ఇచ్చిన మందుల ప్రభావంతో మెల్లగా కళ్లు తెరిచాడు.. అతని ముఖంలో గూడు కట్టుకున్న విషాదపు నీడ...

"తాగండి అన్నయ్యగారు" అంది నిర్మల కప్పుతో కాఫీ అందిస్తూ..

మెల్లగా వేడివేడి కాఫీ తాగుతూ.. చల్లని ఏ.సి. గది వాతావరణంలో కాస్త రిలాక్సయ్యాను.. వార్త నిర్మల ఫోన్లో చెప్పగానే... బెంగళూరు నుంచి విశాఖ పరిగెత్తుకు వచ్చాను..

"అసలేమీ జరిగిందమ్మా" అన్నాను నిర్మల వైపు చూసి. ఆమె ముఖంలో నిర్లిప్తత... విషాదం. ఎప్పుడూ నవ్విస్తూ సరదాగా, ఏభై ఏళ్ల వయసులో కూడా... నలభై ఏళ్ల దానిలా తిరిగే నిర్మల... ఓ విషాదమూర్తిలా.

''ఏమి చెప్పనన్నయ్య...వ్యాపారంలో నష్టం..అప్పులు...మీకు తెలియనిదేముంది...!" అంది దుఃఖిస్తూ.. వస్తున్న కన్నీటిని చీర చెంగుతో తుడుచుకుంటూ..

నిర్మల... నిజమైన భార్య... ఆమె నా మిత్రుడిని పాడిస్తుంది.. నవ్విస్తుంది.. ఒంటరితనాన్ని పోగొడుతుంది. వర్షపు చినుకుల శబ్దాన్ని కలిసి వినిపిస్తుంది.. అన్నింటికన్నా ముఖ్యంగా అతనికి బతకడం నేర్పింది...ఆమెను అలా ఎలా చూడటం... నా మిత్రుడు మెల్లగా... పూర్తిగా కళ్లు తెరిచాడు. భార్య వంక , నా వైపు చూసాడు.. అతడి ముఖంలో నెర్వెస్ నెస్.. ఏదో చెప్పాలనుకున్నాడు.. "వద్దులే తర్వాత మాట్లాడదాం.." అన్నాను నేను..

ఆమె కాఫీ కప్పులో పోసి, పక్కన కూర్చుని నెమ్మదిగా తాగించింది. అతని ముఖంలో ఇప్పుడు కాస్త ప్రశాంతత... ఏం తిన్నాం, ఏం చూశాం అన్నది ముఖ్యం కాదు.. మనసు విప్పి ఏం చెప్పుకున్నాం అనేది ముఖ్యం.. భార్యాభర్తలు "మా..ట్లా..డు..కున్నారు" నిశ్శబ్దంగా మనసుతో..

* * *

రాత్రి ఎనిమిది గంటల సమయం... ఆసుపత్రి గది... నిర్మలను ఇంటికి పంపించాను.. రేవతి.. నా భార్యకి ఫోన్ చేశాను. రమ్మన్నాను. తను వస్తే నిర్మలకి తోడుగా ఉంటుంది. నేను వెళ్లి ఫ్రెషయి రావచ్చు.

నాకు... నా మిత్రుడు గోపాలానికి నాలుగు దశాబ్దాలకు పైగా స్నేహముంది. ఒకరినొకరు అన్నదమ్ములు లాగానే ఉంటాం. తిండికి లేని దశ నుంచి శ్రమించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగాం. నాకు ఒక కొడుకు, కూతురు. పెళ్లిళ్లు అయిపోయాయి. అమెరికాలో సెటిల్ అయ్యారు. నాకు 'అల్యూమినియం' ప్రాసెసింగ్ యూనిట్లు హైదరాబాదు, చిత్తూరు, బెంగళూరులో ఉన్నాయి. కన్‌స్ట్రక్షన్స్ రంగంలో మా బాబు, అమ్మాయి ఉన్నారు. వారు జేఎన్టీయూలో ఎం.టెక్ చేశారు. అలాగని జీవితమంతా సంతోషం అనుకునేరు. నా కష్టాలు నాకున్నాయి. నా మిత్రుడు గోపాలానికి ఆస్తులున్నాయి. కాకపోతే అతనికి ఇద్దరు కొడుకులున్నారు. ఆస్తి వారికి పంచేసి, ఇల్లు, కారు, బతకడానికి కావలసిన ఆస్తి ఉంచుకున్నాడు. వారు ఆస్తులను పెంచుకొనే క్రమంలో స్నేహితుల మాటలు నమ్మి, తండ్రికున్న కెమికల్ ఫ్యాక్టరీ యూనిట్లను విస్తరించాలనుకొని నష్టాల పాలయ్యారు. అప్పులు పెంచేశారు. ఆస్తులు కరిగించేశారు. ఫ్యాక్టరీల పైన చేసిన అప్పులు, తీసుకున్న రుణాలు ఇప్పుడు గోపాలానికి మిగిల్చి కుటుంబాలతో జారిపోయారు.. పాపం గోపాలం..

కథంటే కావలసిన చోట ఆనందాన్ని అతికించవచ్చు. వద్దంటే విషాదాన్ని తీసేయవచ్చు. జీవితం అలా కాదు కదా. కానీ.. దుఃఖాలను దాటి.. మౌనంగా ఏడున్నర పదుల వయసులో నవ్వుతూ ఛాట్ బండి నడుపుకునే దంపతులు నాకు తెలుసు. వారే.. సుబ్బయ్య దంపతులు. వైజాగ్ రామకృష్ణ బీచ్‌లో రోజు సాయంత్రం ఆరు నుంచి రాత్రి పది వరకు మాత్రమే ఉంటారు. పగటిపూట తన రెండు గదులు ఇంటి ముందు డెయిరీ పాల ప్యాకెట్స్, పేపర్స్ అమ్ముతారు. మూడు వందల అరవై అయిదు రోజులు వారి ముఖంలో నవ్వు, సంతృప్తి . ఇప్పటికీ నాకశ్చర్యమే... పేదరికం ప్రశాంతతనిస్తుందా...? వారి గురించి మా గోపాలానికి చెప్పాలి... కాదు.. చాలామంది గోపాలానికి తెలియాలి..

డోర్ బెల్ రింగయింది... నర్స్.. వచ్చి.. పల్స్, టెంపరేచర్ వగైరాలు చూసి వెళ్లింది. మళ్లీ నా ఆలోచనలు నా దగ్గరకు వచ్చాయి.

కిటికీలో నుంచి సముద్రం.. నల్లగా.. "అప్పుడప్పుడు సముద్రం శిఖరాల మీద నిలబడుతుంది. రోజుల తరబడి తీరపు గవ్వలని సైతం కదిలించదు" యండమూరి వారి అనువాదం గుర్తుకు వచ్చింది..

"ఊ...ఊ..." వెనకనుంచి మా వాడి మూలుగు.. కుర్చీ వెనుకకు జరిపి.. వాడి మంచానికి దగ్గరగా



# వెన్నెలకి ఆవల...

భమిడిపాటి గౌరీశంకర్



వేశాను.. వాడు నా చేతిని తన చేతిలోకి తీసుకొని... 'నా కొడుకులు నాకన్యాయం చేశార్రా.. నాకు చావు తప్ప నీవూ గుర్తుకు రాలేదు.. క్షమించు' అన్నాడు.. అతడి కంటి నిండా నీరు..

''ఏడవకు... జీవితానికి కామాలే కానీ ఫులుస్టాఫ్‌లు ఉండవు. మరణమే చివరిది.. నువ్వు దానిని కాస్త ముందు పేజీల్లోకి తెద్దామనుకున్నావు. కానీ.. ఓడిపోయావు. ఒక్కటి గమనించు పిల్లలు మన స్థిరాస్తి కాదు. వారి జీవనం కోసమే జీవిస్తున్న ప్రాణులు వారు. మీతోనే జీవిస్తున్నా, వారు మీ సొంతం కాదు. ఇది నేను చెప్పిన మాటలు కాదు. ఖలీల్ జిబ్రాన్ తన ప్రాఫిట్ లో చెప్పినవి. ఇవి నాకూ వర్తిస్తాయి. ఊరడిల్లు.. ఎక్కడి నుంచి ఇక్కడ వరకు వచ్చాము గుర్తుకు తెచ్చుకో.. నేనున్నాగా.. సర్దుకుందాం సరేనా... హ్యాపీగా ఉండు.. నీ వ్యవహారాలు తేల్చిన తర్వాతనే నేను తిరిగి వెళ్తాను.. డోంట్ వర్రీ..'' అన్నాను. భరోసాగా.. కానీ.. నిజంగా నేను చేయగలనని కాదు.. ఓ స్నేహితునిగా అతనికో మానసిక భరోసా అవసరమయ్యే సమయమిది.. స్నేహమంటే దుఃఖ సమయంలో ఆనందాన్ని ఇవ్వడం ఆనంద క్షణాలను సమంగా పంచుకోవటం.

సమయం రాత్రి 9 గంటలు. రేవతి, నిర్మల కలిసి వచ్చారు. ఆడవారు అయస్కాంతం లాంటివారు.. ఎక్కడున్నా చటుక్కున కలుసుకుంటారు.. నాకు నవ్వు వచ్చింది..''ఎందుకు నవ్వుతున్నారు.. ఇది నవ్వే సమయమా.. సందర్భమా..!!'' అంది రేవతి ఎవరూ చూడకుండా డొక్కలో పొడిచి. గోపాలం చూశాడని నాకు, రేవతికి కూడా తెలుసు. ఇటువంటి సమయంలో రోగి చుట్టూ ఉన్న వాతావరణాన్ని సాధ్యమయినంతగా తేలిక పరచాలి. నిర్మల అతని పక్కన కూర్చోని చపాతిని ముక్కలుగా చేసి, కూరలో ముంచి తినిపిస్తున్నది. కానీ.. "ఒకరి కోసం మరొకరు జన్మించి జతగానే జీవించి, జీవితపు పుట్టల్ని మృత్యువు చించేస్తున్నా చివర వరకు జతగా అధ్యయనం చేయడం వివాహం. సాహో ఖలీల్ జిబ్రాన్.. వారిని అలా చూస్తుంటే నాకు గుర్తుకు వచ్చింది.

మరో అరగంటలో డాక్టర్ రౌండ్స్‌కు వచ్చారు.''ఓ రెండు రోజుల్లో డిస్చార్జ్ చేసేద్దాం..''అన్నాడు.

'థాంక్యూ డాక్టర్' అన్నాను..

''ఎందుకు... బిల్లు తగ్గినందుకా...'' అన్నాడు డాక్టర్..

మేమిద్దరం.. రాత్రుళ్లు.. తరచుగా.. విశాఖలో ఉంటే కలుస్తుంటాం.. జతగా ''ఊగుతుంటాం''... ''బాకీ మీరు వదలరుగా'' అన్నాను నర్మగర్భంగా.. నవ్వుతూ...

''మీరు మారలేదు. గుడ్‌నైట్'' అనేసి వెళ్లిపోయాడు..

నేను గోపాలం మంచం దగ్గరకు వచ్చి.. ''డాక్టర్ మాటలు విన్నావుగా..'' అన్నాను..

''నువ్వు డాక్టర్‌తో అన్న మాటలు కూడా'' అన్నాడు సన్నగా నవ్వుతూ.. ''మీరు రాగానే ఆయనకు నవ్వు కూడా వచ్చిందన్నయ్యా'' అంది నిర్మల.. ''కాదమ్మా.. నీ నిశ్శబ్ద ఓదార్పు వలన'' అన్నాను.

''ఏంటో ఈయన వ్యాపారం లాగే మాటలు కూడా అర్థం కావు'' అంది రేవతి వెటకారం నటిస్తూ..

అందరం సన్నగా నవ్వుకొని... ఇద్దరు తెచ్చిన ఆహార పదార్థాలను తినేసాం.. ''ఒక్క మాట గోపాలం.. మనం ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారి కోటేశ్వరరావు గారిని కలుద్దాం.. ఓ.కే.నా..''

''కోటేశ్వరరావు ఇంకా ఉన్నారా... ఆయన ఆత్మహత్య చేసుకున్నారని. ఐ.పీ. పెట్టేసారని విన్నాను.. విశాఖలోనే ఆయన ఉన్నారా..'' అన్నాడు ఆశ్చర్యంగా...

''సంతోషంగా ఉన్నారు.. చూపిస్తాను.. సరేనా...'' అన్నాను..

* * *

రెండు రోజుల తరువాత గోపాలం ఆసుపత్రి నుంచి డిశ్చార్జై ఇంటికి వచ్చేసాడు. ఈ లోగా నేను పోలీసులు, లాయర్లు, బ్యాంకులు, అప్పుల వాళ్లతో

మాట్లాడి ఉంచాను. ఒక నెల రోజులలోపు అన్ని సెటిల్ చేస్తానని చెప్పాను. గోపాలం కాకపోతే నేను బాధ్యత వహిస్తానని వారికి చెప్పాను. నా ఆర్థికస్థితి వారందరికీ తెలుసు కనుక ఒప్పుకున్నారు. బేసిగ్గా 'మనిషి' అంతో ఇంతో మానవత్వం, జాలి, దయ, సానుభూతి వంటి వాటితో కలిసి ఉంటాడు. కాకపోతే వాదనలతో ముందుకు వెళితే 'ఈగో' తిరగ బడుతుంది. మానవ సంబంధాలు ఈ పాయింట్ దగ్గర దెబ్బతింటున్నాయి.

నాలుగు రోజులు అనంతరం...పరిస్థితులు మెల్లగా సర్దుకోసాగాయి. గోపాలం పిల్లలు కూడా ఫోన్లో మాట్లాడేరు. ముందు అతను కోపగించుకున్నాడు. కానీ.. నేను సర్ది చెప్పిన తర్వాత "దయచేసి మీరు మరి మా ఇద్దరి జీవితాల్లోకి రాకండి. మీరు నేర్పిన పాఠం గొప్పది" అని సరిపెట్టాడు. నిర్మల నిర్లిప్తంగా ఉండిపోయింది.

''మనం ఒకసారి కోటేశ్వరరావు గారిని కలుద్దామా" అన్నాడు. ఓ రోజు గోపాలం.. "సరే.. సాయంత్రం ఆరుకు వస్తాను. వెళదాం" అన్నాను..

కారు రామకృష్ణ బీచ్ దిశగా నడుపుతున్నాను. గోపాలం ఏదో ఆలోచనలో ఉన్నాడు.. మెల్లగా రామకృష్ణ మఠం ఆలయం ఎదురుగా... సముద్రం చూస్తూ ఆపాను. వాతావరణం మబ్బుపట్టి ఉంది. వీకెండ్ కాదు.. జనం పల్చగా ఉన్నారు. కారులో నుంచి ఇద్దరం దిగాం. గట్టుమీద యువతీయువకులు జంటలు జంటలుగా 'దగ్గరగా' కూర్చుని.. ఈ ప్రపంచం మొత్తం 'మనిద్దరమే' అన్నంతగా ఉన్నారు.. నాకు నవ్వొచ్చింది.. బహుశా వారికి పెళ్లి కాలేదనుకుంటా. ఇంకా ప్రేమికులే..

"ఏంటి ఇక్కడ కారాపావు. అసలు ఈ దారిలో కోటేశ్వరరావు గారి మేడ లేదుగా.." గోపాలరావు అనుమానం.

"ఆయన పని అయితేగాని ఫ్రీకారని తెలిసింది. ఈలోగా... ఇక్కడ సుబ్బయ్య అనే ముసలాయన ఛాట్ బండి పెట్టారు. పదిహేను రూపాయలే.. దా.. తిందాం" అన్నాను..

ఇద్దరం... సుబ్బయ్య ఛాట్ బండి దగ్గరకు వెళ్లాం. అక్కడ చాంతాడంత క్యూ ఉంది.. ముసలి, ముతక, పిల్లలు అందరూ ఉన్నారు. కానీ.. సుబ్బయ్య మంచాయన.. పెద్దవారికి వేగంగా ఇస్తున్నాడు. అతని భార్య కూడా ఏ మాత్రం విసుగు, చిరాకు లేకుండా ఆడవారికి, పిల్లలకు అందిస్తున్నారు.. ఏడున్నర పదుల పైగా వయసులోనూ వంగని విల్లులా 'స్టిఫ్' గా ఉన్నారు. కాలం నేర్పిన పాఠాలు.. జీవితం చెప్పిన జ్ఞాపకాలు కారకాలై ఉండవచ్చు... వారిని నిటారుగా ఉంచాయి. గోపాలం.. రెండు చాట్‌లు అడిగాడు. 30 రూపాయలు ఇచ్చాడు. సుబ్బయ్య ముఖంలో నవ్వు... అతన్ని ఆకర్షించింది.కొద్దిసేపు ఆలోచనలో పడేసింది..

"తీసుకున్నావా.." అన్నాను గోపాలం దగ్గరకు వెళ్లి

'ఏం బాబు గారు బాగున్నారా'' అన్నాడు సుబ్బయ్య.

"అయ్యో.. నేను మీ కన్నా అన్నింటా చిన్నవాడిని.. నన్ను బాబుగారు అని పిలవద్దు'' అన్నాను సుబ్బయ్యతో...

"మీరు కస్టమర్.. దేవునితో సమానం అలానే పిలుస్తాను" అన్నాడు సుబ్బయ్య... నవ్వుతూ

"చాట్ బండివాడితో గౌరవ మర్యాదల చర్చ అవసరమా...?మనం డబ్బులిస్తాం.. అతడు సరుకిస్తాడు అంతే.." గోపాల ముఖంలో అసహనం

నేను నవ్వి ఊరుకున్నాను... ఒకసారి సుబ్బయ్య కథ తెలుసుకుందాం అనుకున్నాను.వెళ్లి అడిగాను.. వాడిది నీ వంటి కథే... అంటే పిల్లలు వదిలించు కున్నారు". పూర్వాశ్రమంలో సుబ్బయ్య కూడా బాగా డబ్బున్న వాడేనట. కానీ.. పిల్లలను నమ్మి వారి పేరున ఆస్తి రాసి, వారిచే ఇంటి నుంచి గెంటి వేయబడ్డారు ఆ ముసలి దంపతులు. ఒకసారి ఆయనే నాకు చెప్పాడు" పిల్లల్ని ప్రేమించే ప్రయత్నం తప్పు కాదు. వారు తిరిగి ప్రేమను ఇవ్వాలన్న నిబంధనే మహా పాపమని" ఇది కూడా ఆయన ఎక్కడో చదివినదేనట. అవమానం, ఆకలి, వేదన, నిస్సహాయత, దుఃఖం– ఇవన్నీ సోపానాలు దిగితే కిందకు వెళతాం. ఎక్కితే పైకి వెళతాం. సుబ్బయ్య ఎక్కిన మనిషి.

"ఏంటి చాట్ బండి నడుపుకుంటూనా మీదికి ఎక్కిన మనిషి" గోపాలం గొంతులో చిన్నచూపు.

''నీకో విషయం చెప్పనా.. సమస్యల్ని చిరునవ్వుతో సాధించిన వాడే తన లక్ష్యాన్ని చేరుకుంటాడు. సుబ్బయ్య కథలో నీతి అదే.. చంద్రుని వెన్నెల ఆవల విపరీతమైన ఎండ ఉంటుందని ఈ మధ్య శాస్త్రజ్ఞులు అంటున్నారు. కానీ.. మనకు 'శశి' చల్లదనమే కావాలి..

చాట్ పూర్తయింది.. కప్పులు పారేశాం.. గట్ల మీద కూర్చున్న జంటలు మెల్లగా చీకటి ప్రదేశాలలో సర్దుకుంటున్నారు. "పద సమయం తొమ్మిది కావస్తున్నది.. వెళదాం.. మరో నాలుగయిదు రోజులలో ఇవన్నీ సర్దుకుంటాయి. పూర్వపు జీవితం కావాలనుకోకు. భయం వదిలి... కొత్త జీవితం ప్రారంభించు.. సుబ్బయ్యలా" అన్నాను నవ్వుతూ... అతడు నవ్వాడు. ఇద్దరం కారెక్కాం. నేను స్టార్ట్ చేసాను.

"నేను కూడా బెంగుళూరు వెళ్లాలి. రేవతి కూడా తొందర పెడుతున్నది.. మరో రెండు రోజులు ఉండగలను.. అంతే" అన్నాను.

"పోనీ ఈ రెండు రోజులు మా ఇంట్లోనే ఉండవచ్చు కదా నీవు, రేవతి" గోపాలం అర్థింపు.

"మా బావమరిది ఇక్కడ ఉన్నాడని నీకు తెలుసుగా.. రేపు అంతా నీతోనే ఉంటాను సరా" అన్నాను వాడిని ఊరడిస్తూ..

వాడింటి దగ్గర వాడు దిగాడు... లోపలికెళు తున్న వాడు ఆగి...

''అవును కోటేశ్వరరావు గారి దగ్గరకు వెళదామన్నావు. నాకు ఆయనను చూడాలని ఉంది.. పోనీ రేపు వెళదామా..." అన్నాడు.

"ఎందుకు రేపు ... చూపించాను కదా" అన్నాను సీరియస్‌గా

"ఎవరిని.. ఆ చాట్ బండి సుబ్బయ్యనా?"

''అతని అసలు పేరు కోటేశ్వరరావు. ఇండస్ట్రియలిస్టు".. నేను కారును ముందుకురికించాను.




వచ్చేవారం కథ..

**వయసుమళ్లిన వలపు**

– పెనుమాక నాగేశ్వరరావు





# దేశవాళీ క్రీడకు కొత్త హంగులు!

**దక్షిణాసియా దేశాల గ్రామీణ క్రీడ కబడ్డీ సరికొత్త హంగులతో ప్రపంచస్థాయికి విస్తరిస్తోంది. 12వ సీజన్ ప్రో– కబడ్డీ లీగ్‌తో మరింతమంది అభిమానులను సంపాదించుకోడానికి ముందుకు వచ్చింది.**

జనాభాపరంగా ప్రపంచంలోనే అతిపెద్ద దేశం భారత్‌లో క్రికెట్ తరువాత అత్యధిక జనాదరణ పొందుతున్నది ఏదంటే గ్రామీణ క్రీడ కబడ్డీ అన్న సమాధానమే వస్తుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) స్థాయిలోనే గత 11 సీజన్లుగా కోట్లాది మందిని అలరిస్తూ వచ్చిన ప్రో– కబడ్డీ లీగ్ సైతం విజయవంతంగా 12వ సీజన్ లోకి ప్రవేశించింది.

తెలుగు రాష్ట్రాల ప్రజల ఉక్కునగరం విశాఖ పట్నం వేదికగా 2025 సీజన్ లీగ్ పోటీలకు తెరలేచింది. అయితే, గత 11 సీజన్ల పోటీలకు భిన్నంగా ప్రస్తుత 12వ సీజన్ పోటీలను సరికొత్త హంగులతో నిర్వహిస్తున్నారు.

**'టై' మ్యాచ్‌లకు ఇక స్వస్తి!**

మొత్తం 12 ( తెలుగు టైటాన్స్, హరియాణా స్టీల్స్, జైపూర్ పింక్ పాంథర్స్, పూణే పల్టాన్, తమిళ్ తలైవాస్, బెంగాల్ వారియర్స్, గుజరాత్ జెయింట్స్, బెంగళూరు బుల్స్, దబంగ్ ఢిల్లీ, యూపీ యోధాస్, పట్నా పైరేట్స్, యూ ముంబై )జట్లు తలపడుతున్న ఈ లీగ్ కమ్ నాకౌట్ సమరాన్ని దేశంలోని ఐదు వేదికల్లో అక్టోబర్ 23 వరకూ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీలు మరింత పట్టుగా, ఆకర్షణీయంగా ఉండేలా నిర్వాహక సంఘం పలు సరికొత్త నిబంధనలను ఈ సీజన్ నుంచే అమలు చేస్తోంది. సమానబలం కలిగిన రెండుజట్లు తలపడిన సమయంలో స్కోర్లు సమం కావడంతో టై లేదా డ్రాగా ముగిసే మ్యాచ్‌లకు స్వస్తి పలకడం కోసం సరికొత్తగా 'గోల్డెన్ రైడ్' నిబంధనను అమలు చేస్తోంది.

ఒకవేళ మ్యాచ్ టైగా ముగిస్తే విజేతను నిర్ణయించడానికి గోల్డెన్ రైడ్ నిబంధన ప్రకారం రెండుజట్లకు చెరో ఐదు రైడింగ్ అవకాశాలను ఇస్తారు. ఇందులోనూ సమఉజ్జీలుగా నిలిచినా తుది ఫలితం తేలే వరకూ ఈ నిబంధన కొనసాగిస్తారు.

**8 జట్లకు టైటిల్ రౌండ్ అవకాశం**

లీగ్ దశ పోటీలను నాలుగు అంచెలుగా నిర్వహిస్తారు. విశాఖలో ఏడేళ్ల విరామం తరువాత తొలి అంచె పోటీలను నిర్వహిస్తున్నారు. ఆగస్టు 29న ప్రారంభమైన విశాఖ అంచెపోటీలు సెప్టెంబర్ 11 వరకూ జరుగుతాయి. ఆ తర్వాతి అంచెకు జైపూర్ నగరం ఆతిథ్యమిస్తుంది. సెప్టెంబర్ 12 నుంచి 25 వరకూ రెండో అంచె, సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 10 వరకూ చెన్నై నగరంలో మూడో అంచె, అక్టోబర్ 11 నుంచి 23 వరకూ న్యూఢిల్లీలో ఆఖరి అంచెతో పాటు ప్లే ఆఫ్ రౌండ్ మ్యాచ్‌లు సైతం నిర్వహిస్తారు. లీగ్‌లో తలపడుతున్న మొత్తం 12 జట్లలో మొదటి ఎనిమిదిస్థానాలలో నిలిచిన జట్లకు టైటిల్ రౌండ్ చేరే అవకాశాన్ని కల్పించారు.

**మొదటి రెండుజట్లకు భలే చాన్స్**

లీగ్ దశలో అత్యధికపాయింట్లతో మొదటి రెండు స్థానాలలోనిలిచిన జట్లు ఫైనల్లో చోటు కోసం జరిగే క్వాలిఫైయర్–1 రౌండ్లో తలపడతాయి. ఈ పోరులో నెగ్గినజట్టు నేరుగా ఫైనల్ చేరుతుంది. ఓడిన జట్టు క్వాలిఫైయర్–2 రౌండ్లో తలపడనుంది.

ఎలిమినేటర్ రౌండ్ పోటీలలో 7, 8 స్థానాలలో నిలిచిన జట్లు, 5, 6 స్థానాలలో నిలిచిన జట్లు, 3, 4 స్థానాలలో నిలిచినజట్లు తలపడతాయి. ఈ ఆరుజట్ల నుంచి ఒక్కజట్టుకు మాత్రమే క్వాలిఫైయర్ –2 రౌండ్ చేరే అవకాశం ఉంటుంది.

**కబడ్డీ క్రీడాకారులకూ కోట్లే కోట్లు...!**

ఐపీఎల్ తరహాలోనే ప్రో–కబడ్డీలీగ్‌లో సైతం ఆటగాళ్ల కోసం వేలం నిర్వహిస్తూ వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన పలువురు క్రీడాకారులు ఒక్క సీజన్ వేలంతోనే కోటీశ్వరులుగా మారిపోతున్నారు. 2023 సీజన్ వేలంలో సూపర్ రైడర్ పవన్ షెరావత్‌కు 2 కోట్ల 60 లక్షల రూపాయల ధర పలకడం చూస్తే అవునా! నిజమేనా! అనుకోక తప్పదు మరి. ఇరాన్ సూపర్ స్టార్ ప్లేయర్లు మహ్మద్ రెజాకు అత్యధికంగా 2 కోట్ల 35 లక్షల రూపాయల ధర పలికింది. అత్యధిక వేలం ధర సంపాదించిన విదేశీ ఆటగాళ్లలో మహ్మద్ రెజా అగ్రస్థానంలో నిలిచాడు. పవన్ షెరావత్‌తో పాటు మొత్తం ఐదుగురు ఆటగాళ్లకు కోటి రూపాయలకు పైగా వేలం ధర దక్కడం విశేషం. ఇరానీ డిఫెండర్ కమ్ సూపర్ క్యాచర్ ఫజల్ అట్రాచలీని కోటీ 60 లక్షల రూపాయలకు గుజరాత్ జెయింట్స్ సొంతం చేసుకొంది. మనిందర్ సింగ్, సిద్ధార్థ దేశాయ్‌లు సైతం కోటిరూపాయలు ధర మించిన ఆటగాళ్లలో ఉన్నారు. కబడ్డీ లీగ్‌తో గ్రామీణ క్రీడకు ప్రపంచస్థాయి గుర్తింపు రావడమే కాదు, పల్లె ప్రాంతాలకు చెందిన పలువురు ప్రతిభావంతులైన క్రీడాకారులు లక్షాధికారులు, కోటీశ్వరులు కావడం అభినంద నీయం. వందలకోట్లతో సాగే ఐపీఎల్‌కు ప్రో–కబడ్డీ లీగ్ ప్రత్యామ్నాయంగా ఎదగాలని కోరుకొందాం.



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# భాగ్యనగర్‌లో సంచార, అర్ధ సంచార జాతుల దినోత్సవం






**తా**ను సంచార జాతి కులంలో జన్మించానని, భిక్ష మెత్తుతూనే 8వ తరగతి వరకు, ఆపై ఉన్నత విద్య అభ్యసించానని, ఒక ప్రైవేటు విద్యాసంస్థకు ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నానని సంచార, అర్ధసంచార, విముక్త జాతుల దినోత్సవానికి గౌరవ అతిథిగా విచ్చేసిన భట్కే విముక్త సంఘం వ్యవస్థాపక చైర్ పర్సన్ (మహారాష్ట్ర) సువర్ణ రావల్ అన్నారు. సంచార, అర్ధసంచార, విముక్తజాతుల దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 31న ఉస్మానియా విశ్వ విద్యాలయం రామిరెడ్డి దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆమె గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఆమె ప్రసంగిస్తూ విద్యకు, ఉపాధికి దూరమైన జాతుల గురించి యోజనబద్ధమైన ప్రాజెక్టును తయారుచేసి మహారాష్ట్రలో అమలుచేశామని, సమాజంలో తగిన గౌరవం, ఉపాధి కలిగించే ప్రయత్నం చేశామని, దానిలో సఫలీకృతమైనామని తెలియజేశారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు డా॥ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత సంచార జాతులు ఉపాధి అవకాశాలు, సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు రూపొందించారని, వారి అభివృద్ధికోసం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించడం, సంచార జాతుల బోర్డు కూడా ఏర్పాటయిందని, రానున్న 10 సంవత్సరాలలో ఆర్థిక, సామాజిక, రాజకీయ వికాసానికి మరిన్ని పథకాలు రూపొందిస్తున్నారని, రాజ్యాంగ ఫలాలు వారికందేటట్లు ప్రయత్నం జరుగుతుందని అన్నారు.

హిందూధర్మపరిరక్షణసమితి ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డా॥ దాసరి శ్రీనివాసులు (రిటైర్డ్ ఐఏఎస్) మాట్లాడుతూ సంచార జీవితాలను ప్రత్యక్షంగా పరిశీలించిన తరువాత సంచార జాతుల విద్యార్థుల కోసం సంచారి అనే పేరుతో సామాజిక సేవాసంస్థను ప్రారంభించామని తెలియజేశారు. ముఖ్యవక్త దక్షిణ మధ్య క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ ప్రసంగిస్తూ ప్రభుత్వమే కాకుండా సమాజంలోని హితైషులు, విద్యావంతుల కృషితో సంచారజాతుల అభివృద్ధికి యోజనచేయాలని కోరారు.

సంచారజాతులలోని 24 కులాల ప్రాముఖ్యం, చరిత్ర, వారి సంస్కృతి వివరించే పుస్తకాన్ని అఖిల భారత కళా విభాగం ప్రముఖులు అప్పాల ప్రసాద్ సంకలనం చేయగా, డా॥ కె.లక్ష్మణ్ ఆవిష్కరించారు.

సిరిప్రగడ రాజేందర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంచార అభివృద్ధి మండలి అధ్యక్షుడు పీటల స్వర్ణకుమార్, సంచార జాతుల సంఘం అధ్యక్షులు పి. శ్రీనివాస్, సంచార అభివృద్ధి మండలి కార్యదర్శి మిట్టపల్లి చిరంజీవి పాల్గొన్నారు. ప్రారంభంలో సంచార జాతుల కళాకారులతో బుర్రకథ, హరికథ వంటి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో నెరేడ్‌మెట్‌లో ఉన్న సంచార జాతుల విద్యార్థుల ఆవాసభవనం, అలాగే పెద్ద అంబర్‌పేటలోని సంచార జాతుల నివాస భవనం గురించీ తెలియజేశారు. తెలంగాణ ప్రాంతం లోని అన్ని సంచార జాతుల కులాలతో పాటు 180 మంది పురప్రముఖులు పాల్గొన్నారు.

## గోపూజతో పర్యావరణ పరిరక్షణ



**దేవరకొండ :** గోపూజ దేవతా పూజతో సమానమనే భావాన్ని ఆచరణరూపంలో తీసుకుని రావడం ద్వారా పర్యావరణాన్ని రక్షించడానికి నల్గొండ జిల్లా, దేవరకొండ హిందూ ఉత్సవ సమితి ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగా గణేశ్ నవరాత్రులలో దేవరకొండలోని గాంధీనగర్ ఈశ్వరపుత్ర యూత్ అసోసియేషన్ గణేశ మంటపం ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమాన్ని ఆగస్ట్ 29న నిర్వహించారు. వందమంది మాతృమూర్తులు గోమాతను పూజించి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు తాడిశెట్టి సుదర్శన్, సమితి అధ్యక్షుడు బిలిమిదె శ్రీనివాస్, ఈశ్వరపుత్రయూత్ అసోసియేషన్ గణేశ మంటపం కార్యదర్శి గంజి వంశీలతోపాటు 200 మంది మహిళలు, పురప్రముఖులు పాల్గొన్నారు.

# పోస్టల్ శాఖ బీమా సౌకర్యం వినియోగించుకోవాలి

## పోస్ట్‌మన్‌ల సన్మాన సభలో హెడ్ పోస్ట్‌మాస్టర్ అనిల్‌కుమార్

**నెల్లూరు:** ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం తపాలా కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య బీమా పథకాలు గురించి నెల్లూరు నగర హెడ్ పోస్టుమాస్టర్ అనిల్ కుమార్ తెలియజేశారు.

జాగృతి వారపత్రిక 77వ వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు రాణా ప్రతాప్ సెంటర్ చిన్న బజార్ గణేశ్ మంటపంలో ఆగష్టు 29న జరిగిన పోస్ట్‌మెన్‌ల సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అనిల్‌కుమార్ పాల్గొన్నారు. 500 రూపాయలకే పది లక్షల రూపాయల బీమా పథకాన్ని, అలాగే 600 రూపాయలకే రూ. 15లక్షల బీమా పథకం గురించి వారు తెలియజేశారు.

ముఖ్యవక్తగా పాల్గొన్న నెల్లూరు విభాగ్ ప్రచారక్ నవీన్ మాట్లాడుతూ దేశం విశ్వగురు స్థాయికి వెళ్లాలంటే ప్రతి ఒక్కరు దేశభక్తిని అలవరచుకోవాలని, పోస్ట్‌మెన్‌లు చేస్తున్నది సామాజిక కార్యక్రమమేనని, జాగృతి వంటి దేశభక్తి ప్రబోధించే పత్రికను పంచడం కూడా దేశభక్తేనని అన్నారు. ఈ పత్రికను సకాలంలో పాఠకులకు అందించడంలో పోస్ట్‌మెన్‌ల



సహకారం మరువలేనిదని కొని యాడుతూ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ భయ్యా రవి, జిల్లా ప్రచార ప్రముఖ్ నరహరి సురేష్, నగర ప్రచార ప్రముఖ్ చింతాల ఉదయ్‌కుమార్, ఉపనగర ప్రచార ప్రముఖ్ చింతల నాగరాజా, స్వయంసేవకులు, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు చింతల మల్లికార్జున్, భక్తజన బృందం పాల్గొన్నారు.

---

# వీరార్జున శాఖ ఆత్మీయ సమ్మేళనం

**హైదరాబాద్**లోని పాతబస్తీ (అలియాబాద్)లో గత 6 దశాబ్దాలుగా నడుస్తున్న వీరార్జున శాఖ స్వయంసేవకుల ఆత్మీయ సమ్మేళనం ఆగస్ట్ 30న భాగ్యనగర్ చార్మినార్ భాగ్ శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో జరిగింది. ఈ శాఖకు చెందిన ఇద్దరు బాల స్వయంసేవకులు అత్యవసర పరిస్థితి సమయంలో కరపత్రాలను వితరణ చేస్తూ పోలీసులకు పట్టుబడి జైలుశిక్ష అనుభవించారు. వారు కూడా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం అందరికీ ఆనంద పరిచింది. ఈ శాఖ నుంచి తయారైన కార్యకర్తలు జిల్లా, క్షేత్ర స్థాయి బాధ్యతలో ఉన్నారు.

స్వయంసేవకులు, కార్యకర్తల త్యాగంవల్లనే దేశంలో మార్పు జరిగిందని అఖిల భారత ధర్మ జాగరణ సహ సంయోజక్ ఏలె శ్యాం అన్నారు. ప్రతి ఒక్కరు నేను హిందువునని గర్వంగా చెప్పుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ సంఘకార్యం ప్రభావంతో భారత్ విశ్వగురువు స్థానాన్ని అధిరోహిస్తుందని, మనం అఖండ భారతాన్ని చూస్తామని అన్నారు.




దక్షిణమధ్య క్షేత్ర సేవాప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ మాట్లాడుతూ, కార్యకర్తలు తయారు కావాలంటే ప్రతి స్వయంసేవకు మిషన్‌లాగా కాకుండా అనౌపచారికంగా వెళ్లి కలవడం ద్వారా కార్యకర్తలు ఎక్కువ పని చేసి ఇతర స్వయంసేవకులకు ఆదర్శంగా ఉంటారని అన్నారు. ఈ సమ్మేళనంలో ప్రాంత సహ కార్యవాహ ఎర్ర నర్సింగ్, సహ ప్రాంత ప్రాచరక్ ప్రభు, సేవాభారతి వాసు, బిఎంఎస్ సామబాల్‌రెడ్డితో పాటు ఆ శాఖ సంబంధించిన 240 మంది స్వయంసేవకులు పాల్గొన్నారు.



# బాల జాగృతి

## భక్తాగ్రేసరులు

# శ్యామశాస్త్రి



శ్యామశాస్త్రి (అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యం) సంగీత త్రయంలో ఒకరు. (మిగతా ఇద్దరు త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్ దీక్షితులు). శ్యామశాస్త్రి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లావాసులు. శతాబ్దాల క్రితమే తమిళనాడులో స్థిరపడ్డారు. 'సంగీతస్వామి'గా ప్రసిద్ధులైన యోగీశ్వరుడు, శ్యామశాస్త్రిలోని ప్రతిభను పసిగట్టి శిష్యుడిగా స్వీకరించారు. శ్యామశాస్త్రి తండ్రి విశ్వనాథశాస్త్రి తంజావూరులోని 'బంగారు కామాక్షి' ఆలయానికి అర్చకత్వం చేశారు. ఆయన తరువాత అర్చకత్వ అవకాశం తనకు సంక్రమించడం అదృష్టంగా భావించిన శ్యామశాస్త్రి భక్త్యావేశంతో 'జననీ నతజన పరిపాలినీ పాహిమాం భవానీ..' అని ఆలపించారట. అదే ఆయన తొలి కృతిగా చెబుతారు. అమ్మవారిని ఇంటి ఆడపడుచుగా భావించి, రాసిన కీర్తనల్లో 'శ్యామ కృష్ణ సహోదరీ' అనే ముద్ర ఉండేది. మధుర మీనాక్షిపై రాసిన కీర్తనలను 'నవ రత్నమాలిక' అంటారు. తనకంటే పిన్నవయస్కులు ముత్తుస్వామికి 'శ్రీవిద్య' ఉపదేశం చేశారు. తన కుమారుడు సుబ్బరామశాస్త్రిని త్యాగరాజ శిష్యుడిగా చేశారు.

## కథ | పండితుడి సలహా



పూర్వం కన్యాకుబ్జంలో పుష్యమిత్రుడనే మహాకవి ఉండేవాడు. ఆయన నిరుపేద కానీ కవిత్వం అద్భుతంగా రాసేవారు. ఆయన కవిత్వం చదివిన శ్రీభట్టు అనే పండితుడు, 'పుష్యమిత్రా! ఇంత మంచి కవిత్వం రాజుగారు వింటే నీకు పేదరికం లేకుండా చేస్తారు. వెంటనే వెళ్లి ఆయన దర్శనం చేసుకో' అని సలహా ఇచ్చాడు.

పుష్యమిత్రుడు రాజదర్శనం చేసుకుని తాను రాసిన కవిత్వం వినిపించాడు. రాజు చాలా సంతోషించి, పుష్యమిత్రుడికి మంచి బహుమానం ఇవ్వడమే కాకుండా ఆయనను తన ఆస్థానంలో చేర్చుకున్నాడు.

కొంతకాలం తర్వాత పుష్యమిత్రుడు, శ్రీభట్టును

## పద్యం

**చిక్కియున్నవేళ సింహంబునైనను**
**బక్క కుక్క కూడ బాధపెట్టు**
**బలిమి లేని వేళ బంతముల్ సెల్లవు**
**విశ్వదాభిరామ వినురవేమ**

**భావం :** మృగరాజు సింహం శక్తిహీనమైనప్పుడు బక్కచిక్కిన కుక్క కూడా బాధిస్తుంది. బలం లేనప్పుడు పంతాలకు పోవడం సరికాదు. ఎంత బలవంతులైనా శక్తి ఉడిగినప్పుడు అల్పులదే పైచేయిగా ఉంటుంది.

## శ్లోకం

**హస్తస్య భూషణం దానం**
**శాస్త్రం కర్ణస్య భూషణం!**
**కంఠస్య భూషణం సత్యం**
**కిమన్యైః కుండలాదిభిః!!**

**భావం :** చేతికి దానమే ఆభరణం. శాస్త్రాలు వినడం చెవులకు అభరణం. సత్యం పలకడం కంఠానికి ఆభరణం. ఇన్ని ఆభరణాలు ఉండగా కుండలాల వంటి ఆభరణలతో పనేమిటి?

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | గంగోర్ |
| తెలంగాణ | తమాషా |
| పంజాబ్ | వీధినాటకం |
| మహారాష్ట్ర | భాంగ్రా |
| రాజస్తాన్ | పేరిణి శివతాండవం |

సమాధానాలు : ఆంధ్రప్రదేశ్–వీధినాటకం, తెలంగాణ–పేరిణి శివతాండవం, పంజాబ్–భాంగ్రా, మహారాష్ట్ర–తమాషా, రాజస్తాన్–గంగోర్.

## శాస్త్రవేత్తలు

### ఆళ్ల వెంకటరామారావు



గుంటూరుకు చెందిన ప్రముఖ శాస్త్రజ్ఞుడు. ఔషధ రంగంలో విశేష కృషి చేశారు. దాదాపు 30 పేటెంట్లు సాధించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సంచాలకుడిగా సేవలందించారు. దాదాపు యాభై రకాల ఔషధాల పరిశోధన, తయారీలో భాగస్వామ్యం వహించారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో అందించిన సేవలకుగానూ 1991లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ పురస్కారం పొందారు. పదవీ విరమణ అనంతరం హైదరాబాద్‌లో ఏవీఆర్ఏ లేబొరేటరీ, ఆర్‌డీ సంస్థలను నెలకొల్పి పలు ఔషధాలను తయారు చేస్తూ పరిశోధనలు చేస్తున్నారు.

## జనరల్ నాలెడ్జ్

1. 'పండిట్' అనే బిరుదు కలిగిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు?
2. కుంటల జలపాతం తెలంగాణలోని ఏ జిల్లాలో ఉంది?
3. నీలగిరి పర్వతాలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?

సమాధానాలు : 1. మదన మోహన మాలవీయ, 2. నిర్మల్ జిల్లా, 3. తమిళనాడు.



కలుసుకుని, 'నేనిప్పుడు రాస్తున్న కవిత్వం, రాజాస్థానంలో నేను చేరకముందు రాసిన కవిత్వపు స్థాయిలో లేదని చాలా మంది అంటున్నారు. నాకు కూడా అది నిజమేననిపిస్తున్నది. కారణం ఏమై ఉంటుందంటారు?' అని అడిగాడు.

అందుకు శ్రీభట్టు, 'ఆ రోజున నీ కవిత్వాన్ని దృష్టిలో పెట్టుకుని రాజుగారు బహుమానం ఇస్తే, ఇప్పుడు రాజుగారు ఇవ్వబోయే బహుమానాన్ని దృష్టిలో పెట్టుకుని నువ్వు కవిత్వం రాస్తున్నావు. ఈ ధోరణి మార్చుకుంటే, నువ్వు ఇప్పుడూ మంచి కవిత్వం రాయగలవు' అని చెప్పాడు.

శ్రీభట్టు పండితుడి మాటల్లోని అంతరార్థం గ్రహించిన పుష్యమిత్రుడు, రాజుగారు ఇచ్చే బహుమానం గురించి ఆలోచన పక్కనపెట్టి, తన పూర్వ పద్ధతిలో కవిత్వం రాస్తూ మంచి కవిగా ప్రసిద్ధుడయ్యాడు. ★

## మెదడుకు మేత

ఆకులు లేని
అడవిలో జీవం లేని
జంతువు జీవాలను
వెంటాడుతుంది?

జవాబు : పేను, దువ్వెన

## మంచిమాట

నిన్ను నువ్వే
కించపరుచుకుంటే
ఎవరూ నిన్ను
గౌరవించలేరు



# వారఫలాలు

**8-14 సెప్టెంబర్ 2025**




సింహంభట్ల సుబ్బారావు

6300674054




**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

దేవాలయాలు సందర్శిస్తారు. రాబడి అనూహ్యంగా పెరిగి అవసరాలు తీరతాయి. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారులకు తగినంత లాభాలు. ఉద్యోగులకు విశేష ఆదరణ లభిస్తుంది. పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుకుంటారు. రచయితలు, క్రీడాకారుల అంచనాలు ఫలిస్తాయి. 13,14 తేదీల్లో శారీరక రుగ్మతలు. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.



**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కుటుంబంలో శుభకార్యాలపై ప్రస్తావన ఉంటుంది. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు మరింత లాభపడతారు. భాగస్వాములతో సఖ్యత. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు చేపడతారు. పారిశ్రామికవేత్తల కృషి ఫలిస్తుంది. పరిశోధకులు, కళాకారులు కొత్త ఆశలతో ముందుకు సాగుతారు. 11,12 తేదీలలో కష్టానికి ఫలితం కనిపించదు. సోదరులతో విభేదాలు. ఖర్చులు. అన్నపూర్ణాష్టకం పఠించండి.



**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఇంతకాలం పడిన శ్రమ కొలిక్కి వస్తుంది. ఇళ్లు, వాహనాలు కొంటారు. స్నేహితులు, బంధువులతో వివాదాలు పరిష్కరించుకుంటారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగులకు పనిభారం తగ్గవచ్చు. రాజకీయవేత్తలకు కొత్త ఆశలు. క్రీడాకారులు, పరిశోధకులకు అనుకోని ఆహ్వానాలు రాగలవు. 8,9 తేదీల్లో కుటుంబంలో తగాదాలు. ఖర్చులు. గణేశ్‌స్తోత్రాలు పఠించండి.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

గృహనిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు. దేవాలయాలు, ఆశ్రమాలు సందర్శిస్తారు. విద్యార్థులకు అనుకున్న అవకాశాలు లభిస్తాయి. వ్యాపారులకు గందరగోళం తొలగి లాభాలు దక్కుతాయి. ఉద్యోగులు విధుల్లో ప్రతిబంధకాలు అధిగమిస్తారు. కళాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. రచయితలు, క్రీడాకారులకు శుభవార్తలు. 10,11 తేదీల్లో కుటుంబసభ్యులతో తగాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. విష్ణుధ్యానం చేయండి.



**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

చిన్ననాటి స్నేహితుల నుంచి కొంత సహాయం అందే అవకాశం. కాంట్రాక్టర్ల యత్నాలు సఫలం. గృహం, వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు సమస్యల నుంచి విముక్తి. రాజకీయవేత్తలకు నూతనోత్సాహం. 12,13 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. స్నేహితులతో వివాదాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.



**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

సన్నిహితులు, సోదరుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. వ్యాపారులకు మరింతగా లాభాలు దక్కవచ్చు. ఉద్యోగులు విధుల్లో అవాంతరాలు అధిగమిస్తారు. రాజకీయ వేత్తలకు శ్రమ ఫలిస్తుంది. రచయితలు, క్రీడా కారులకు నూతనోత్సాహం. 13,14 తేదీల్లో బంధు విరోధాలు. అనుకోని ఖర్చులు. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.



**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

చిన్ననాటి స్నేహితులను కలుసుకుని కష్టసుఖాలు విచారిస్తారు. విద్యార్థుల యత్నాలలో అనుకూలత. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు మరింత లాభిస్తుంది. ఉద్యోగులకు అనుకూల మార్పులు. రాజకీయవేత్తలు అనుకున్నది సాధిస్తారు. కళాకారులు, పరిశోధకుల కృషి కొంత ఫలిస్తుంది. 8,9 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. హనుమాన్ ఛాలీసా పఠించండి.



**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

భూవివాదాలు కొలిక్కి వచ్చి ఊపిరిపీల్చుకుంటారు. గృహనిర్మాణయత్నాలలో కొంత పురోగతి సాధిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగయోగం. సమాజంలో గౌరవప్రతిష్ఠలు మరింత పెరుగుతుంది. కళాకారులు కొత్త అవకాశాలు దక్కించుకుంటారు. రచయితలు, క్రీడాకారులకు ఊహించని పిలుపు రావచ్చు. 9,10 తేదీల్లో స్నేహితుల నుంచి ఒత్తిడులు. ఖర్చులు అధికంగా ఉంటాయి. దుర్గా స్తోత్రాలు పఠించండి.



**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆదాయం మరింత సంతృప్తినిస్తుంది. అనుకున్న కార్యక్రమాలలో కొంత ఆలస్యమైనా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి పిలుపు అందుతుంది. వివాహ యత్నాలు ఫలిస్తాయి. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. కళాకారులు, క్రీడాకారులకు విజయాలు 10,11 తేదీల్లో కుటుంబంలో సమస్యలు. అనారోగ్యం. రాఘవేంద్రస్తోత్రాలు పఠించండి.



**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబంలో ఒత్తిడులతో సతమతమవుతారు. వ్యాపారులు లాభనష్టాలు సమానంగా భరించాల్సిన సమయం. ఉద్యోగులు మరిన్ని బాధ్యతల ఉక్కిరిబిక్కిరి కాగలరు. రాజకీయవేత్తలకు గందరగోళంగా ఉంటుంది. కళాకారులు, క్రీడాకారుల కృషి ఫలించదు. 12,13 తేదీలలో శుభవర్తమానాలు. ధనలబ్ధి. పరిచయాలు పెరుగుతాయి. సుబ్రహ్మణ్య స్తోత్రాలు పఠించండి.



**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

వాహనాలు, ఆభరణాలు కొంటారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటి నిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులకు క్రమేపీ లాభాలు అందుతాయి. ఉద్యోగాలలో ఎదురయ్యే ఇబ్బందులు అధిగమించి దూసుకువెళతారు. కళాకారులు, రచయితలు అనుకున్నది సాధిస్తారు. 13,14 తేదీలలో బంధువర్గంతో తగాదాలు. మానసిక అశాంతి. నవగ్రహస్తోత్రాలు పఠించండి.



**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఒక సమస్యను చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. వాహనాలు, గృహం కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులకు పెట్టుబడుల్లో ఆటంకాలు తొలగుతాయి. ఉద్యోగులకు కొన్ని మార్పులు. రాజకీయవేత్తలకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. కళాకారులు, రచయితలు విజయాలు సాధిస్తారు. 8,9 తేదీల్లో స్నేహితుల నుంచి ఒత్తిడులు. విలువైన వస్తువులు జాగ్రత్తగా చూసుకోండి. ఆదిత్య హృదయం పఠించండి.

# పదరసం-530

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | 3 | | ■ | 4 | | | 5 |
| | ■ | 6 | | ■ | 7 | | ■ | ■ | |
| | ■ | 8 | | 9 | ■ | 10 | | 11 | ■ |
| 12 | | ■ | ■ | 13 | | | ■ | 14 | |
| | ■ | 15 | 16 | | ■ | ■ | 17 | | ■ |
| 18 | 19 | ■ | | ■ | 20 | 21 | ■ | 22 | |
| ■ | 23 | 24 | | | ■ | 25 | 26 | | ■ |
| 27 | ■ | 28 | | ■ | 29 | ■ | | ■ | 30 |
| 31 | | ■ | ■ | 32 | | | ■ | 33 | |
| | ■ | 34 | | | ■ | ■ | 35 | | |

## ఆధారాలు

**అడ్డం**

1. దేశ అత్యున్నత పురస్కారం (5)
4. సాక్షి వ్యాసాల కర్త ఇంటి పేరు (4)
6. జడ... అటు నుంచి (2)
7. జగన్నాథ క్షేత్రం (2)
8. వసంతో స్త్రీ (3)
10. మీ చేతిలోని పత్రిక (3)
12. స్త్రీ వస్త్ర విశేషం...చీర (2)
13. గణితశాస్త్రం (3)
14. ముని (2)
15. అనుకూలం, ఉపాయం (3)
17. పడవ లాంటిదే (2)
18. వంద వేలు(2)
20. సగం... రెండు పావులు (2)
22. కలపను కోసే పరికరం (2)
23. ప్రేమ..అభిమానం (4)
25. పంపకం (3)
28. స్థిరం... నెలవు (2)
31. కాంతి...మత్స్య విశేషం (2)
32. గాథాసప్తశతి కర్త (3)
33. ఆకాశం (2)
34. గవాక్షం (3)
35. పేటిక, పెట్టె (3)

**నిలువు**

1. సరోజినీ నాయుడి బిరుదు (6)
2. పర్యాయం.. ఒకసారి (3)
3. రాత్రి, పసుపు (3)
4. నందనవనంలోని వృక్షం (4)
5. అధిపుడు, గొప్పవాడు... తిరగబడ్డాడు (2)
9. న్యాయం (3)
11. శ్రీరంగక్షేత్రం మరో పేరు (5)
16. పలుకుబడి... చమత్కారం (4)
19. ఓర్పు, సహనం (2)
21. సూర్యుడు (2)
24. జ్ఞానం, బుద్ధి (2)
26. భవిష్యత్... (2)
27. అరవై సెకన్లు (3)
29. పరిపాలించు (2)
30. సర్వవిరోధి (3)
32. మన జాతీయ క్రీడ (2)
33. ఆరోపణ, తిట్టు (2)

## పదరసం - 529 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 వా | రం | ■ | 2 ద్వా | రం | ■ | 3 పా | 4 శు | ప | 5 తం |
| మ | ■ | 6 ఎ | ద | ■ | 7 నా | ■ | క్రు | ■ | బు |
| 8 న | 9 గ | ■ | శి | ■ | 10 క | 11 చు | డు | ■ | ర |
| ■ | 12 య | తి | ■ | ■ | 13 ము | క్క | ■ | 14 బ | ■ |
| 15 మే | ■ | ■ | 16 కో | శం | ■ | ■ | 17 క | లి | 18 మి |
| ■ | 19 స | ■ | వె | ■ | 20 పా | పా | లు | ■ | ష |
| 21 బృ | హ | 22 న్న | ల | ■ | దా | ■ | 23 వ | నం | ■ |
| హ | ■ | సు | ■ | 24 ఏ | లు | ■ | లు | ■ | 25 మూ |
| స్ప | ■ | ■ | 26 క | ను | ■ | 27 రే | ■ | 28 ఆ | ర్తి |
| 29 తి | ది | అ | ■ | 30 గు | హు | డు | ■ | ది | ■ |




**సంక్రాంతి తర్వాత విడుదలైన సినిమాలేవీ ఆశించిన స్థాయిలో ఆడలేదు. దాంతో ద్వితీయార్థంలో వచ్చే పెద్ద సినిమాలు, కథాబలం ఉన్న చిన్న సినిమాలు ఆడతాయని, సినిమా రంగానికి మంచి రోజులు వస్తాయని అంతా భావించారు. కానీ జూలై, ఆగస్ట్ మాసాలు గడిచిపోయినా ఇంకా పరిస్థితులు చక్కబడలేదు సరికదా మరింత అస్తవ్యస్థంగా తయారైంది పరిస్థితి.**

# సినిమా విజయం... ఎండమావి చందం!

గడిచిన రెండు నెలల్లో తెలుగు సినిమా రంగం ఊహకందని సమస్యలను ఎదుర్కొంది. ఒకవైపు సినిమాలు ఆడకపోవడం, మరోవైపు కార్మికుల సమ్మెతో ఈ రంగం కుదేలైంది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సినీ కార్మికుల సమస్యలను కాస్తంత సీరియస్‌గా తీసుకోవడంతో సమ్మెకు శుభం కార్డు పడింది. కానీ ఆ తర్వాత కూడా షూటింగ్స్‌లో ఆశించినంత జోరు కనిపించడంలేదు. సినిమాల సక్సెస్ రేట్ తగ్గిపోవడమే దానికి ప్రధాన కారణం. గతంలో అగ్ర కథానాయకుల సినిమాలు కనీసం రెండు మూడు వారాల పాటు ఏదో ఒక మేరకు సందడి చేసేవి. కానీ ఇప్పుడు సినిమా విడుదలైన మొదటి రోజునే టాక్ స్ప్రెడ్ అయిపోవడంతో... శని, ఆదివారాలు సైతం జనాలు లేక థియేటర్లు వెలవెలబోతున్నాయి. ఇక చిన్న సినిమాల పరిస్థితి చెప్పక్కర్లేదు. కంటెంట్ బాగుందనే మాట వచ్చినా కూడా థియేటర్లకు జనాలు రావడం లేదు. మూడు, నాలుగు వారాలు ఓపిక పడితే ఓటీటీలో వచ్చే వస్తాయనే భావన బాగా బలపడిపోయింది.

గడిచిన రెండు నెలలో 13 అనువాద చిత్రాలతో కలిపి మొత్తం 44 సినిమాలు విడుదల కాగా, వాటిలో 'మహావతార్ నరసింహా' (జులై), 'కూలీ' (ఆగస్ట్)తప్పితే చెప్పుకోదగ్గ విజయం సాధించిన చిత్రం మరొకటి లేదు. నిజానికి ఈ రెండు నెలల్లో వచ్చిన చిన్న సినిమాలో '3 బి.హెచ్.కె., ది 100, సు ఫ్రమ్ సో, మేఘాలు చెప్పిన ప్రేమకథ, కన్యాకుమారి, సుందరకాండ, త్రిబాణధారి బార్బరిక్, అర్జున్ చక్రవర్తి' వంటివి కాస్తంత భిన్నంగా ఉన్నాయని, మేకింగ్ పరంగానూ కాస్తంత విలువతో కూడుకుని ఉన్నాయని చూసిన వారు చెబుతున్నారు. కానీ ఈ సినిమాలు ఆడుతున్న థియేటర్లలో జనాలు మాత్రం లేరు.

## పబ్లిసిటీలోనూ కొత్త ఒరవడి

అగ్ర కథానాయకుల సినిమాలకు సహజంగానే ఉచిత పబ్లిసిటీ లభిస్తుంది. చిన్న సినిమాలు మాత్రం ఏదో రకంగా ప్రేక్షకుల, ప్రజల దృష్టిని ఆకట్టుకోవ డానికి తాప్రతయ పడాల్సి ఉంటుంది. అందువల్ల చిన్న చిత్రాల నిర్మాతలు వీలైతే కాంట్రవర్సీలను కోరుకుంటారు. లేదా తమపై సానుభూతి పవనాలు వీచేలా ప్రవర్తిస్తుంటారు. ఈ మధ్య కాలంలో 'పరదా' సినిమా విషయంలో అదే జరిగింది. ఈ సినిమా ప్రచార సమయంలో 'ఇలాంటి కంటెంట్ బేస్డ్ మూవీస్‌ను సినిమా రంగానికి చెందినవారు, ప్రేక్షకులు పోత్సహించకపోతే ఎలా?' అంటూ హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ కన్నీళ్లు పెట్టుకుంది. అలానే 'త్రిబాణధారి బార్బరిక్' మూవీ విడుదలైన రెండో రోజున థియేటర్‌లో పట్టుమని పదిహేను మంది కూడా లేరంటూ దర్శకుడు మోహన్ వాపోయారు. తన సినిమా జనాలకు నచ్చలేదని భావిస్తున్నానంటూ కాలి చెప్పు తీసి కొట్టుకున్నాడు. ఈ రెండు వీడియోలు సోషల్ మీడియాల్లో వైరల్ అయ్యాయి. ఇక మరికొందరు నిర్మాతలు సినిమా విడుదలకు ముందు శపథాలు చేస్తున్నారు. నాని, సూర్యదేవర నాగవంశీ, విజయ్ దేవరకొండ కూడా అలా ప్రగల్బాలు పలికారు. అయితే వీరి సినిమాలకూ మిశ్రమ స్పందనే లభిం చింది. నిజానికి ప్రేక్షకులు ఇలాంటి ప్రచారాలను కూడా విశ్వసించడం మానేశారు. ఎవరైనా సినిమాకు సక్సెస్ మీట్ పెడితే... 'ఫ్లాప్ అయ్యింది కాబట్టే పబ్లిసిటీ కోసం వీటిని పెట్టుకుంటున్నార'ని జనాలు భావిస్తున్నారు.

## రీ-రిలీజ్ పరిస్థితీ దారుణమే!

గతంలో మంచి విజయం సాధించిన కొన్ని సినిమాలను సందర్భోచితంగా రీ-రిలీజ్ చేయడం ఈ మధ్య కాలంలో ఎక్కువైంది. అందులో కొన్ని సినిమాలకు మంచి ఆదరణ కూడా లభించింది. కానీ జూలైలో వచ్చిన 'కుమారి 21 ఎఫ్, మిరపకాయ్, ఏం మాయ చేసావే' వంటి సినిమాలకు ఆదరణ దక్కలేదు. అలానే ఆగస్ట్‌లో 'అతడు, స్టాలిన్, రగడ, తమ్ముడు' వంటి సినిమాలు ఆయా హీరోల పుట్టినరోజుల సందర్భంగా రీ-రిలీజ్ అయ్యాయి. వాటిలో ఏ ఒక్కటీ బాక్సాఫీస్ బరిలో ప్రభావం చూపలేకపోయింది. అగ్ర కథానాయకుల సినిమాలు సైతం మినిమమ్ కలెక్షన్స్ సాధించలేక పోవడం విడ్డూరం. రెండేళ్ల క్రితమే 'యూనివర్సిటీ' సినిమాను విడుదల చేసిన ఆర్. నారాయణమూర్తి ఇప్పుడు తగదునమ్మా అంటూ దాన్ని రీ-రిలీజ్ చేశారు. పైగా ఇదే మొదటిసారి విడుదల అనేంత స్థాయిలో త్రివిక్రమ్ శ్రీనివాస్, బ్రహ్మానందంతో పాటు పలువురు రాజకీయ నాయకులు, కవులు, కళాకారులతో భారీగా పబ్లిసిటీ చేయించారు. ఇప్పుడు కూడా ఈ సినిమా వైపు కన్నెత్తి చేసిన వారే లేకపోయారు. ఇలా గడిచిన రెండు మాసాల్లో సినిమా రంగంలో విజయం ఎండమావిగా మారిపోయింది. అయితే... వీటిని పట్టించుకోకుండా... 'ఉందిలే మంచి కాలం ముందు ముందునా...' అని సాగడం సినిమా వారికి అలవాటు కాబట్టి త్వరలో రాబోతున్న సినిమాలైనా విజయాన్ని సాధించి, కాసుల వర్షం కురిపిస్తాయనే ఆశతో ఉన్నారు. చూద్దాం... ఏం జరుగుతుందో!

**– అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్



వన గణేశ

# గణేశ్ ప్రతిమల తయారీలో పెరిగిన పర్యావరణ స్పృహ

భారతీయతలోనే పర్యావరణ పరిరక్షణ అంతర్లీనంగా ఉంది. పండుగలలో, పర్వదినాలలో చేసే కార్యక్రమాలలో కూడా ఈ పర్యావరణ పరిరక్షణ స్పృహ నానాటికీ పెరుగుతున్నది. గణేశ్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఈ స్పృహ సుస్పష్టం. కేవలం మట్టితో, సహజ రంగులతో విగ్రహాలను తయారు చేస్తున్నారు. నిమజ్జనం తరువాత వాటి ప్రభావం ప్రకృతి మీద ప్రతికూలత చూపకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇందుకు సంబంధించి ఈ సంవత్సరం ముంబైలో ప్రతిష్ఠించిన రెండు గణేశ్ విగ్రహాలు దేశం దృష్టిని ఆకర్షించాయి. భయాందర్‌లో ప్రతిష్ఠించిన 12 అడుగుల విగ్రహాన్ని పూర్తిగా మట్టితో తయారు చేశారు. మట్టి, చెట్ల వేళ్లు, తాళ్లు, జనపనార ఉపయోగించి ఈ విగ్రహం తయారు చేశారు. ఇది విశేషంగా భక్తులను ఆకర్షించింది. ఇక ఎంజీ రోడ్‌లోని ములంద్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడిని వన రక్షకుడుగా రూపొందించారు. దట్టమైన అడవిలో కూర్చుని గణనాయకుడు రక్షిస్తున్నట్టు ఈ విగ్రహం ఉంది. పైగా ఈ రెండు విగ్రహాలు నిరాడంబరత్వం ఉట్టిపడేటట్టు మలిచారు. ఇళ్లలో కూడా రసాయనిక పదార్థాలతో చేసిన రంగులు వేసిన వినాయక ప్రతిమలను కాకుండా మట్టితో మలచిన బొమ్మలు పెట్టుకుని పూజ చేసే వారి సంఖ్య పెరిగింది.



భయాందర్ వినాయకుడు

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 46




మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి మెచ్చండి పంచండి